ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 17, ఆగస్టు 2024


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తూ ఓ వృద్ధుడి ఆనందం

పేదలకు భరోసా లభించింది. అన్నార్తుల ఆకలి తీరింది. పేదలు, కార్మికులు, ఆసరా లేని వారికి రూ.5కే టీడీపీ ప్రభుత్వం భోజనం అందిస్తోంది. ఒంగోలు నగరంలో నాలుగు అన్న క్యాంటీన్‌లను మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారీయాతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. చీమకుర్తిలో ఒకటి ప్రారంభించగా బీఎన్, కలెక్టర్ పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్‌లను దుర్మార్గంగా తొలగించి పేదల కడుపు కొట్టింది. అయితే తిరిగి టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే పేదల కడుపు నింపే క్యాంటీన్లను ఆధునికీకరించి రాష్ట్రవ్యాప్తంగా పునః ప్రారంభించింది. నాణ్యమైన టిఫిన్, భోజనం అందిస్తోంది. అందులో అల్పాహారం, భోజనం చేసిన వారు చాలా ఆనందంగా ఉందని అభిప్రాయపడ్డారు. తమకు ఇక దిగులు లేదని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పేదల కడుపు నిండగా..

మళ్లీ తెరుచుకున్న అన్న క్యాంటీన్లు


ఒంగోలులో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, పక్కన ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, కలెక్టర్ అన్సారియా,

- ప్రారంభించిన మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్
- ఒంగోలు, చీమకుర్తిలలో సంబరంలా కార్యక్రమం
- రెండుచోట్లా పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ఆనందం వ్యక్తంచేస్తున్న పేదలు, కార్మికులు

జిల్లాలో ఐదు కేంద్రాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలు తిరిగేసరికి మళ్లీ అన్న క్యాంటీన్‌లు తెరుచుకున్నాయి. తొలివిడతగా రాష్ట్రంలో వంద అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించగా అందులో జిల్లాలో ఐదు ఉన్నాయి. గతంలో ఒంగోలులో నాలుగు, చీమకుర్తి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిలలో ఒక్కొక్కటి ఏర్పాటు చేశారు. వాటిని తిరిగి ప్రారంభిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఎత్తేసి వాటిలో రకరకాల కార్యకలాపాలు నిర్వహించింది. వాటిని తిరిగి అన్న క్యాంటీన్లుగా మార్చేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వ రూ.54లక్షలు వెచ్చించి మరమ్మతులు చేసింది. ఆహ్లాదకరమైన వాతావరణం అన్న క్యాంటీన్లు వద్ద ఉండేలా తీర్చిదిద్దారు. తొలివిడతగా ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మిగిలిన మూడు వచ్చేనెల 1 నుంచి ప్రారంభించేలా ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం ఉదయం తొలుత చీమకుర్తిలో అన్న క్యాంటీన్‌ను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రారంభించారు. అనంతరం ఒంగోలులోని నాలుగు క్యాంటీన్లను మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ ప్రారంభించగా ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయకుమార్, కలెక్టర్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పేదోడి ఆకలి తీర్చే అన్నక్యాంటీన్లు పునఃప్రారంభమయ్యాయి. తొలివిడతగా జిల్లాలోని ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి శుక్రవారం నుంచి తెరుచుకున్నాయి. మరో మూడు పట్టణాలలో వచ్చేనెల 1 నుంచి ప్రారంభంకానున్నాయి. పండుగ వాతావరణంలో సంబరంగా క్యాంటీన్లను మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్‌లు ప్రారంభించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. గత టీడీపీ ప్రభుత్వకాలంలో తొలిగా అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేసి పేదలకు కేవలం రూ.5కే అల్పాహారం, భోజనం అందజేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం కలిపి కేవలం రూ.15కే దొరికేది. దీంతో నిత్యం వందలాదిమంది పేదలు వాటిలో భోజనం చేసి కడుపునింపుకునే వారు. రుచిశుచి బాగా ఉండటంతోపాటు అతి తక్కువ ధరకు ఆహారం లభించడంతో పేదలకు ఆకలి తీరేది. దీంతో


ఒంగోలులోని అంబేద్కర్ భవన్ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద క్యూలో నిల్చొన్న పేదలు, కార్మికులు

అనతికాలంలోనే విశేషంగా వాటికి ప్రజాదరణ లభించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేసి అప్పటివరకు ఆకలి తీర్చుకున్న పేదల కడుపు కొట్టింది. కాగా తిరిగి అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లు పునరుద్ధరించి పేదల ఆకలి తీరుస్తామని కూటమి తరపున టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇతర నేతలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఆచరణలో పెట్టారు.

క్యాంటీన్‌లోనే టిఫిన్ చేసిన మంత్రి, ఎమ్మెల్యేలు

క్యాంటీన్ల ప్రారంభ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు పేదలకు వడ్డించడంతోపాటు తాము కూడా టిఫిన్ తిన్నారు. నామమాత్రపు ధరతో పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడంతోపాటు రుచికి శుచికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు తెలిపారు. కాగా అన్న క్యాంటీన్లలో ఆహారం కోసం పేదలు భారీగా తరలివచ్చారు. ఆటో, భవన నిర్మాణ కార్మికులు, మెకానిక్, ఇతర వృత్తులు చేసుకునేవారు బయటి ప్రాంతాల నుంచి ఆస్పత్రులు, కార్యాలయాలకు పనులపై వచ్చిన వారు బారులు తీరి నిలబడి టోకెన్లు తీసుకొని భోజనం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలి పారు. ఒంగోలులోని నాలుగు క్యాంటీన్ల లో ఉదయం 2,200 మంది టిఫిన్, 2వేల మంది మధ్యాహ్న భోజనం చేసినట్లు సమాచారం. చీమకుర్తిలోనూ 500మందికిపైగా కడుపునింపుకున్నారు. రెండు పట్టణాలలో భారీగా పేదలు రావడంతో ఆయా క్యాంటీన్ల వద్ద మధ్యాహ్న సమయంలో తీవ్ర రద్దీ వాతావరణం కనిపించింది. ఒంగోలులో సరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి అన్న క్యాంటీన్ల ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందజేశారు.

ఇక తిండికి దిగుల్లేదు



ఏదైనా పనికి వెళదామంటే ఆరోగ్యం సహకరించడం లేదు. వయస్సు అయిపోంది. వెళ్లినా పని ఇచ్చేవారు లేరు. ఇన్ని రోజులూ తిండి కోసం అల్లాడిపోయా. చేతిలో పైసా లేక ప్రతిరోజూ తెలియని బాధ ఉండేది. మహాత్ముడు చంద్రబాబు పుణ్యమా అని ఇక తిండికి దిగుల్లేదు. రూ.5కే కడుపు నిండా అన్నం పెడుతున్నారు. మాలాంటి వారికి ఇంతకన్నా ఏమి కావాలి.

- బేబీ, వృద్ధురాలు

చంద్రబాబు చల్లగా ఉండాలి



కూలి చేసుకుంటే కానీ రోజు గడవదు. కనిగిరి నుంచి వచ్చా. మళ్లీ అన్న క్యాంటీన్లు రావడంతో ధైర్యం వచ్చింది. కూలి డబ్బులు ఎంత వచ్చినా బాధ లేదు. ఎందుకంటే రూ.15 ఉంటే చాలు మూడు పూటలా కడుపు నిండా టిఫిన్, భోజనం దొరుకుతుంది. వైసీపీ హయాంలో మాలాంటి పేదలందరూ ఆకలితో అల్లాడారు. ఇసుక సమస్యతో పనులు కూడా ఉండేవి కావు. టీడీపీ ప్రభుత్వం రావడం సంతోషంగా ఉంది. చంద్రబాబు చల్లగా ఉండాలి.

- రమేష్, కార్మికుడు

అన్న క్యాంటీన్ ఉంది చాలు



నేను బీఏ, బీఈడీ చదువుకున్నా. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా. ఎలాంటి ఉద్యోగం లేదు. ఆదాయం లేదు. అయితే అన్న క్యాంటీన్ తిరిగి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. నాణ్యమైన భోజనం దొరుకుతుంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు క్యాంటీన్లు మాకు ఆసరాగా ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయం.

- మల్లికార్జున్, బీఏ బీఈడీ, దివ్యాంగుడు

టీడీపీ హయాంలోనే పేదలు బాగు



వైసీపీ హయాంలో అన్నివర్గాల కార్మికులు అవస్థలు పడ్డారు. ఇసుక సమస్యతో పనులు లేవు. తిండి కోసం అగచాట్లు పడ్డాం. కానీ టీడీపీ ప్రభుత్వంతోనే పేదల కష్టాలు తీరుతాయని మరోసారి రుజువైంది. అన్న క్యాంటీన్లు మళ్లీ పెట్టడంతో మాలాంటి కార్మికులకు ఇక ఇబ్బంది లేదు. రోజుకు రూ.15 ఖర్చుపెడితే మూడు పూటలా ఆకలి తీరుతుంది.


- రామేశ్వర్, ఆటోడ్రైవర్

906 మంది టీచర్లు మిగులు

విద్యార్థుల సంఖ్య ఆధారంగా లెక్కతేల్చిన అధికారులు



ఒంగోలు(విద్య), ఆగస్టు 16 : జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి 906 మంది టీచర్లు మిగులుగా తేలారు. పాఠశాలల్లో ఆగస్టు 8 నాటికి ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా లెక్క తేల్చారు. మిగులు టీచర్ల సంఖ్యలో ఒంగోలు డివిజన్ ప్రథమస్థానంలో ఉండగా మార్కాపురం డివిజన్ చివరి స్థానంలో నిలిచింది. ఒంగోలు మండలంలో అత్యధికంగా 56 మంది టీచర్లు మిగులుగా ఉన్నారు. బేస్తవారపేట మండలంలో అతి తక్కువగా కేవలం ఆరుగురు మాత్రమే తేలారు. అర్ధవీడు మండలంలో తొమ్మిది మంది, సీఎస్‌పురం మండలంలో 20 మంది, చీమకుర్తి మండలంలో 33మంది, కంభంలో 31, దర్శిలో 50మంది, దొనకొండ 15, గిద్దలూరులో 13 మంది, హెచ్‌ఎంపాడులో 16 మంది, కనిగిరిలో 49 మంది, కొమరోలులో 8 మంది, కేకేమిట్లలో 33 మంది, కొండపిలో 12 మంది, కొత్తపట్నం 24 మంది, కురిచేడులో 20మంది మిగులుగా తేలారు. మద్దిపాడులో 26 మంది, మార్కాపురంలో 79, మర్రిపూడిలో 22, ఒంగోలులో 56 మంది, ముండ్లమూరులో 25 మంది, ఎన్‌జిపాడులో 14 మంది, పీసీపల్లిలో 23 మంది, పెదదోర్నాలలో 8 మంది, పామూరులో 14 మంది, పెద్దారవీడులో 27 మంది, పొదిలిలో 27 మంది, పొన్నలూరులో 24 మంది, పుల్లలచెరువులో 12 మంది, రాచర్లలో 27మంది, ఎస్ఎన్‌పాడులో 33 మంది, సింగరాయకొండలో 20మంది, తాళ్లూరులో 18 మంది, టంగుటూరులో 14 మంది, తర్లుపాడులో 19 మంది, త్రిపురాంతకంలో 26 మంది, వెలిగండ్లలో 7, వైపాలెంలో 23, జరుగుమల్లిలో ఏడుగురు టీచర్లు మిగులుగా ఉన్నారు. తాజాగా ఈనెల 16 వరకు పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని సర్దుబాటు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. దీంతో ఇప్పటివరకు ఏ పాఠశాలలో నమోదు లేని విద్యార్థుల కోసం టీచర్లు జల్లెడపడుతున్నారు. ఒకరిద్దరు విద్యార్థులు తక్కువైన చోట పోస్టులు మిగులుగా తేలుతుంటే వాటిని పోకుండా కాపాడుకోనేందుకు టీచర్లు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే యుడైస్‌లో పేరు ఉన్న విద్యార్థులందరూ భౌతికంగా ప్రతిరోజు పాఠశాలకు రావాల్సిందేనని విద్యాశాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో టీచర్ల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో, పోస్టులు పోకుండా ఏ మేరకు కాపాడుకుంటారో వేచిచూడాల్సిందే.



నేడు 93 ఎస్ఎంసీలకు ఎన్నికలు

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 16 : జిల్లాలోని 93 పాఠశాలల్లో శనివారం యాజమాన్య కమిటీల (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 8న జిల్లాలో 2,405 పాఠశాలలకు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించగా కోరం లేకపోవడం, కోర్టు ఉత్తర్వులు, ఇతర కారణాలతో 93 పాఠశాలల్లో నిలిచిపోయాయి 2,312 స్కూళ్లకు ఎన్నికలు జరిగాయి. నిలిచిపోయిన పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు మళ్లీ షెడ్యూల్ ప్రకటించారు. తాజా షెడ్యూల్ ప్రకారం శనివారం పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాలి. ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదట ప్రతి తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ముగ్గురిని సభ్యులుగా ఎన్నుకుంటారు ఎన్నికైన సభ్యులు తమలో ఒకరిని ఛైర్మన్‌గా, మరొకరిని వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు. అనంతరం కమిటీ తొలి సమావేశం నిర్వహిస్తారు. ఎన్నికలను చేతులెత్తే విధానంలో లేదా నోటిమాటగా నిర్వహిస్తారు. తప్పని పరిస్థితుల్లో అయితేనే రహస్య ఓటింగ్ విధానంలో ఎన్నికను చేపడతారు.

భూప్రకంపనలు!

- రెవెన్యూ రికార్డుల పరిశీలన ప్రారంభం
- జిల్లావ్యాప్తంగా లక్షా 30వేల ఎకరాలు హాంఫట్
- కనిగిరి డివిజన్‌లోనే 70వేల ఎకరాలు మింగిన వైసీపీ నేతలు
- అందులో కనిగిరి మండలంలోనే 25వేల ఎకరాలు
- విచారణకు ప్రత్యేక అధికారుల నియామకం

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 16 : వైసీపీ ప్రభుత్వంలో చట్టాలను చట్టుబండలు చేసి భూములను కాజేసిన వ్యవహారంపై విచారణ ప్రారంభం కానుంది. గత వైసీపీ పాలనలో అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూముల విషయంలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. మదనపల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం తగులబెట్టిన ఉదంతం నేపథ్యంలో జగన్ పాలనలో అక్రమాలు పెద్దఎత్తున జరిగాయని కూటమి ప్రభుత్వం గుర్తించింది. రాయలసీమ జిల్లాలతోపాటు మన జిల్లాలో కూడా భూములను వైసీపీ సానుభూతిపరులు, ప్రజాప్రతినిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించారు. అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూములను దోచుకున్న వారి పని పట్టేందుకు శ్రీకారం చుట్టడంతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది. జిల్లాలో సుమారు లక్షా 30వేల ఎకరాల భూములను ఆవిధంగా వైసీపీ ప్రభుత్వంలో కాజేసినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. అందులో ఒక్క కనిగిరి డివిజన్‌లోనే సుమారు 70వేల ఎకరాలు ఉన్నట్లు తెలుస్తోంది. వాటికి అక్రమంగా రికార్డులను తారుమారు చేసినట్లు సమాచారం. అందులో కనిగిరి మండలంలోనే అత్యధికంగా 25వేల ఎకరాల అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు తేల్చారు. కొనకనమిట్ల మండలంలో 11,974 ఎకరాలు, సీఎస్‌పురం మండలంలో 8,900 ఎకరాలు, పుల్లలచెరువు మండలంలో 10వేల ఎకరాలు, మార్కాపురం మండలంలో 3,300 ఎకరాలు, వైపాలెంలో 2,350 ఎకరాల మేర రికార్డులను తారుమారు చేసినట్లు సమాచారం. మిగిలిన మండలాల్లో కూడా ప్రభుత్వ, అసైన్డ్ భూములను రికార్డులను మార్చేసి వైసీపీ నేతలు కైంకర్యం చేశారు.

పరిశీలనకు ప్రత్యేక బృందాలు

జిల్లాలోని కనిగిరి మండల పరిధిలో భూపత్రాల పరిశీలన కోసం కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌తోపాటు తహసీల్దార్, సర్వేయర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఈ రికార్డులు తనిఖీ చేయనున్నారు. రికార్డుల పునఃపరిశీలనకు మరింత సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. కనిగిరి మండలంలో భూ అక్రమాలపై విచారణ పూర్తయిన తర్వాత వచ్చే ఫలితాల ఆధారంగా మిగిలిన మండలాల్లో ఈ తనిఖీలు చేపట్టనున్నారు అందుకోసం ప్రత్యేకంగా ప్రొఫార్మాను రూపొందించి డేటా సేకరణకు సిద్ధం చేయాలని సీసీఎల్‌ఏ ఆదేశించినట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో కొందరు వైసీపీ నేతలు భూముల దందా చిట్టా స్పష్టంగా బయటకు వస్తున్నట్లు తెలిసింది. కాగా వైసీపీ నేతలు తమ భూ అక్రమాల రికార్డులను బయటి సమాజం తెలుసుకోకుండా ఉండేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కనిగిరి ప్రాంతంలో అసైన్డ్, ప్రభుత్వ భూములతోపాటు పట్టా భూముల విషయంలో కూడా పెద్దఎత్తున అక్రమాలు చేశారని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం ముందుగా కనిగిరి మండలంలో భూముల రికార్డుల తనిఖీకి శ్రీకారం చుట్టడంతో వైసీపీ నేతల్లో ఆందోళన ప్రారంభమైంది.

ఇద్దరు సీఐలకు పోస్టింగ్

- వీఆర్‌కు ఐదుగురు ఎస్సైలు
- ఒకరికి అటాచ్‌మెంట్

ఒంగోలు (క్రైం), ఆగస్టు 16 : పోలీసు శాఖలో బదిలీల్లో భాగంగా ఇద్దరు సీఐలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఐదుగురు ఎస్సైలను వీఆర్‌కు పంపారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరు రేంజ్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం రేంజ్ వీఆర్‌లో ఉన్న టి.వెంకటేశ్వర్లును పొదిలి సర్కిల్‌కు, ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న మేడా శ్రీనివాసరావును ఒంగోలు టూటౌన్ సీఐగా బదిలీ చేశారు. ఐదుగురు ఎస్‌ఐలను వీఆర్‌కు పిలిచారు. వీరిలో పుల్లలచెరువు ఎస్ఐ ఎండి.ఫిరోజ్ ఫాతిమా, పొదిలి ఎస్సై గొట్టం కోటయ్య, మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు, దర్శి ఎస్ఐ ఆర్.సుమన్, జరుగుమల్లి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, పొన్నలూరు ఎస్ఐ ఎం.వి.రాజేష్ ఉన్నారు. జిల్లాలో వీఆర్‌లో ఉన్న ఎస్ఐ బి.మహేంద్రను పుల్లలచెరువు పోలీసు స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులిచ్చారు.



ఒంగోలు జీజీహెచ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జూడాలు

వైద్యుల ఆందోళన ఉధృతం

- రక్షణ చట్టం కోసం డిమాండ్
- ఒంగోలు జీజీహెచ్‌లో విధులు బహిష్కరించిన 'జూడా'లు

లోపలి పేజీల్లో..

పేదల ఆకలి తీర్చడమే టీడీపీ కూటమి లక్ష్యం

మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల

నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు హయాంలో పేదల కోసం పథకాలు

ఘనంగా అన్న క్యాంటీన్లు ప్రారంభం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 16 : పేదల ఆకలి తీర్చడమే తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు నాయుడు పేదల కోసం అనేక పథకాలకు శ్రీకారం పలికారని, అందులో భాగంగానే అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు అన్న క్యాంటీన్లకు మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారీయాతో కలిసి శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల ఆకలితో బాధపడకూడనే సంకల్పంతో టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరమారావు రూ.2లకే కిలో బియ్యం పథకాన్ని ప్రారంభించారన్నారు. ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసి, పేదల ఆకలి కష్టాలు తీరుస్తున్నారని చెప్పారు. గత టీడీపీ పాలనలో 2014 నుంచి 2019 సంవత్సరం వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 195 అన్న క్యాంటీన్లు కొనసాగించామని, అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటిని దుర్మార్గంగా తొలగించి పేదల కడుపు కొట్టారని విమర్శించారు. ఐదేళ్ళ పరిపాలనలో టీడీపీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను తొలగించి, జగన్ పేర్లతో పథకాలు పెట్టుకున్నారని, అంతేగాకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ వారిపై కేసులు, దాడులు, దౌర్జన్యాలతోనే పాలించారే తప్ప పేద ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. పేదల కోసం పెట్టిన అన్నక్యాంటీన్లు తొలగించి సచివాలయాలుగా, ఇతర కార్యాలయాలుగా మార్చివేశారని విమర్శించారు. అయితే తిరిగి టీడీపీ కూటమిని ప్రజలు గెలిపించారని, అన్న క్యాంటీన్లను ఆధునికీరించి రాష్ట్ర వ్యాప్తంగా మరలా ప్రాంభించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. రూ.5లకే నాణ్యమైన టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం అందించడం సంతోషంగా ఉందన్నారు. మరి కొన్ని క్యాంటీన్లను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ నగరంలోని పేదలతోపాటు వివిధ పనుల నిమిత్తం ఒంగోలుకు విచ్చేసేవారికి అన్నక్యాంటీన్లు ఎంతోగానో ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత ప్రజలకు, కార్మికులకు, ఆసరాల లేని వారికి రూ.5లకే ఆకలి తీరబోతుందని వెల్లడించారు. అదేవిధంగా అన్న క్యాంటీన్లకు ఆర్థికంగా చేయూత నిచ్చే దాతల కోసం ప్రత్యేక బ్యాంక్ అకౌంట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. దాతలు ఎవరైనా ముందుకు రావచ్చని తెలిపారు. ఐదేళ్ళ తర్వాత తిరిగి అన్నక్యాంటీన్లు ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్థానిక కర్నూలురోడ్‌లోని పవర్ ఆఫీసు వద్ద, కొత్తపట్నం బస్టాండ్‌లోని రైతు బజారు, దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో, పాత రిమ్స్‌లో అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, నగర కమిషనరు ఎం.జశ్వంత్‌రావు, ఇతర అధికారులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్

అన్నక్యాంటీన్ పునఃప్రారంభం సంతోషకరం

● ఎమ్మెల్యే బీఎన్

చీమకుర్తి: అన్నార్తుల ఆకలితీర్చే అన్నక్యాంటీన్లను పునః ప్రారంభించటంతో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. చీమకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపాన ఉన్న అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే బీఎన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు స్వయంగా వడ్డించారు. అందరితో కలిసి పదార్థాలను భుజించారు. అన్న క్యాంటీన్‌కు డాక్యుమెంట్ రైటర్ మందపాటి శ్రీనివాసులు రూ.50వేలు, ఎంఎన్‌ఆర్ కనస్ట్రక్షన్ అధినేత మన్నం నాగరాజు రూ.25వేలు విరాళం ప్రకటించారు. వీరందరిని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, నాయకులు కాట్రగడ్డ రమణయ్య, పూనాటి వెంకట్రావు, యడ్లపల్లి రామబ్రహ్మం, ఉన్నం సుబ్బారావు, రావిపాటి రాంబాబు, గంగుల శివపార్వతి, గొల్లపూడి శ్రీనివాసరావు, కమిషనర్ ఈశ్వరరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బీఎన్, కలెక్టర్ అన్సారియా

శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ దాతృత్వం

● అన్న క్యాంటీన్లకు రూ.లక్ష విరాళం



మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ అన్సారియాకు చెక్కును అందజేస్తున్న చైర్మన్ రమణారెడ్డి

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 16: పేదల ఆకలి తీర్చడం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్లకు తమ వంతు చేయూతగా శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ.రమణారెడ్డి రూ.లక్షను విరాళంగా అందించారు. శుక్రవారం ఒంగోలులో జరిగిన అన్నక్యాంటీన్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు ఆయన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారీయా, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, శ్రీసరస్వతి విద్యాసంస్థల ఏవో ఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 16 : జిల్లాలో జలజీవన్ మిషన్ పథకం కింద పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపు హాలులో శుక్రవారం జలజీవన్ మిషన్ పథకం అమలు తీరుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో జలజీవన్‌మిషన్ పథకం కింద రూ.654.67 కోట్లతో 2,424 పనులు ప్రతిపాదించగా 1,721 పనులు మంజూరు జరిగిందన్నారు. ఇప్పటివరకు 1,304 పనులు పూర్తి కాగా, మరో 185 పనులు పురోగతిలో ఉన్నాయని, 232 పనులు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులకు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడకుండా చూడాలని, గిరిజనప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్రమం తప్పకుండా వాటర్‌టెస్టింగ్ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌లీఈఊత, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కెరీర్ పోస్టర్ల ఆవిష్కరణ : విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ తర్వాత ఉద్యోగ అవకాశాలు, చదవాల్సిన కోర్సులపై అవగాహన కల్పించేందుకు సమగ్రశిక్ష, రోటరీ క్లబ్ సంయుక్తంగా రూపొందించిన కెరీర్ పోస్టర్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ కెరీర్ చార్ట్‌ను ప్రతి పాఠశాలలో, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో సుభద్ర, రోటరీ క్లబ్ రీజనల్ చైర్మన్ బి.లక్ష్మీనారాయణ, ప్రెసిడెంట్ ఎం.మురళీకృష్ణ, సెక్రటరీ ఎన్.సురేంద్రబాబు, ట్రెజరర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వారోత్సవాలు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు16: ప్రముఖ సినీనటుడు చిరంజీవి జన్మదిన వారోత్సవాలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో మొదటి రోజు ఒంగోలులోని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్‌లో దివ్యాంగులకు పండ్లు, బ్రెడ్, ఫర్నీచర్‌ను అందజేశారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు శ్రీనివాసరావు, యువత అధ్యక్షులు అడుసుమల్లి వెంకట్రావు, ఉపాధ్యక్షులు మెట్టు సుబ్బయ్య, నగర చిరంజీవి యువత అధ్యక్షుడు వడ్డి రాజేష్, జనసేన పార్టీ నగర ప్రధాన కార్యదర్శి ముత్యాల రామకృష్ణ, మేడిశెట్టి సుబ్బారావు, కుర్రా ప్రసాద్‌బాబు, 43వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు యాదల రాధాకృష్ణమూర్తి, కంచర్ల వీరాస్వామి, చెన్నంశెట్టి రాంబాబు, నరహరి సాంబయ్య, కొట్టె వెంకటేశ్వర్లు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్పీకి స్నేహితుల శుభాకాంక్షలు



ఎస్పీ దామోదర్‌కు బొకే అందజేస్తున్న స్నేహితులు

ఒంగోలు(క్రైం), ఆగస్టు16: జిల్లాకు ఎస్పీగా వచ్చిన ఏఆర్.దామోదర్‌ను తనతో పాటు చదువుకున్న స్నేహితులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఒంగోలులో ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ దామోదర్‌ను కలిసి సత్కరించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎస్పీ దామోదర్‌తో చదువుకున్న జిల్లాకు చెందిన డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, డాక్టర్ నలమోతు వెంకటేశ్వర్లు, ఎంఎస్ఎన్.అంజనేయులు, గోరంట్ల శ్రీమన్నారాయణలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్విస్ ఫార్మసీ విద్యార్థుల పరిశ్రమల సందర్శన



కేంవెల్ పరిశ్రమ వద్ద విద్యార్థులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 16: ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల రెండు రోజుల ఇండస్ట్రియల్‌విజిట్ శుక్రవారంతో ముగిసింది. వీరు బెంగళూరులోని ప్రముఖ ఫార్మాకంపెనీ రెసిఫార్మా, కేంవెల్ బయాలాజికల్ యూనిట్‌ను సందర్శించి శిక్షణ పొందారు. ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, చైర్మన్ సూర్యకళ్యాణచక్రవర్తి, వైస్‌చైర్మన్ ఎస్.గాయత్రి వారిని అభినందించారు.

వైద్యుల ఆందోళన ఉధృతం

దాడుల నియంత్రణకు రక్షణ చట్టం కోసం డిమాండ్ ● ఒంగోలు జీజీహెచ్‌లో విధులను బహిష్కరించిన 'జూడా'లు

నేడు 24 గంటల పాటు వైద్యసేవలు బంద్ ● మద్దతు తెలిపిన ఇండియన్ డెంటల్ అసోసియేషన్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 16 : వైద్యులపై దాడులు నిరసిస్తూ, వైద్య రంగం భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలోని ఆర్‌జీకేఏఆర్ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ (జూడా) అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. శుక్రవారం ఒంగోలులోని జీజీహెచ్ (రిమ్స్) ఆవరణంలో ఒక రోజు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జూడా సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.అజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 9న కోల్‌కత్తాలో వైద్య పీజీ విద్యార్థినిని అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి, హత్య చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఆ ఘటనను నిరసిస్తూ ఆర్‌జీకేఏఆర్ కాలేజీ విద్యార్థులు ఈనెల 14న నిరసన తెలియజేస్తుండగా కొందరు దుండగులు నిరసనలో పాల్గొన్న డాక్టర్లపై దాడులు చేసి, హాస్పిటల్‌ను ధ్వంసం చేయడం దారుణంగా ఉందని చెప్పారు. రోజురోజుకు వైద్యరంగానికి భద్రత కరువైపోయిందన్నారు. ప్రజల ప్రాణాల కోసం తాము కష్టపడుతుంటే, కొందరు ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా జూడా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు విధులు బహిష్కరించి తమ నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగ రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొగ్గు శృతి, ప్రధానకార్యదర్శులు చైతన్యసాయి, విష్ణుప్రియ, జాయింట్ సెక్రటరీ వినాష్‌కుమార్, ఎం.సాయిపవిత్ర, కోశాధికారులు బి.రాము, హర్షిత, కమిటీ సభ్యులు, జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు ప్లకార్డులతో తమ నిరసన తెలియజేశారు.

నేడు అన్ని ఆసుపత్రుల్లో 24 గంటలు వైద్యసేవలు బంద్ : ఐఎంఏ

కోల్‌కత్తాలో మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 24 వైద్యసేవలు బంద్ చేసినట్లు ఐఎంఈ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు అన్నీ ఆసుపత్రులో వైద్యులు, వైద్యసిబ్బంది తమ సేవలను నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందని ఐఎంఏ ప్రతినిధులు ఝాన్సీ, శ్రీదేవి, రావిపాటి జయశేఖర్, మన్నే వీరయ్య చౌదరి, జాలాది మణిబాబు తెలిపారు. ప్రజలు అర్థం చేసుకుని వైద్యులకు న్యాయం జరిగేలా సహకరించాలని వారు కోరారు.

వైద్యుల ఆందోళనకు ఐడీఏ మద్దతు - డాక్టర్ నామినేని

వైద్యులపై దాడులు, కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం బాధకరమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) తన సానుభూతిని తెలియజేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనకు నిరసనగా ఐఎంఏ, జూనియర్ డాక్టర్స్ సంఘం చేస్తున్న నిరసనకు ఐడీఏ మద్దతు తెలియజేస్తుందని, రాష్ట్రంలో 24 గంటలపాటు వైద్య సేవలను బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు దంత వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.



ప్లకార్డులను చేతపట్టి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



ఒంగోలులోని అచలానంద ఆశ్రమంలో వ్రతాలు చేస్తున్న భక్తులు



ఉప్పుగుండూరులో వరలక్ష్మీ వ్రతాలలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు16: శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు అమ్మవారి దేవస్థానాలలో ప్రత్యేక అలంకరణలు, లక్షకుంకుమార్చనలు చేశారు. ఒంగోలు నగరం కేశవస్వామిపేట విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి అర్చకులు జొన్నలగడ్డ వేదసాయి శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. స్థానిక మంగమూరురోడ్డు అచలానంద ఆశ్రమంలో ఏర్పాటు చేసిన వరలక్ష్మీ వ్రతాలలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు పరిపూర్ణ సిద్ధానంద వరలక్ష్మీ వ్రత మహాత్యాన్ని వివరించారు. అదేవిధంగా సత్యసాయిమందిరంలో సైతం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కోడెల శ్రీనివాస రావు, ఇతర సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా పలు ఆలయాలకు మహిళలు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: మండలంలో ఉప్పుగుండూరులో అంకమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన 108 మంది మహిళా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి గోనుగుంట నాగేశ్వరశర్మ అర్చక బృందం అభిషేకాలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బెల్లం సీతారామయ్య, మోటుమర్రి నాగేశ్వరరావు, గోనుగుంట వీరబ్రహ్మాచారి, సాతులూరి సత్యనారాయణ, గోగినేని నాగేశ్వరరావు, గోగినేని ఆంజనేయులు పాల్గొన్నారు.

మద్దిరాలపాడులో..

మద్దిరాలపాడులోని జంట నాగుల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయం వద్ద శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. పూజారి అచ్యుతానంద శర్మ, రవి కుమార్ శర్మలు వేద మంత్రాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా ఈ నెల 18న జరగనున్న మహాగణపతి, శ్రీప్రసన్నాంజనేయ, శ్రీగురుదత్తాత్రేయ, సరస్వతి, శిఖర, జీవ ధ్వజ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవాలు సందర్భంగా శుక్రవారం దేవస్థానం వద్ద జలదీక్షలు ప్రారంభించారు.



మద్దిరాలపాడులో భక్తుల పూజలు

ఉప్పుగుండూరు పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

రూ.42.70 లక్షల నిధులు దుర్వినియోగం

రికార్డు అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు

రికార్డుల ట్యాంపరింగ్‌కు సహకరించిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు డీపీవో సిఫార్సు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 16: నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్ శ్రీరామమూర్తిని సస్పెండ్ చేస్తూ డీపీవో ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీరామమూర్తి ఇన్‌చార్జీ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన కాలంలో నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదుపై ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారి పద్మను విచారణ చేశారు. విచారణ సమయంలో రికార్డులు, నిధుల వినియోగంపై ఎలాంటి బిల్లులు లేకపోవడంతో రూ.42,70,666 దుర్వినియోగమైనట్లు గుర్తించారు. మొదటి సారిచేసిన విచారణలో రికార్డుల్లో నమోదు చేసిన బిల్లులను రెండో సారి విచారణలో చూపించారు. శ్రీరామమూర్తి 2021 ఏప్రిల్ 1నుంచి 2023 జూన్ 30 వరకు పంచాయతీకార్యదర్శిగా పనిచేసిన కాలంలో రూ 42,70,666 నిధులకు ఎలాంటి బిల్లులు లేవని, అందుకు సంబంధించిన రికార్డుల్లో కూడా నమోదు చేయలేదని విచారణ తేలడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా రెండోసారి విచారణ సమయంలో రికార్డుల ట్యాంపరింగ్‌కు సహకరించిన ప్రస్తుత పంచాయతీకార్యదర్శి హరిబాబుపై చర్యలు తీసుకోవాలని డీపీవో కమిషనర్‌కు సిఫార్సుచేశారు. అందుకు రికార్డు అసిస్టెంట్ పోతురాజు కూడా సహకరించడంతో ఆయనకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. వారంరోజుల్లో సంజాయిషీ ఇవ్వకపోతే పంచాయతీరాజ్‌చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు. ఇప్పటికే సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ నిధుల దుర్వినియోగంలో సర్పంచ్ పాత్ర కూడా ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు తదుపరి చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

అవీ..ఇవీ..

బాల కార్మికులను పని నుంచి విముక్తి చేయాలి

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 16 బాల కార్మికులను పని నుంచి విముక్తి కల్పించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో బాలకార్మికులు అనేది లేకుండా చేయడానికి జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. ఎక్కడైన బాలకార్మికులు ఉంటే వారిని పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. అయితే బడిలో చేర్పించిన తర్వాత వారు పాఠశాలకు వెళ్తున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ ఉప కమిషనర్ గాయత్రిదేవి, డీఈవో సుభద్ర, పిల్లల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, సార్డ్ ప్రతినిధి ఆర్.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు

● డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), ఆగస్టు 16 : జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు ఈనెల 17,19వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న స్కూలు కాంప్లెక్స్‌కు పరిధిలోని 50శాతం మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, తెలుగు, గణితం, బయాలజీ టీచర్లు, నియోజకవర్గ స్థాయిలో పీడీ, పీఈటీలు హాజరు కావాలి. 19వ తేదీన మిగిలిన 50శాతం ప్రాథమిక పాఠశాలల టీచర్లు, హిందీ, ఇంగ్లీషు, పీఎస్, సోషల్ స్టడీస్ సబ్జెక్టు టీచర్లు హాజరుకావాలి. స్కూలు కాంప్లెక్స్‌లు ఉదయం 9నుంచి సాయంత్రం 4.20 గంటల వరకు నిర్వహిస్తారు. స్కూలు కాంప్లెక్స్ నిర్వహించే పాఠశాలలో ఎక్కడైనా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక ఉంటే ఆ పాఠశాలలో 20వతేదీన కాంప్లెక్స్ సమావేశం నిర్వహించాలి. ఇతర పాఠశాలలన్నింటిలో 17,19 తేదీల్లో యథావిధిగా కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయని డీఈవో తెలిపారు. ఉప విద్యాధికారులు, డైట్ అధ్యాపకులు, ఎంఈవోలు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని డీఈవో కోరారు.

పేస్‌లో నెట్‌వర్కింగ్‌పై అవగాహన సదస్సు



చాందినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 16 : ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఐటీ విద్యార్థులకు శుక్రవారం నెట్ వర్కింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. డెలాయిట్ కంపెనీకి చెందిన అనలిస్ట్ ట్రైనీ ఎన్‌డీ. చాందిని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నెట్‌వర్కింగ్ ప్రాముఖ్యత, ఉద్యోగ అవకాశాలపై వివరించారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ నెట్ వర్కింగ్‌లో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని, విద్యార్థులు తమ లక్ష్యాలకు అనుగుణంగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, హెచ్‌వోడీ ఎస్.శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ రాజేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మార్కాపురంలో జేవీవీ వార్షిక సభలు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 16: మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 18న జన విజ్ఞాన వేదిక జిల్లా 18వ వార్షిక సభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీహెచ్.జయప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సభలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎంగేయానంద్, జేవీవీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుర్రా రామారావులు పాల్గొంటారన్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ప్రతినిధులు ఈ సభలకు హాజరుకావాలని వారు కోరారు.

పేకాట స్థావరంపై దాడి

నాగులుప్పలపాడు, ఆగస్టు 16: అమ్మనబ్రోలులోని పేకాట స్థావరంపై ఎస్సై బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జూదరులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద రూ.9862 నగదు, 7 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాగాణి భూములకు చెరువు నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న నాయకులు

సంతనూతలపాడు, ఆగస్టు 16: సంతనూతలపాడు పెద్దచెరువు తూము నుంచి గ్రామంలోని మాగాణిభూముల సాగుకోసం శుక్రవారం టీడీపీ నాయకులు నీటిని వదిలారు. దాదాపు 300 ఎకరాల మాగాణి భూములు సాగులోకి రానున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాధినేని శ్రీరామమూర్తి, ముప్పరాజు శ్రీను, తన్నీరు శ్రీను, బి.శంకర్, ఎన్.సుబ్బారావు, ఆర్.సురేష్, జనార్దన్, ఉమామహేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

మద్దిపాడు, ఆగస్టు 16: గ్రామాలలో కోడిపందేలు, పేకాట, బెట్టింగులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వెలగా మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మోటార్ సైకిల్, ఆటో, కారు వాహనాలకు ఆర్టీవో సిఫార్సు చేసిన నెంబర్ ప్లేట్‌లనే వాడాలని, ఇతర ఏ నెంబర్ ప్లేట్లు వాడినా చర్యలు తప్పవన్నారు. మోటార్‌సైకిల్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. సైబర్ నేరాల గురించి అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లో వచ్చే ఓటీపీలు ఎవరికీ చెప్పకూడదని ఆయన సూచించారు.

పేద బ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మద్దిపాడు, ఆగస్టు 16: పేద బ్రాహ్మణులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జొన్నపట్ల శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మద్దిపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలతో పాటు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం రుణాలు అందించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో బ్రాహ్మణులకు రాజకీయ పరంగా అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కొణిజేటి శివకుమార్, వెంకటేశ్వ ర్లుపంతులు తదితరులు పాల్గొన్నారు.

పీటీసీ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 16: ఒంగోలులోని పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌గా నాన్ కేడర్ ఎస్పీ డాక్టర్ కేవీ.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు రాష్ట్రంలో నాన్‌కేడర్ ఎస్పీలుతో పాటు అదనపు ఎస్పీలను బదిలీ చేశారు. ప్రస్తుతం ఇంటిలిజెన్స్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావును పీటీసీ ప్రిన్సిపాల్‌గా నియమించారు. అదేవిధంగా ఎస్ఈబీ ఏఎస్పీగా ఉన్న ఎస్.సూర్యచంద్రను సీఐడీకి బదిలీ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నేతలు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 16 : ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని, ప్రతిష్ఠను ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పెంచిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంఘం నేతలతో సంతోషాలు పంచుకున్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వరకుమార్, కోశాధికారి భాను, సహాధ్యక్షుడు మధు, టౌన్ అధ్యక్షుడు రంగారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, ఒంగోలు తాలూకా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి : సీఐ

సంతనూతలపాడు, ఆగస్టు 16: మండలంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు ఆదేశించారు. శుక్రవారం సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన పలు రికార్డులను పరిశీలించారు. సంఘ విద్రోహక శక్తుల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకట్రావు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తి: చీమకుర్తి ప్రభుత్వ హాస్టల్‌లోని బాలికలతో సీఐ సుబ్బారావు ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని, ఏ సమస్య వచ్చినా తన సెల్ నెంబర్ 9121102131కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే హాస్టల్ వార్డెన్‌కు బాలికల భద్రతపై పలు సూచనలు చేశారు.

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం



దక్షిణామూర్తి, కాళభైరవ స్వామి విగ్రహాలు

టంగుటూరు, ఆగస్టు 16 : టంగుటూరులోని శ్రీగంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో దక్షిణామూర్తి, కాళభైరవ స్వామి నూతన విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం శనివారం నుంచి మూడు రోజులు నిర్వహిస్తున్నారు. తొలి రోజు వేదపారాయణం, పుట్టిమట్టి తేవడం, ఆలయ ప్రదక్షిణం, ప్రతిష్ఠ సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, దీక్షా స్వీకరణ, అఖండస్థాపన, అంకురార్పణ, మండప ఆరాధన, కుంభ ఆరాధన, అగ్ని ప్రతిష్ఠాపన, మహానైవేద్యం, హారతి, మంత్రపుష్పం నిర్వహిస్తారు. ఆది, సోమవారాల్లో పూజా కార్యక్రమాలు ఉదయం 6గంటలకే ప్రారంభమవుతాయి. 19వతేదీ మధ్యాహ్నం ఉదయం 8.47 గంటలకు దక్షిణామూర్తి, కాళభైరవస్వామి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఉంటుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శివాలయం పూజారి భవానీ శంకర శర్మ కోరారు.

రేషన్ దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు



రేషన్ దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

టంగుటూరు, ఆగస్టు 16 : టంగుటూరులోని రెండు రేషన్ దుకాణాలపై శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. మూడో నంబర్ షాపు డీలరు కూరపాటి వీరరాఘవులు, తొమ్మిదో నంబర్ షాపు డీలర్ ముక్కాల నరసింహారావుల సమక్షంలో అక్కడి బియ్యం బస్తాలను లెక్కించారు. రెండుచోట్లా ఎక్కువ మొత్తంలో బియ్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఇద్దరిపై 6ఏ కేసులు నమోదు చేశారు.

వరి సాగుకు రైతుల సన్నద్ధం

- నిండిన జలాశయాలు
- నీరు విడుదల చేస్తామంటున్న అధికారులు



సాగర్ కాలువలో ప్రవహిస్తున్న నీరు

దర్శి ఆగస్టు 16: సాగర్ ఆయకట్టు రైతులు వరిసాగుకు సన్నద్ధమవుతున్నారు. శ్రీశైలం, సాగర్ జలాశయాలు ఇప్పటికే పూర్తిగా నిండటంతో అధికారులు సాగుకు నీరు ఇస్తున్నట్లు అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. రెండవ జోన్ పరిధిలో ఉన్న ప్రకాశం, బాపట్ల జిల్లాలలో ఉన్న ఆయకట్టుకు సెప్టెంబరు మొదటివారం నుంచి సాగునీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ ఉన్నతాధికారులు ప్రకటించారు. దీంతో దర్శి డివిజన్‌లోని ఆయకట్టు రైతులు వరిసాగుకు సన్నద్ధమవుతున్నారు. గత రెండేళ్లుగా సాగర్ ఆయకట్టు భూములు సాగుకు నోచుకోలేదు. వర్షాలు కూడా సరిగా లేక మెట్టపంటలు కూడా సరిగా పండలేదు. ఈఏడాది పుష్కలంగా వర్షాలు పడి జలాశయాలు పూర్తిగా నిండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుంది. దర్శి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలోని లక్ష ఎకరాల ఆయకట్టులో 60 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. మిగిలిన చివరి ఆయకట్టు భూముల్లో ఆరుతడి పంటలు వేస్తారు. ఇప్పటికే అనేకచోట్ల కంది, సజ్జ పైర్లు సాగు చేశారు. ప్రస్తుతం సాగర్ కాలువలో నీరు సరఫరా అవుతున్నందున నార్లు పోసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వరినాట్లు వేసేందుకు 40 రోజులు సమయం ఉన్నందున ఈలోపు సజ్జ పైరు కోసుకొని వరినాట్లు వేసేందుకు వీలుగా స్వల్పకాలిక వరి వంగడాలను ఎంచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీవిధాలుగా అనుకూల పరిస్థితులు నెలకొన్నాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు!

- కొండపిలో 260 మందికి ఇళ్ల పట్టాలు
- ఊరికి దూరంగా ఉండటంతో ఆసక్తి చూపని లబ్ధిదారులు
- గృహం నిర్మించింది ఒక్కరే..
- ప్రారంభించి మధ్యలోనే నిలిపేసిన 20 మంది
- నిర్మాణ సామగ్రి దొంగలపాలు
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో తీగ చోరీ

కొండపి, ఆగస్టు 16 : కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పేరుతో హడావుడి చేసింది. అయితే ఊరూరా వెలిసిన జగనన్న కాలనీలు పేరు గొప్ప. ఊరుదిబ్బ అన్న చందంగా తయారయ్యాయి. గ్రామాలకు దూరంగా నివాస యోగ్యంకాని ప్రాంతాల్లో లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో అక్కడ ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.



చిల్లచెట్ల మధ్యలో అరకొరగా నిర్మించిన ఇళ్లు



తీగను దొంగిలించి వదిలేసిన ట్రాన్స్‌ఫార్మర్

దీంతో భూమి కొనుగోలు, మెరక, మౌలిక సదుపాయాల కల్పన పేరుతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. పనిలోపనిగా వైసీపీ నేతలు జేబులు నింపుకున్నారు. ఇప్పుడు ఈ కాలనీల్లో దొంగలు పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని తీగను చోరీ చేస్తున్నారు. నిర్మాణదారులకు నీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులను సైతం ఎత్తుకెళ్తున్నారు. కొండపిలోని జగనన్న కాలనీని పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. నియోజకవర్గ కేంద్రమైన కొండపిలోని లబ్ధిదారులకు స్థానిక పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెం-ఇలవర (నేతివారిపాలెం) గ్రామాల మధ్య భూమి కొనుగోలు చేసి జగనన్న కాలనీకి ప్రభుత్వం కేటాయించింది. అది కొండపికి దాదాపు 5 కి.మీ దూరంలో ఉంది. దాదాపు 260 మంది పేదలకు ఈ కాలనీలో పట్టాలు ఇచ్చారు. అయితే ఏదో ఒకటి పట్టా ఇస్తున్నారని పేదలు తీసుకున్నారు. కానీ కాలనీలో ఒక్క ఇల్లు మాత్రమే నిర్మాణం పూర్తయింది. దాదాపు 20 గృహాలు వివిధ స్థాయిల్లో నిలిచిపోయాయి. మిగిలిన వారు అసలు నిర్మాణాలే ప్రారంభించలేదు. ఇళ్ల మెటీరియల్‌ను దొంగలు చోరీ చేయడంతో గృహాలు నిర్మించుకోవాలనుకున్న ఒకరిద్దరు లబ్ధిదారులు కూడా వెనక్కి తగ్గారు. భూమి కొనుగోలుకు లక్షల రూపాయలు ప్రభుత్వం వెచ్చించింది. ఇవికాక మెరకలు తోలడానికి, పదేపదే ఈ కాలనీలో జంగిల్ క్లియరెన్స్ పేరుతో వైసీపీ నాయకులు లక్షల రూపాయలు దోచుకున్నారు. నాయకుల స్వార్థం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు.



నీటి వసతికోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ట్యాంకులను పడేసిన దృశ్యం

ట్రాన్స్‌ఫార్మర్‌లలో తీగ చోరీ

కాలనీలో ఇళ్లు లేకుండానే విద్యుత్ సౌకర్యానికి ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసింది. స్తంభాలు, తీగలు, 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఐదింటిని విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసింది. అయితే కాలనీ ఎప్పుడూ నిర్మానుష్యంగా ఉంటుండటంతో దొంగలు ఐదు ట్రాన్స్‌ఫార్మర్‌లలోని విలువైన తీగను చోరీ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లను కింద చెట్లలో పడేశారు. కొన్ని ఇళ్లకు కలిపి అక్కడే సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేసి వీటిపై 10 వేల లీటర్ల నీటి ట్యాంకులు ఉంచారు. నిర్మాణదారులకు నీటి వసతి లేకపోవడంతో వీటిని ఏర్పాటు చేశారు. వాటిలో కొన్నింటిని దొంగలు మాయం చేశారు. మరికొన్ని వృథాగా పడి ఉన్నాయి. మొత్తంగా జగనన్న కాలనీ పేరుతో లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని పలువురు విమర్శిస్తున్నారు. అనువైన భూమిలో పట్టాలు ఇవ్వకపోవడవ వల్లనే ఇదంతా జరిగిందని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఎస్సీలకు తీవ్ర అన్యాయం

- సుప్రీంకోర్టు జడ్జిమెంట్ దళితులకు వ్యతిరేకం
- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి మోహన్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 16 : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. శుక్రవారం ఒంగోలులోని కెమెరామెన్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విదేశీ కుట్రలకు తలొగ్గి దళితుల విభజనకు పోతే దేశంలో బంగ్లాదేశ్ పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. ముఖ్యంగా మోదీ, చంద్రబాబులు పేద దళితుల జోలికి దయచేసి వెళ్లవద్దన్నారు. సుప్రీం కోర్టులో వచ్చిన జడ్జిమెంట్ దళితులకు వ్యతిరేకమైందని పేర్కొన్నారు. బీజేపీ, కొన్ని ప్రాంతీయ పార్టీలు దళితులను విభజించాలని చూస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీపతి ప్రకాష్, విజేంద్ర బహుజన్, మన్నం ప్రసన్నరాజులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్‌లో పరికరాలు చోరీ



దొంగలు అపహరించిన పరికరాలు

పొందూరు(టంగుటూరు), ఆగస్టు 16 : మండలంలోని పొందూరులో ఉన్న ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫారంలో ఉండే పరికరాలన్నీ అపహరణకు గురయ్యాయి. దీంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పథకం కింద 1,050 ఎకరాల ఆయకట్టు ఉంది. సమీపంలోని వెంకటేశ్వర అభ్యుదయ ఎత్తిపోతల పథకంలో చోరీ జరిగిందన్న విషయం తెలిసినప్పటి నుండి తరచుగా ఈ ఎల్ఐ ఆయకట్టు రైతులు తనిఖీ చేస్తూనే ఉన్నారు. వారం క్రితం కూడా అన్నీ బాగానే ఉన్నాయి. శుక్రవారం చూడగా ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ తీసి అందులోని రాగి తీగతో సహ ప్రధాన వైర్లన్నీ తెంచుకుపోయారు. వీటి విలువ రూ.2లక్షల వరకూ ఉంటుందని భావిస్తున్నారు. రైతులు శుక్రవారం రాత్రి టంగుటూరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అక్కడ ఉన్న సింగరాయకొండ సీఐకి ఫిర్యాదు చేశారు.

వీఆర్‌కు దర్శి ఎస్ఐ సుమన్



ఎస్ఐ సుమన్

దర్శి, ఆగస్టు 16: దర్శి ఎస్ఐ సుమన్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. ఈమేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులందాయి. ఒంగోలులో వెంటనే రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఇటీవల ఎన్నికల సమయంలో ఎస్ఐ సుమన్ వైసీపీ నాయకులకు తొత్తుగా వ్యవహరించి టీడీపీ శ్రేణులను ఇబ్బందులు పెట్టారని విమర్శలు వచ్చాయి. టీడీపీ కార్యకర్తలపై, నాయకులపై వైసీపీ శ్రేణులు దాడులు చేసినప్పటికీ పట్టించుకోలేదు. వైసీపీ ఏజెంట్‌గా మారిన ఎస్ఐ దాడికి గురైన టీడీపీ క్యాడర్‌పైనే కేసులు పెట్టారు. ఎన్నికల అనంతరం టీడీపీ నాయకులు ఎస్ఐని కలిసి న్యాయబద్ధంగా వ్యవహరించాలని కోరినా పట్టించుకోలేదు. ఇక్కడ కాకపోతే మరోచోటికి వెళతామంటూ వ్యాఖ్యలు చేయటంతో ఎస్ఐపై టీడీపీ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎన్నికల సందర్భంగా ఇక్కడ పోలీసులు వ్యవహరించిన తీరు, జరిగిన సంఘటలను సాక్ష్యాధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన అశోక్‌వర్ధన్‌రెడ్డిని, సీఐ షేక్ షమీముల్లాను హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేశారు. వారికి ఇంకా పోస్టింగ్‌లు ఇవ్వలేదు. తాజాగా ఎస్ఐ సుమన్‌పై కూడా వేటు పడింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్న విషయం ఈచర్యల ద్వారా రుజువైంది. వైసీపీతో అంటకాగిన పోలీస్ అధికారులను బదిలీ చేయటంతోపాటు పోస్టింగ్ ఇవ్వకుండా పక్కనపెట్టడంతో వారు వ్యవహరించిన తీరుకు గుణపాఠం జరిగిందని ప్రజలు చర్చించుకున్నారు.

అన్ని ప్రభుత్వ ఆఫీసులపై సోలార్ ప్యానళ్లు

మంత్రి రవి

అద్దంకి, ఆగస్టు 16: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేపట్టామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కార్యాలయం ఆవరణంలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్ శాఖను సొంత లాభాలకే వాడుకుందని, కొత్తగా ఎలాంటి ఉత్పత్తీ చేపట్టలేదన్నారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సొంత ఇళ్లపైకూడా విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీ ఇస్తుందన్నారు. రాష్ట్రంలో 46 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేశామని చెప్పారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ లైన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో కాలనీలు

- కొండలు, వాగుల మధ్యలో ఇళ్ల స్థలాల కేటాయింపు
- పనికిరావని వదిలేసిన లబ్ధిదారులు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా



కొండ, వాగు మధ్యలో జగనన్న కాలనీ

దర్శి, ఆగస్టు 16: జగనన్న కాలనీల పేరుతో గత వైసీపీ పాలకులు కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేశారు. సుదూర ప్రాంతాల్లో కొండలు, వాగుల మధ్యలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. నివాసయోగ్యం కానిచోట స్థలాలు కేటాయించటంతో తొలుత ప్లాట్లు తీసుకున్న లబ్ధిదారులు అధికశాతం మంది అక్కడకు వెళ్లలేదు. గృహాలు నిర్మించలేదు. నిర్మించిన కొద్దిపాటి ఇళ్లు చిల్లచెట్ల మధ్యలో నిరుపయోగంగా ఉన్నాయి. లేఅవుట్ అభివృద్ధి పేరుతో వైసీపీ నాయకులు కోట్లాది రూపాయలు స్వాహా చేశారు. అనేక మంది లబ్ధిదారులు అక్కడకు వెళ్లేందుకు ఇష్టం లేక ఇళ్ల స్థలాలను వదులుకున్నారు.

సుదూర ప్రాంతంలో ప్లాట్లు కేటాయింపు

దర్శి పట్టణానికి చెందిన పేద ప్రజలకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో చలివేంద్రం కొండ వద్ద ఇళ్ల స్థలాలు కేటాయించారు. అక్కడ మూడు ప్రాంతాల్లో ప్లాట్లు వేశారు. ఒక లేఅవుట్ కొండ ఆనుకొని ఉంది. మరో లేఅవుట్ కొండకు, వాగుకు మధ్యలో ఉంది. కొంతమంది ఇళ్లు నిర్మించినప్పటికీ ఇప్పటికీ ఆ వాగు అలాగే ఉంది. ఆ ఇళ్ల వద్దకు వెళ్లేందుకు సరైన మార్గం కూడా లేదు. అక్కడ సుమారు 1200 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. తొలిదశలో 755 కాలనీలు మంజూరుచేశారు. ఇప్పటివరకు గత ఐదేళ్ళ కాలంలో 291 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఆ ఇళ్లు కూడా చిల్లచెట్ల మధ్యలో అధికశాతం నిరుపయోగంగా ఉన్నాయి. దర్శి రూరల్ మండలంలో 1200 కాలనీలు మంజూరు కాగా కేవలం 569 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి అలాగే ఉన్నాయి.

దర్శి పట్టణవాసులకు చలివేంద్ర కొండమీద ఇచ్చిన లేఅవుట్ల అభివృద్ధికి లెవలింగ్ పేరుతో రూ.2 కోట్లు ఖర్చు చేశారు. విద్యుత్, రోడ్డు, నీటి సరఫరా పేరుతో కోటి రూపాయలకు పైగా ఖర్చు చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయినప్పటికీ ఆ కాలనీలు ఎందుకూ ఉపయోగపడలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇచ్చిన కాలనీలు కూడా అధికశాతం వాగులు, వంకల మధ్య స్థలాలు కేటాయించారు. అక్కడ కూడా నివాసయోగ్యం కాకపోవటంతో అధికశాతం మంది ఇళ్లు నిర్మించ లేదు. అనేకమంది ప్లాట్లు కూడా వదులుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అనువైన ప్రాంతాల్లో మళ్లీ ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మిస్తారనే ఆశతో పేదలు ఎదురు చూస్తున్నారు. సీఎం చంద్రబాబు పట్టణ వాసులకు రెండున్నర సెంట్లు, గ్రామీణ ప్రాంతవాసులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించటంతో పాటు గృహాల నిర్మాణానికి రూ.4 లక్షలు కేటాయిస్తామని ప్రకటించటంతో పేదల సొంత ఇంటి కల నిజమవుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.



పునాదుల్లోనే నిలిచిపోయిన గృహాల నిర్మాణం



చిల్లచెట్ల మధ్యలో నిరుపయోగంగా గృహాలు

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ
- ఫ్రీహోల్డ్, అక్రమ వెంచర్ల పరిశీలన



మాచవరం వద్ద ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న జేసీ, రిజిస్ట్రార్

కనిగిరి, ఆగస్టు 16: ఫ్రీహోల్డ్ మార్పుల్లో అక్రమమని తేలితే ఆయా అధికారులపై చర్యలు తప్పవని జేసీ గోపాలకృష్ణ హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూముల రీసర్వేపై శుక్రవారం రెవెన్యూ అధికారుల, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఏమాత్రం ఆమోదయోగ్యంకాని భూములను ఫ్రీహోల్డ్ భూములుగా మార్చి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోనే కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా అక్రమంగా వెంచర్ల వేసినట్టు చెప్పారు. ఇటీవల ఫ్రీహోల్డ్ భూములుగా ఆయా భూములను మార్చిన విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి నిజాలు నిగ్గు తేల్చాలని అధికారులను జేసీ ఆదేశించారు. కనిగిరి మండలంలోని 40 రెవెన్యూ గ్రామాల్లో 13 బృందాలుగా ఏర్పాటుచేసి ఫ్రీహోల్డ్‌కు సంబంధించిన భూముల దస్త్రాలను పరిశీలించనున్నట్లు జేసీ తెలిపారు. ఒక్కో బృందంలో డీటీ, ఆర్ఐ, వీఆర్ఓ, సర్వేయర్ ఉంటారన్నారు. వీరు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి 22ఏ, బీ, సీ, డీ, అసైన్డ్‌ల్యాండ్, ఫ్రీహోల్డ్, చుక్కల భూములను పరిశీలించి పూర్తి స్థాయిలో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఫ్రీహోల్డ్ మార్పుచేసే క్రమంలో నిబంధనలను ఏమేరకు పరిగణనలోకి తీసుకున్నారో భూమి సర్వే నెంబరు వివరాల్లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం రెవెన్యూ రికార్డు గదిని పరిశీలించారు. ఆతర్వాత యడవల్లి పరిధిలోని 309/1 భూమిని, మాచవరం, శంఖవరం ప్రాంతాల్లో ఫ్రీహోల్డ్ కింద మార్పులు చేసిన భూముల రికార్డులను పరిశీలించి సర్వే చేపట్టారు. ఫ్రీహోల్డ్ భూములుగా మారిన భూములకు రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత అడ్డగింత

● మున్సిపల్ అధికారులతో మాజీ ఎమ్మెల్యే రాంబాబు వాగ్వాదం ● చోద్యం చూసిన పోలీసు అధికారులు



భవనం వద్ద నెలకొన్న ఉద్రిక్త పరిస్థితి

మార్కాపురం, ఆగస్టు 16: మార్కాపురం పట్టణంలో ఐదేళ్ల కాలంలో సాగిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించారు. ఈ క్రమంలో ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్న పలు బహుళ అంతస్థుల భవనాల యజమానులకు నోటీసులిచ్చారు. పలుమార్లు నోటీసులిచ్చినా యజమానులు పట్టించుకోలేదు. దీంతో మున్సిపాలిటీ అధికారుల ప్రణాళికకు విరుద్ధంగా నిర్మించిన ఎనిమిది భవనాలకు సంబంధించి అదనపు అంతస్థులను కూల్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్థానిక కళాశాల రోడ్డులోని తాటిపత్రి అశోక్‌రెడ్డికి సంబంధించిన బహుళ అంతస్థుల భవనం వద్దకు మున్సిపాలిటీ అధికారులు వెళ్లారు. ఈ క్రమంలో తమ భవనంలో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన రెండు అంతస్థులను తొలగించాలంటే ముందు పట్టణంలోని మిగిలిన అక్రమ నిర్మాణాలను కూల్చాలని అడ్డం తిరిగారు. భవన యజమానితో మాట్లాడుతుండగానే వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు గుంటక సుబ్బారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డిలు అక్కడకు చేరుకున్నారు. పట్టణంలో ఎక్కడా లేనట్లు వైసీపీ సానుభూతిపరుల భవనాలే మీకు కనిపించాయా? అంటూ మున్సిపల్ అధికారులపై మాజీ ఎమ్మెల్యే రాంబాబు మండిపడ్డారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడితే సహించేదిలేదని అధికారులపై ధ్వజమెత్తారు. అయితే అధికారులు తాము చట్టప్రకారం నడుచుకుంటామని, ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చినా భవనాల యజమానులు స్పందించలేదని కమిషనర్ కిరణ్ సమాధానం చెప్పారు. నిర్మాణాలను తొలగించేందుకు వచ్చిన కార్మికులను పైఅంతస్థుకు వెళ్లకుండా సుమారు 100 మంది అడ్డుకోవడంతో మున్సిపల్ అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

పట్టీపట్టనట్లు వ్యవహరించిన పోలీసులు

అక్రమ నిర్మాణాలు తొలగించేటప్పుడు భవన యజమానులు గొడవలకు దిగే అవకాశం ఉన్నట్లు గ్రహించిన మున్సిపల్ అధికారులు ముందుగానే పోలీసులకు సమాచారం అందించారు. ఉదయం 9.00 గంటల కల్లా సుమారు 20 మంది సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్న పట్టణ, గ్రామీణ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వర్లు నాయక్‌లు గొడవ జరుగుతున్నా, చోద్యం చూశారు. మున్సిపల్ అధికారులను, కార్మికులను వైసీపీ నాయకులు, భవన యజమాని బంధువులు భవనం లోపలికి వెళ్లడానికి అడ్డంతిరిగినా ఎస్సైలు కానీ సిబ్బంది కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏదో మొక్కుబడిగా అక్కడకు వచ్చి ప్రేక్షకపాత్ర పోషించి వెళ్లిపోయారు. పోలీసుల తీరుతో ఏమీ చేయాలో పాలుపోని మున్సిపల్ అధికారులు, కార్మికులు వెనుదిరిగి వెళ్లిపోవాల్సిన దుస్థితి నెలకొంది. అనంతరం ఘటనపై మున్సిపల్ కమిషనర్ ఈ కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు తాటిపర్తి అశోక్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు మొత్తం నలుగురిపై కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేశారు. మున్సిపల్ అధికారుల విధులకు ఆటంకం కలిగించినందుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

వారం రోజులు గడువు ఇచ్చాం

కళాశాల రోడ్డులోని తాటిపత్రి అశోక్‌రెడ్డికి సంబంధించిన బహుళ అంతస్థుల భవనం నిర్మాణంలో చాలా లోపాలున్నాయి. వాటిని సవరించుకోవాలని ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చాం. కానీ నోటీసులకు ఎలాంటి రిప్లై ఇవ్వలేదు. దీంతోనే ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన వాటిని తొలగించేందుకు శుక్రవారం ఉపక్రమించాం. కానీ భవన యజమానులు వారం రోజులు గడువిస్తే తామే అన్నింటినీ తొలగించుకుంటామని చెప్పారు. వారం రోజులుల్లోగా వాళ్ల అక్రమ నిర్మాణాలను తొలగించుకోకుంటే తప్పకుండా పట్టణ ప్రణాళిక విభాగం కూల్చివేస్తుంది.

ఇ.కిరణ్, మున్సిపల్ కమిషనర్

బ్యాంకులో చోరీకి యత్నించిన ఇద్దరి అరెస్టు

● వారిలో ఒకరు మహిళ



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

త్రిపురాంతకం, ఆగస్టు 16: మండలంలోని మేడపిలోని యూనియన్ బ్యాంకులో ఈ నెల 1న అర్ధరాత్రి దొంగతనానికి ప్రయత్నించిన ఒక మహిళను, ఆమెకు తోడుగా వచ్చిన మరో యువకుడిని త్రిపురాంతకం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ ఎస్. సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం కొత్త అన్నసముద్రం గ్రామానికి చెందిన కంచర్ల వెంకటరమణ భర్త రమణయ్య చనిపోవడంతో తన కుమారుడితో కలిసి గుంటూరులోని ఆదర్శనగర్‌లో ఉంటుంది. కాగా తరచుగా డ్వాక్రా గ్రూపునకు సంబంధించి మహిళా మండలి నగదు చెల్లించేందుకు మేడపి యూనియన్ బ్యాంకుకు వస్తూ పరిసరాలను గమనించింది. సులువుగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో గుంటూరులోనే తన ఇంటి సమీపంలో ఉండే జంగిటి సునీల్‌ను తోడు తీసుకుని బ్యాంకులో దొంగతనానికి యత్నించింది. షట్టర్ తాళాలు పగులగొట్టి, లోపలికి ప్రవేశించిన వెంకట రమణ సీసీ కెమెరా వైర్లు అనుకుని వేరే వైర్లను కత్తిరించింది. అనంతరం లాకర్‌ను తెరిచే ప్రయత్నం చేసి అది తెరుచుకోక పోవడంతో కొంత సమయం తర్వాత ఇద్దరూ వెనుదిరిగారు. బ్యాంకు మేనేజరు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొత్తఅన్నసముద్రం మెట్ట వద్ద ఉన్న నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి దొంగతనం చేసే సమయంలో ఉపయోగించిన సుత్తి, కటింగ్ ప్లేయర్, దుస్తులు, ఆటోను సీజ్ చేశారు. యువత డబ్బు ఆశతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడవద్దని సీఐ సుబ్బారావు, ఎస్సై వి.సాంబశివయ్య తెలిపారు.

మరో కేసులో ఐదుగురి అరెస్టు

ఈనెల 14న మేడపిలోని ఆదిత్య క్లాత్ షాప్, టైలర్స్‌లో దుస్తులు కొనే నెపంతో వచ్చిన ఐదుగురు షాపు యజమానిని మాటలలో ఉంచి రూ.18 వేల విలువైన దుస్తులను దొంగతనంగా తీసుకెళ్లారు. దుకాణం యజమాని డి.సుబ్బారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై సాంబశివయ్య త్రిపురాంతకం సమీపంలో దొంగలను గుర్తించి, వారి నుంచి దుస్తులను, వారు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కాండ్రకొండ గంగమ్మ, కాండ్రకొండ అంజమ్మ, కాండ్రకొండ నాగేంద్రమ్మ, కట్టా బంగారయ్య, కట్టా గోపీచంద్‌లను అరెస్టు చేశారు. కాగా నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని సీఐ సుబ్బారావు తెలిపారు.

బోరుబావుల కేబుల్స్ చోరీ

గిద్దలూరు టౌన్, ఆగస్టు 16 : మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని పంట పొలాల్లో ఉన్న బోరుబావుల నుండి కేబుల్ వయర్లను దొంగలు కట్ చేసి దొంగిలిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గురువారం రాత్రి 8 మంది రైతులకు చెందిన బోరుబావుల నుండి కేబుల్ వయర్ల దొంగతనం జరిగింది. దొంగలు కేబుల్‌లో ఉన్న రాగి కోసం ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కంభం, ఆగస్టు 16 : కంభం పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ నరసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నట్లు, కావున ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన కొంగలిటి సాల్మన్

మార్కాపురం రూరల్, ఆగస్టు 16: మండలంలోని దరిమడుగు గ్రామ ఎస్సీ పాలెంకు చెందిన కొంగలిటి సాల్మన్(63) విద్యుత్ షాక్ గురై మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు సాల్మన్ ఇంటి ప్రక్కన నిర్మాణంలో ఉన్న భవనంలోకి వెళ్లాడని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇంటికి విద్యుత్ సరఫరా కోసం వేసుకున్న విద్యుత్ తీగ తెగిపడి ఉండగా గమనించకుండా వాటిని తగలడంతో షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనలో మృతుడు కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సాల్మన్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్లు సమాచారం. భార్య సుమారు ఐదేళ్ల క్రితం మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారీలో అటవీశాఖ అధికారి పాత్ర

● పట్టుబడిన వ్యక్తిని విచారించగా అసలు నిజం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 16 : ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహించాల్సిన అధికారే అసాంఘీక కార్యకలాపాలను ప్రోత్సహించాడు. ఏకంగా నాటుసారా తయారీలో ఆయన పాత్ర ఉందని వెల్లడికావడంతో పలువురు అధికారులు సైతం అవాక్కయ్యారు. అందిన సమాచారం మేరకు, రాచర్ల అటవీశాఖ కార్యాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా జమాల్ పనిచేస్తున్నాడు. ఆయనకు నాటుసారా తయారీలో పాత్ర ఉన్నట్లు నిర్ధారణ అయింది. దిగువమెట్ట చెక్‌పోస్టు వద్ద గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ తనిఖీలు నిర్వహిస్తుండగా దిగువమెట్టకు చెందిన చల్లా హరికృష్ణ అనే వ్యక్తి నాటుసారాను తరలిస్తుండగా ఆయన్ను పట్టుకుని 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. హరికృష్ణను పోలీసులు తమదైన శైలిలో విచారించగా నాటుసారా తయారీలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ జమాల్ పాత్ర ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. వీరిరువురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా వీరికి న్యాయస్థానం 14 రోజులపాటు రిమాండ్ కోర్టు విధించింది. కంచె చేను మేసిన విధంగా ప్రభుత్వ ఉద్యోగి అక్రమాలకు పాల్పడడం చర్చనీయాంశమైంది.

గాయపడిన వారికి పరామర్శ

గిద్దలూరు టౌన్, ఆగస్టు 16 : వైసీపీని వీడి బీజేపీలో చేరిన వారిపై గిద్దలూరు రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు భౌతికదాడి చేసిన విషయం పాఠకులకు విధితమే. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు బీవీ.శివారెడ్డి గాయపడిన షేక్ మస్తాన్‌వలి, నన్నెబోయిన రాజశేఖర్, పీరయ్యగౌడ్‌లను శుక్రవారం పరామర్శించారు. దాడి జరిగిన తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. శివారెడ్డి మాట్లాడుతూ పార్టీ భరోసాగా ఉంటుందని, ఎటువంటి దాడులను పార్టీ సహించదన్నారు. పార్టీ చేరికలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరాల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ, పట్టణ అధ్యక్షులు అబ్బిశెట్టి ఉదయ్‌శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు, రాష్ట్ర కిసాన్ కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు మట్టెమల్ల పుల్లయ్య, బాదుల్లా, వీరచక్రం, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



మార్కాపురంలో వరలక్ష్మీ మాత అలంకరణ

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని వరలక్ష్మీవ్రతం, శ్రావణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. మహిళలు ఇళ్లలో కలశాన్ని ఏర్పాటు చేసి నర్మదా పూజ నిర్వహించి అమ్మవారిని ఇంట్లోకి తీసుకొని వచ్చి తోరాల పూజలు నిర్వహించారు. అనంతరం వరలక్ష్మీ వ్రతకథలు చదివి పూర్ణాల తో కూడిన నైవేద్యం, 9 జ్యోతులతో మంగళ హారతులు ఇచ్చారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం శ్రావణ శుక్రవారంగా పరిగణించి వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తారు. సౌభాగ్యం, సిరిసంపదలు పొందడానికి మహిళలు ఈ వ్రతాన్ని పాటిస్తారు. సాయంత్రం అమ్మవారిని అలంకరించి పలువురు ముత్తైదువులకు తాంబులాలు పంపిణీ చేశారు.

పెద్ద దోర్నాల : మండలంలోని ప్రజలు శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతపూజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందున వచ్చిన శుక్రవారం కావడం మహిళలకు అత్యంత ప్రీతి కరమైన రోజున మహాలక్ష్మీ దేవిని ఇంటిలోనే ప్రతిష్టించి, అలంకరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ నిదానంపాటి అమ్మవారి దేవాలయంలో, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో, తిమ్మాపురంలోని శ్రీ చౌడేశ్వరీ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సేవించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.



గిద్దలూరులో అమ్మవారి అలంకరణ

గిద్దలూరు : పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం మహిళలు సామూహిక వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం కావడంతో తమ ఇళ్లలో పూజలు నిర్వహించుకుని ముత్తైదువులకు వాయినాలు సమర్పించి ఆశీర్వాదం పొందారు. దేవాలయాలన్నీ మహిళ భక్తులతో కిటకిటలా డాయి. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలి

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, ఆగస్టు 16: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పట్టణ పరిధిలోని బూత్ కమిటీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎన్నికల్లో కష్టపడ్డాం.. పార్టీ అధికారంలోకి వచ్చింది.' అని కాడి వదిలేస్తే మొదటికే మోసం వస్తుందని, బూత్‌స్థాయిలోని నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేవిధంగా పని చేయాల్సి ఉందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆయా బూత్‌ల పరిధిలో తొలుత అక్ర మంగా పింఛన్లు పొందుతున్న వారిని గుర్తించాలన్నారు. ఇప్పటికే తన దృష్టికి ఇలాంటి ఫిర్యాదులు చాలా అందాయన్నారు. అంతేకాక పథకాలకు అర్హులైన వారిని ముందుగానే గుర్తించి జాబితా లు తయారు చేసుకోవాలన్నారు. అ ర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా పథకాలు అందేవిధంగా పనిచేయాల్సి ఉందన్నా రు. కార్యకర్తలు కష్టపడి పనిచేయబట్టే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిం దన్నారు. ముఖ్యంగా పార్టీ కోసం కష్టపడ్డ వారికే ప్రథమ ప్రాధాన్యత ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, నాయకులు తడికమళ్ల బాలసుబ్బారావు, మాలపాటి వెంకటరెడ్డి, బూత్ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

గురుకుల పాఠశాలలో ఎరిక్షన్‌బాబు తనిఖీ

త్రిపురాంతకం, ఆగస్టు 16: మండలంలోని దూపాడులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను వై.పాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాఠశాలలోని వసతులు, సౌకర్యాలు, మెనూ తదితర అంశాలపై మాట్లాడారు. విద్యార్థినులకు వడ్డించే భోజనాన్ని, నాణ్యతను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపల్ మధురవాణి, ఇతర బోధనా సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థినులకు మెరుగైన విద్యను అందించేందుకు, మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు సంబంధిత అధికారులందరూ కృషి చేయాల్సిన అవసరముందన్నారు. జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖా మంత్రి బాల వీరాంజనేయ స్వామి విద్యార్థుల వసతి గృహాలను ఉత్తమంగా తీర్చి దిద్దుతున్నారని, సంక్షేమాన్ని అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎనిబెర అనూష, వీఆర్వో, పంచాయితీ కార్యదర్శి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

వైద్యుల ఆందోళన ఉధృతం!

దాడుల నియంత్రణకు రక్షణ చట్టం కోసం డిమాండ్ ● ఒంగోలులో జీజీహెచ్‌లో విధులు బహిష్కరించిన 'జూడా'లు

నేడు 24 గంటల పాటు వైద్యసేవలు బంద్ ● మద్దతు తెలిపిన ఇండియన్ డెంటల్ అసోసియేషన్

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 16 : వైద్యులపై దాడులు నిరసిస్తూ, వైద్య రంగం భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలోని ఆర్‌జీ కేఆర్ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ జూ నియర్ డాక్టర్స్ (జూడా) అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. శుక్రవారం ఒంగోలులోని జీజీహెచ్ (రిమ్స్) ఆవరణంలో ఒకరోజు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సం దర్భంగా జూడా సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.అజ య్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 9న కోల్‌క త్తాలో వైద్య పీజీ విద్యార్థినిని అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి, హత్య చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఆ ఘటనను నిరసిస్తూ ఆర్‌జీకేఆర్ కాలేజీ విద్యార్థులు ఈనెల 14న నిరసన తెలియజేస్తుండగా కొందరు దుండగులు నిరసనలో పాల్గొన్న డాక్టర్లపై దాడులు చేసి, హాస్పిటల్‌ను ధ్వంసం చేయడం దారుణంగా ఉందని చెప్పారు. రోజురోజుకు వైద్యరంగానికి భద్రత కరువైపోయిందన్నారు. ప్రజల ప్రాణాల కోసం తాము కష్టపడుతుంటే, కొందరు ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా జూడా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు విధులు బహిష్కరించి తమ నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగ రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొగ్గ శృతి, ప్రధానకార్యదర్శులు చైతన్యసాయి, విష్ణుప్రియ, జాయింట్ సెక్రటరీ వినాష్‌కుమార్, ఎం.సాయిపవిత్ర, కోశాధికారులు బి.రాము, హర్షిత, కమిటీ సభ్యులు, జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు ప్లకార్డులతో నిరసన తెలిపారు.

నేడు అన్ని ఆసుపత్రుల్లో 24 గంటలు వైద్యసేవలు బంద్ : ఐఎంఏ

కోల్‌కత్తాలో మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 24 వైద్యసేవలు బంద్ చేసినట్లు ఐఎంఏ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు అన్నీ ఆసుపత్రులో వైద్యులు, వైద్యసిబ్బంది తమ సేవలను నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందని ఐఎంఏ ప్రతినిధులు ఝాన్సీ శ్రీదేవి, రావిపాటి జయశేఖర్, మన్నే వీరయ్యచౌదరి, జాలాది మణిబాబు తెలిపారు. ప్రజలు అర్థం చేసుకుని వైద్యులకు సహకరించాలని వారు కోరారు.

వైద్యుల ఆందోళనకు ఐడీఏ మద్దతు
- డాక్టర్ నామినేని

వైద్యులపై దాడులు, కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం బాధకరమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) తన సానుభూతిని తెలియజేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనకు నిరసనగా ఐఎం ఏ, జూనియర్ డాక్టర్స్ సంఘం చేస్తున్న నిరసనకు ఐడీఏ మద్దతు తెలియజేస్తుందని, రాష్ట్రంలో 24 గంటలపాటు వైద్య సేవలను బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు దంత వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.



ప్లకార్డులను చేతపట్టి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులు

అవీ..ఇవీ..

క్విజ్ పోటీల్లో కంభం విద్యార్థుల ప్రతిభ



జ్ఞాపికలు అందుకుంటున్న విద్యార్థులు

కంభం, ఆగస్టు 16 : గుంటూరులో హిందూ కళాశాల లలిత కళా సమితి, స్ప్రెప్ స్వశక్తి వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక పోటీలలో కంభం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులో గురువారం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీలలో కంభం విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. కళాశాల చరిత్ర అధ్యాపకులు రంజిత్‌కుమార్ నేతృత్వంలో ఈ పోటీల్లో పాల్గొన్న బీఏ తృతీయ సంవత్సర విద్యార్థులు షేక్ సమ్రీన్, బి.ఖాశింబీ, షేక్ మల్లిక విజేతలుగా నిలిచి పతకాలు, ప్రశంస పత్రాలు అందుకున్నారు. కళాశాలకు పేరు తెచ్చిన విద్యార్థులను ప్రశంసించారు.

కరాటేలో అరుణోదయ విద్యార్థుల సత్తా

● అభినందించిన ఎమ్మెల్యే ముత్తుముల



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 16 : పట్టణంలోని అరుణోదయ పాఠశాలకు చెందిన విద్యార్థులు కరాటేలో రాణించారు. తెలంగాణలోని జడ్చర్ల నియోజకవర్గంలోని కల్వకుర్తి మండలంలో జరిగిన కరాటే పోటీలలో బంగారు పతకాన్ని భూమిక చందన, వెండి పతకాలను, తేజ, ప్రణతి, బ్రాంజి మెడల్‌ను వరుణ్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభినందించారు. కరాటే పోటీలలో రాణిస్తూ చదువుల్లో కూడా ముందుండాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్, కరాటే మాస్టర్ బూతరాజు శ్రీనివాసును, ఇన్‌స్ట్రక్టర్ పసుపులేటి హేమలతలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభినందించారు.

ఎమ్మెల్యేను సన్మానించిన విద్యాకమిటీ ఛైర్మన్లు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 16 : ఇటీవల ఎన్నికైన పాఠశాలల విద్యాకమిటీ ఛైర్మన్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి సన్మానించారు. రాచర్ల మండలం అనుమలపల్లె గ్రామ ఎంపీయూపీ ఎంపీపీఎస్ స్కూల్స్ ఛైర్మన్లు గోన కాశయ్య, పసుపులేటి వెంకటరమణ శుక్రవారం కలిసి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి పూలమాలలు వేసి సన్మానించారు.

పేద రజకుల విద్యాభివృద్ధికి సంఘం చేయూత

పెద్ద దోర్నాల, ఆగస్టు 16:పేద రజక విద్యార్థులకు రజక విద్యా సేవా సంఘం చేయూత నిస్తుందని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు దేవలూటి శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 8096646072, 6304330529నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న సుధారాణి

గిద్దలూరు, ఆగస్టు 16 : పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ సుధారాణి ఉత్తమ సూపర్‌వైజర్ అవార్డు పొందారు. మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున అవార్డు అందుకున్నారు. వరుసగా 2వ పర్యాయం ఉత్తమ హెల్త్ సూపర్‌వైజర్ అవార్డు అందుకున్న సుధారాణిని పలువురు అభినందించారు.

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతి



లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 16: స్వాతంత్ర్య సమరయోధుడు సర్ధార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మార్కాపురం గౌడ సంఘం అధ్యక్షులు జి.రమణగౌడ్ ఆధ్వర్యంలో స్థానిక సాయితేజ నేత్ర వైద్యశాలలో లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణగౌడ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో పోరాటాలు చేసి విలువలతో కూడిన రాజకీయం చేసిన గొప్ప నేత లచ్చన్న అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు నరసింహారావుగౌడ్, శ్రీనివాస గౌడ్, హనుమయ్య గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్, జి.రంగారావు గౌడ్, సాయి చైతన్య గౌడ్, రాఘవ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్, ఆగస్టు 16 : సర్ధార్ గౌతులచ్చన్న 117 జయంతి ఉత్సవాలను గిద్దలూరు పట్టణంలోని సర్ధార్ సర్వాయ్‌పాపన్న గౌడ్ సంఘం ఆధ్వర్యంలో సూర్య ఎంటర్‌ప్రైస్ నందు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా గౌడసంఘం అధ్యక్షులు బత్తిని వెంకటేశ్వర్లు గౌడ్, మాజీ గౌడ కార్పోరేషన్ డైరెక్టర్ కంచర్ల కోటయ్యగౌడ్, గౌడ సంఘం గౌరవాధ్యక్షులు గజ్జా పుల్లయ్యగౌడ్, తదితరులు గౌడ లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మింగి ప్రసాద్‌గౌడ్, ఆర్గనైజేషన్ కార్యదర్శులు మింగి నాగేశ్వర్‌రావు గౌడ్, ఇల్లూరి వెంకటేశ్వర్‌గౌడ్, కార్యదర్శి బాలరంగయ్యగౌడ్, సంఘ నాయకులు గోర బాలరంగయ్య, వెంకటేశ్వర్లుగౌడ్, కంచర్ల స్వామి, గుండమయ్య గౌడ్, ఇల్లూరి ప్రభాకర్‌గౌడ్, కంచర్ల పాండుగౌడ్, దొంతా రమణగౌడ్ పాల్గొన్నారు.


తర్లుపాడు ఎంపీడీవోగా నరసింహులు

తర్లుపాడు, ఆగస్టు 16: తర్లుపాడు ఎంపీడీవోగా ఎస్.నర సింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా గుంటూరు జిల్లాకు వెళ్లి తిరిగి తర్లుపాడు ఎంపీడీవోగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చేందుకు కృషి చేస్తానన్నారు. ఈయనను పలువురు కార్యదర్శులు, ప్రజా ప్రతనిధులు సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రావు, ఈవోపీఆర్‌డీ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బూతుల డాక్టరుపై విచారణ

● పుల్లలచెరువులో విచారించిన డీఎంహెచ్‌వో సురేష్ కుమార్

పుల్లలచెరువు, ఆగస్టు 16: ఏఎన్‌ఎంలను వేధిస్తూ బూతులు తిడుతున్న పుల్లలచెరువు వైద్యుడిని శుక్రవారం అధికారులు విచారించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' మినీలో బూతుల డాక్టరుతో బెంబేలు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో శుక్రవారం పుల్లలచెరువు వైద్యశాలలో డీఎంహెచ్‌వో సురేష్ కుమార్ విచారించారు. డాక్టరు నాగార్జునను, ఏఎన్‌ఎంలను, సిబ్బందిని విచారించి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలను వేధిస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. విచారణ నివేదికను సమగ్రంగా ఉన్నాతాధికారులకు అందజేస్తామన్నారు. త్వరలోనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



సాగర్ కాలువలో ప్రవహిస్తున్న నీరు

వరి సాగుకు రైతుల సన్నద్ధం

- నిండిన జలాశయాలు
- నీరు విడుదల చేస్తామంటున్న అధికారులు

దర్శి, ఆగస్టు 16: సాగర్ ఆయకట్టు రైతులు వరిసాగుకు సన్నద్ధమవుతున్నారు. శ్రీశైలం, సాగర్ జలాశయాలు ఇప్పటికే పూర్తిగా నిండటంతో అధికారులు సాగుకు నీరు ఇస్తున్నట్లు అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. రెండవ జోన్ పరిధిలో ఉన్న ప్రకాశం, బాపట్ల జిల్లాలలో ఉన్న ఆయకట్టుకు సెప్టెంబరు మొదటివారం నుంచి సాగునీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ ఉన్నతాధికారులు ప్రకటించారు. దీంతో దర్శి డివిజన్‌లోని ఆయకట్టు రైతులు వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు.

గత రెండేళ్లుగా సాగర్ ఆయకట్టు భూములు సాగుకు నోచుకోలేదు. వర్షాలు కూడా సరిగాలేక మెట్టపంటలు కూడా ఆశించనమేర పండలేదు. ఈఏడాది పుష్కలంగా వర్షాలు పడి జలాశయాలు పూర్తిగా నిండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుంది. దర్శి ఎన్ఎస్‌పీ డివిజన్ పరిధిలోని లక్ష ఎకరాల అయకట్టులో 60 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. మిగిలిన చివరి ఆయకట్టు భూముల్లో ఆరుతడి పంటలు వేస్తారు. ఇప్పటికే అనేకచోట్ల కంది, సజ్జ పైర్లు సాగు చేశారు.

ప్రస్తుతం సాగర్ కాలువలో నీరు సరఫరా అవుతున్నందున నార్లు పోసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వరినాట్లు వేసేందుకు 40 రోజులు సమయం ఉన్నందున ఈలోపు సజ్జ పైరు కోసుకొని వరినాట్లు వేసేందుకు వీలుగా స్వల్పకాలిక వరి వంగడాలను ఎంచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీవిధాలుగా అనుకూల పరిస్థితులు నెలకొన్నాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి రవివెంకన్నబాబు

తాళ్లూరు, ఆగస్టు 16: పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని ఉద్యాన శాఖ అధికారి ఎం.రవివెంకన్నబాబు అన్నారు. శుక్రవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నీటి వనరుల దృష్ట్యా రైతాంగం పండ్ల తోటల పెంపకం చేపట్టాలన్నారు. ఉద్యాన పంటలతో చేకూరే ప్రయోజనాలను వివరించారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ గతంలో వేసిన ఉద్యాన పంటలకు ఈక్రాప్ నమోదు చేయాలని తెలిపారు. దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల పరిధిలోని రైతులకు ఉద్యాన పంటల సాగుపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మాధవరంలో ఉద్యాన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వీపీఏ సుధీర్, రైతులు పాల్గొన్నారు.

బోదనంపాడులో మొక్కల పంపిణీ

కురిచేడు, ఆగస్టు 16: మొక్కల పెంపకంతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోదనంపాడు గ్రామంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యత, చల్లని గాలులు వీస్తాయన్నారు. కార్యక్రమంలో పోటు శ్రీనివాసరావు, రమణయ్య, సుబ్బారావు, వీరిసెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

సీఎస్‌పురం(పామూరు) ఆగస్టు 16: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చొరవ చూపాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. సీఎస్‌పురం తహసీల్దార్ మంజునాథరెడ్డిని శుక్రవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంజునాథరెడ్డి పేర్కొన్నారు. తహసీల్దార్‌ను కలిసినవారిలో మన్నెపల్లి శ్రీనివాసులు, ఎన్‌సీ మాలకొండయ్య, బత్తుల వెంకటాద్రి, కె.వెంకటకొండయ్య ఉన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు



రోడ్డు నిర్మాణానికి తీసుకున్న భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ శింగారావు

తాళ్లూరు, ఆగస్టు 16: బెంగుళూరు-కోటిపల్లి-ముప్పవరం(బీకేఎం) ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డులో భూములు కోల్పోయి నష్టపరిహారం అందని రైతుల సమస్య పరిష్కారంపై తహసీల్దార్ పి.శింగారావు దృష్టి సారించారు. నష్టపరిహారం అందని పలువురు రైతులు తమకు పరిహారం అందేలా చూడాలని విన్నవించారు. ఈక్రమంలో తహసీల్దార్ మల్కాపురం గ్రామంలోని రైతుల భూములను శుక్రవారం పరిశీలించారు. రైతులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను చూపించారు. భూమి స్వరూపం ఎలా వుంది, నష్ట పరిహారం ఏకారణం చేత జమ కాలేదో గుర్తించేందుకు తహసీల్దార్, సిబ్బందితో కలిసి భూములను పరిశీలించారు. సర్వే నంబర్126/1ఏలో గల భూమిని ఇద్దరు కొనుగోలు చేయగా, ఆభూమి బీకేఎం రోడ్డులో పోయింది. ఏడాదికాలంగా నష్ట పరిహారం జమకాక కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రోడ్డులో పోయిన భూమిని తహసీల్దార్ పరిశీలించి, సర్వే చేయించారు. ఇద్దరి పేర్లకు నష్ట పరిహారం అందేలా చర్యలు చేపట్టారు. పరిహారం అందని భూములను రికార్డుల ఆధారంగా పరిశీలించి నష్టపరిహారం అందించే చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నారపురెడ్డి, విలేజ్ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో కాలనీలు

- కొండలు, వాగుల మధ్యలో ఇళ్ల స్థలాలు కేటాయింపు
- పనికిరావని వదిలేసిన లబ్ధిదారులు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా



కొండ, వాగు మధ్యలో జగనన్న కాలనీ

దర్శి, ఆగస్టు 16: జగనన్న కాలనీల పేరుతో గత వైసీపీ పాలకులు కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేశారు. సుదూర ప్రాంతాల్లో కొండలు, వాగుల మధ్యలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. నివాసయోగ్యం కానిచోట స్థలాలు కేటాయించటంతో తొలుత ప్లాట్లు తీసుకున్న లబ్ధిదారులు అధికశాతం మంది అక్కడకు వెళ్లలేదు. గృహాలు నిర్మించలేదు. నిర్మించిన కొద్దిపాటి ఇళ్లు కూడా చిల్లచెట్ల మధ్యలో నిరుపయోగంగా ఉన్నాయి. లేఅవుట్ అభివృద్ధి పేరుతో వైసీపీ నాయకులు కోట్లాది రూపాయలు స్వాహా చేశారు. అనేకమంది లబ్ధిదారులు అక్కడకు వెళ్లేందుకు ఇష్టం లేక ఇళ్ల స్థలాలను వదులుకున్నారు.

సుదూర ప్రాంతంలో ప్లాట్లు కేటాయింపు

దర్శి పట్టణానికి చెందిన పేద ప్రజలకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో చలివేంద్రం కొండ వద్ద ఇళ్ల స్థలాలు కేటాయించారు. అక్కడ మూడు ప్రాంతాల్లో ప్లాట్లు వేశారు. ఒక లేఅవుట్ కొండ ఆనుకొని ఉంది. మరో లేఅవుట్ కొండకు, వాగుకు మధ్యలో ఉంది. కొంతమంది ఇళ్లు నిర్మించినప్పటికీ ఇప్పటికీ ఆ వాగు అలాగే ఉంది. ఆ ఇళ్ల వద్దకు వెళ్లేందుకు సరైన మార్గం కూడా లేదు. అక్కడ సుమారు 1200 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. తొలిదశలో 755 మంజూరుచేశారు. ఇప్పటి వరకు గత ఐదేళ్ళ కాలంలో 291 ఇళ్లు మాత్ర మే పూర్తయ్యాయి. ఆ ఇళ్లు కూడా చిల్లచెట్ల మధ్యలో అధికశాతం నిరుపయోగంగా ఉన్నాయి. దర్శి రూరల్ మండలంలో 1200 మంజూరు కాగా కేవలం 569 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి అలాగే ఉన్నాయి.



చిల్లచెట్ల మధ్యలో నిరుపయోగంగా గృహాలు



పునాదుల్లోనే నిలిచిపోయిన గృహాల నిర్మాణం

దర్శి పట్టణవాసులకు చలివేంద్ర కొండమీద ఇచ్చిన లేఅవుట్ల అభివృద్ధికి లెవలింగ్ పేరుతో రూ.2 కోట్లు ఖర్చు చేశారు. విద్యుత్, రోడ్డు, నీటి సరఫరా పేరుతో కోటి రూపాయలకు పైగా ఖర్చు చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయినప్పటికీ ఆ కాలనీలు ఎందుకూ ఉపయోగపడలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇచ్చిన కాలనీలు కూడా అధికశాతం వాగులు, వంకల మధ్య స్థలాలు కేటాయించారు. అక్కడ కూడా నివాసయోగ్యం కాకపోవటంతో అధికశాతం మంది ఇళ్లు నిర్మించ లేదు. అనేకమంది ప్లాట్లు కూడా వదులుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అనువైన ప్రాంతాల్లో మళ్లీ ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మిస్తారనే ఆశతో పేదలు ఎదురు చూస్తున్నారు. సీఎం చంద్రబాబు పట్టణ వాసులకు రెండున్నర సెంటు, గ్రామీణ ప్రాంతవాసులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించటంతో పాటు గృహాల నిర్మాణానికి రూ.4 లక్షలు కేటాయిస్తామని ప్రకటించటంతో పేదల సొంత ఇంటి కల నిజమవుతుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ
- ఫ్రీహోల్డ్, అక్రమ వెంచర్ల పరిశీలన



మాచవరం వద్ద ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న జేసీ, రిజిస్ట్రార్

కనిగిరి, ఆగస్టు 16: ఫ్రీహోల్డ్ మార్పుల్లో అక్రమమని తేలితే ఆయా అధికారులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూముల రీసర్వేపై శుక్రవారం రెవెన్యూ అధికారుల, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఏమాత్రం ఆమోద యోగ్యంకాని భూములను ఫ్రీహోల్డ్ భూములుగా మార్చి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే విధుల నుంచి తొలగించటం జరుగుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలోనే కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా అక్రమంగా వెంచర్ల వేసినట్టు చెప్పారు. ఇటీవల ఫ్రీహోల్డ్ భూములుగా ఆయా భూములను మార్చిన విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి నిజాలు నిగ్గు తేల్చాలని అధికారులను జేసీ ఆదేశించారు.

కనిగిరి మండలంలోని 40 రెవెన్యూ గ్రామాల్లో 13 బృందాలుగా ఏర్పాటుచేసి ఫ్రీహోల్డ్‌కు సంబంధించిన భూముల దస్త్రాలను పరిశీలించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఒక్కో బృందంలో డీటీ, ఆర్ఐ, వీఆర్ఓ, సర్వేయర్ ఉంటారన్నారు. వీరు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి 22ఏ, బీ, సీ, డీ, అసైన్డ్ ల్యాండ్, ఫ్రీహోల్డ్, చుక్కల భూములను పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఫ్రీహోల్డ్ భూమిగా మార్పుచేసే క్రమంలో నిబంధనలను ఏమేరకు పరిగణనలోకి తీసుకున్నారో కూడా సంబంధిత భూమి సర్వే నెంబరు వివరాల్లో నమోదు చేయాలని సూచించారు.

అనంతరం రెవెన్యూ రికార్డు గదిని పరిశీలించారు. ఆతర్వాత మండలంలోని యడవల్లి పరిధిలోని 309/1 భూమిని పరిశీలించారు. మాచవరం, శంఖవరం ప్రాంతాల్లో ఫ్రీహోల్డ్ కింద మార్పులు చేసిన భూముల రికార్డులను పరిశీలించి సర్వే చేపట్టారు. ఫ్రీహోల్డ్ భూములుగా మారిన భూములకు రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, తహసీల్దార్ అశోక్‌కుమార్, డీటీ కిశోర్‌కుమార్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



చెత్తకుప్పలను శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం

కనిగిరి, ఆగస్టు 16: ప్రత్యేక ప్రణాళికతో పారిశుధ్య చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక డిపో ఆవరణలో ఉన్న చెత్తకుప్పలను శుక్రవారం తొలగింపు చర్యలు చేపట్టారు. డిపో వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తుందని చెప్పినా పట్టించు కోలేదని స్థానికులు మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో పారిశుధ్య సిబ్బందిని వెంట పెట్టుకుని డిపో వద్ద ఉన్న చెత్తకుప్పలను తీయించారు. పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు వస్తున్నాయన్నారు. దోమలకు నెలవుగా చెత్తకుప్పలు మారుతున్నాయన్నారు. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాల్లో చెత్తకుప్పలు, వ్యర్థాలు, పిచ్చిచెట్లను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



దర్శిలో పూజలందుకుంటున్న కనకదుర్గాదేవి



దొనకొండ ఆనంద ఆశ్రమంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దర్శి, ఆగస్టు 16: మండలంలోని ప్రజలు శుక్రవారం వరలక్ష్మీ వ్రత వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. శ్రావణమాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు చేయటం ఆనవాయితీ. ఈనేపథ్యంలో మహిళలు తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి వ్రత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యం, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని కనకదుర్గమ్మ ఆలయం, పోలేరమ్మ, వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, దద్దాలమ్మ ఆలయాల్లో వరలక్ష్మీ వ్రత వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో మహిళలు, భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

దొనకొండలో.. దొనకొండ, ఆగస్టు 6: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని ఆనంద ఆశ్రమంలో ఆశ్రమ ధర్మకర్త భైరవానందస్వామి నేతృత్వంలో వరలక్ష్మీ వ్రతం వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమంలో వేంచేసి ఉన్న శ్రీగోవిందమాంబ అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి గణపతి పూజ, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, లలితసహస్ర నామం, ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కనిగిరిలో.. కనిగిరి, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వత్రాలు నిర్వహించారు. స్థానిక సాయిబాబా దేవాలయం, కేటీఆర్ స్కూల్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. శ్రావణమాసంలో శుక్రవారం మహిళలు విశేష పూజలతో వరలక్ష్మీ వ్రతవిధానం నిర్వహిస్తారు. అందులో భాగంగా తెల్లవారుజాము నుంచే మహిళలు వ్రతవిధానం ఆచరిస్తారు. శ్రావణ శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతమాచరిస్తే కోటిజన్మల పుణ్యఫలాన్ని దేవుడి ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం. ఈసందర్భంగా స్థానిక సాయిబాబా దేవాలయంలో 111 మంది మహిళలు వరలక్ష్మీ వ్రతమాచరించారు. తొలుత లక్ష్మీదేవికి పసుపు కుంకుమార్చనలు నిర్వహించారు. దీపారాధనలతో ఆలయం అత్యంత శోభాయమానంగా విరాజిల్లింది. వరలక్ష్మీ వ్రత విధానంలో పండితుల వేద మంతోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈసందర్భంగా మహిళలు పుష్ప, కుంకుమ, నవధాన్యాలు, పానీయాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



కనిగిరి: బాబా ఆలయంలో వరలక్ష్మీ వ్రతమాచరిస్తున్న మహిళలు

వీఆర్‌కు దర్శి ఎస్ఐ సుమన్




సుమన్, ఎస్ఐ

దర్శి, ఆగస్టు 16: దర్శి ఎస్ఐగా పనిచేస్తున్న సుమన్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. ఈమేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులందాయి. ఒంగోలులో వెంటనే రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్ఐ సుమన్ వైసీపీ నాయకులకు తొత్తుగా వ్యవహరించి టీడీపీ శ్రేణులను ఇబ్బందులు పెట్టారని విమర్శలు వచ్చాయి. టీడీపీ కార్యకర్తలపై, నాయకులపై వైసీపీ శ్రేణులు దాడులు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. వైసీపీ ఏజంట్‌గా మారిన ఎస్ఐ దాడికి గురైన టీడీపీ క్యాడర్‌పైనే కేసులు పెట్టారు.

ఎన్నికల అనంతరం టీడీపీ నాయకులు ఎస్ఐని కలిసి న్యాయబద్ధంగా వ్యవహరించాలని కోరినా పట్టించుకోలేదు. ఇక్కడ కాకపోతే మరోచోటికి వెళతామంటూ వ్యాఖ్యలు చేయటంతో ఎస్ఐపై టీడీపీ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎన్నికల సందర్భంగా ఇక్కడ పోలీసులు వ్యవహరించిన తీరు, జరిగిన సంఘటలను సాక్షాధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటికే ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన అశోక్‌వర్ధన్‌రెడ్డిని, సీఐ షేక్ షమీముల్లాను హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేశారు. వారికి ఇంకా పోస్టింగ్‌లు ఇవ్వలేదు. తాజాగా దర్శి ఎస్ఐ సుమన్‌పై కూడా వేటు పడింది. న్యాయబద్ధంగా వ్యవహరించాల్సిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్న విషయం ఈచర్యల ద్వారా రుజువైంది. వైసీపీతో అంటకాగిన పోలీస్ అధికారులను బదిలీ చేయటంతోపాటు పోస్టింగ్ ఇవ్వకుండా పక్కనపెట్టడంతో వారు వ్యవహరించిన తీరుకు తగిన గుణపాఠం జరిగిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



మోట్రావులపాడులో ప్రతిష్ఠించిన పోలేరమ్మ విగ్రహం

పామూరు, ఆగస్టు 16: మండలంలోని మోట్రావులపాడు గ్రామంలో శుక్రవారం పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా పోలేరమ్మ పోతురాజు సహిత శిఖర కలశ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక వేడుకలు జరిగాయి. శుక్రవారం పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ప్రతిష్ఠ హోమం, శాంతి పౌష్టిక హోమం, యంత్ర, విగ్రహ, ప్రాణ, గోపుర, శిఖర, కలశ ప్రతిష్ఠ మహాకుంభాభిషేకం, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, ఉపసర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, డోలా శేషాద్రి, గుంటుపల్లి శ్రీనివాసులు, పోకా వినోద్, సత్యం, గుత్తి మహేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం పూజలు

మండలంలోని మన్నేరు గ్రామంలో గల డాక్టర్ ముక్కు కవిత గోశాలలోని గోవు (సాయిలక్ష్మి)కు పసుపు కుంకుమలతో సీమంతం పూజా కార్యక్రమాలను శుక్రవారం మహిళలు నిర్వహించారు. గోమాత దీవెనలు ఎల్లవేళలా ప్రజలకు ఉండాలని కోరుతూ పూజలు నిర్వహించినట్లు గోశాల నిర్వాహకుడు ఎం.వెంకట్రావు తెలిపారు.



గోవుకు సీమంతం చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో స్వామివార్ల శాంతి కల్యాణం

మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో వెలసియున్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వార్ల శాంతి కల్యాణ మహోత్సవ వేడుకలను రుత్వికులు కురిమేటి బాలసుబ్రమణ్యం శాస్త్రి, కలబుగిరి సూర్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక హోమాలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతిభచాటిన విద్యార్థులకు నగదు బహుమతులు

కురిచేడు, ఆగస్టు 16: కురిచేడు మండలం పొట్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభచాటిన పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అదే పాఠశాలలో 1991-92లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు నగదు బహుమతులు అందజేస్తున్నారు. ఈసంవత్సరం కూడా ప్రతిభచాటిన విద్యార్థులకు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2,500 అందజేశారు.

2023-24 విద్యా సంవత్సరంలో బాలురులో కె.వెంకటేశ్వర్లు, పవన్, అశోక్‌లకు, విద్యార్థినులలో వెంకటరమణ, నందిని, నీలిమలకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులు అందజేసిన పూర్వ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు కృతజ్ఞతలు తెలిపారు.



బాపట్ల: అన్న క్యాంటీన్ దగ్గర ఆహారం కోసం బారులు తీరిన ప్రజానీకం

అన్న క్యాంటీన్లు పునః ప్రారంభమయ్యాయి. ఇంతకాలం ఆకలితో అల్లాడిన పేదల్లో ఆనందం వెల్లివిరిసింది. కడుపు నింపుకునేందుకు పెద్దమొత్తంలో ఖర్చు చేయలేక అల్లాడిన పేదలకు అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చే కేంద్రాలుగా దర్శనమిచ్చాయి. వైసీపీ ప్రభుత్వ విధానాలకు బలైన అన్న క్యాంటీన్లు శుక్రవారం తిరిగి ప్రాణం పోసుకున్నాయి. తక్కువ ధరకు.. నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసి ఆ భవనాలను పాడుపెట్టగా పేదలకు చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాటిని పునరుద్ధరించారు. శుక్రవారం ఉదయం 7 గంటలకే క్యాంటీన్లు ప్రారంభమవగా అల్పాహారం కోసం జనం బారులు తీరారు. భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఆరగించి తమ కడుపు నింపారంటూ ఆనందం వ్యక్తం చేశారు. రూ.5కే రుచికరంగా ఆహారం అందించేలా అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న పేదలు



● బాపట్లలో అన్నక్యాంటీన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళీ, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, డీఆర్‌వో తదితరులు

ఆరంభం.. ఆనందం



మంగళగిరి: అన్న క్యాంటీన్‌లో అందిరితో కలిసి అల్పాహారాన్ని రుచిచూస్తున్న లోకేశ్



● చీరాలలో పేదలకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్, డాక్టర్ మహేంద్రనాథ్‌లు



● బాపట్ల అన్నక్యాంటీన్ నిర్వహణకు ముప్పా కన్‌స్ట్రక్షన్స్ అధినేత, బ్లూప్లేట్ హోటల్ నిర్వాహకులు ముప్పా వెంకటేశ్వరరావు అందించిన లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ జె.వెంకటమురళికి అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

● పేదల కడుపు నింపేలా అన్న క్యాంటీన్లు
● పట్టణ కేంద్రాల్లో పండుగలా ప్రారంభోత్సవాలు
● ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే క్యాంటీన్ల పునరుద్ధరణ
● మంగళగిరి, తాడేపల్లిలో క్యాంటీన్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్
● తెనాలిలో మనోహర్, రేపల్లెలో అనగాని, అద్దంకిలో గొట్టిపాటి ప్రారంభం

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 16: జిల్లాలోని మున్సిపల్ కేంద్రాల్లో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంతో పేద ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం పండుగ వాతావరణంలో ఎక్కడికక్కడ అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. నిరుపేదల కడుపు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం సంకల్పించిన అన్న క్యాంటీన్లు ప్రారంభించగా వాటి వద్ద పండుగ వాతావరణం కనిపించింది. రూ.5కే రుచి, శుభ్రతతో కూడిన అల్పాహారం, భోజనం అందుబాటులోకి వచ్చేసరికి పేదలు క్యాంటీన్ల ముందు బారులు తీరారు. చెప్పిన మాట నిలబెట్టుకున్నారని తమ కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందంటూ సీఎం చంద్రబాబును పేదలు ఆశీర్వదించారు. ఐదేళ్ల చిన్నారుల నుంచి 90 ఏళ్ల వృద్ధుల వరకు అన్న క్యాంటీన్‌కు వచ్చి ఆకలి తీర్చుకునేందుకు బారులు తీరారు. తొలి రోజు మహిళలు కూడా క్యాంటీన్లకు తరలివచ్చారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు ప్రారంభోత్సవాల్లో పాల్గొని పేదలకు స్వయంగా వడ్డించి అల్పాహారాన్ని రుచి చూశారు. ఇక క్యాంటీన్లు ప్రారంభమైన తొలి రోజు వచ్చిన వారందరికీ కాదనకుండా అల్పాహారం, భోజనం అందజేశారు. గుంటూరు పరిధిలో 7, మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో 3, తెనాలిలో 3, పొన్నూరులో ఒకటి చొప్పున అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించామన్నారు. బాపట్ల జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో, చిలకలూరిపేటలో మూడేసి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, మాచర్ల పట్టణాల్లో ఒక్కొక్కటి చొప్పున అన్న క్యాంటీన్లను తొలివిడతలో ప్రారంభించారు.

వృథాలు లేకుంటే పేదల ఆకలి తీరేది : లోకేశ్

నాడు జగన్‌రెడ్డి వృథా ఖర్చులను తగ్గించుకుని ఉంటే పేదల ఆకలి తీరేదని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరి పాత బస్టాండ్, తాడేపల్లి నులకపేటలో అన్న క్యాంటీన్లను లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలక్చిన పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ తన ఫొటోలను ముద్రించుకునేందుకు రూ.700 కోట్లను ఖర్చు చేశారన్నారు. విశాఖ రుషికొండపై రూ.500 కోట్ల ఖర్చుతో ప్యాలెస్‌ను నిర్మించారన్నారు. సొంత పత్రిక సాక్షికి రూ.400 కోట్లతో ప్రకటనలు ఇప్పించుకున్నారన్నారు. ఈ వృథా ఖర్చులు పెట్టే కన్నా 203 అన్నక్యాంటీన్ల నిర్వహణకు ఏడాదికి సుమారు రూ.200 కోట్లను ఖర్చుచేసి ఉంటే లక్షలాదిమంది పేదల ఆకలి తీరేదన్నారు. ఒక్క రుషికొండ ప్యాలెస్‌కు పెట్టిన ఖర్చుతో నిరుపేద కుటుంబాలకు మూడుపూటలా రెండున్నర సంవత్సరాలపాటు భోజనం లభించేదన్నారు. సాక్షికి ఇచ్చిన డబ్బులతో రెండేళ్లపాటు, సర్వేరాళ్లపై ఫొటోలకు వెచ్చించిన డబ్బులతో మూడేళ్లపాటు అన్న క్యాంటీన్లను నడిపించవచ్చని లోకేశ్ వివరించారు. అన్న ఎన్టీఆర్ పేదలే తన దేవుళ్లని నినదించారని, కూటమి పార్టీలు అదే సూక్తిని పాటిస్తాయన్నారు. ఏ ప్రభుత్వం నిరుపేద కుటుంబాల గురించి ఆలోచిస్తుందో.. ఎవరు పెత్తందారుల గురించి ఆలోచిస్తున్నారో ప్రజలందరూ గుర్తెరగాలని కోరారు. గతంలో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్ల మూసివేయగా తాను కౌన్సిల్‌లో నిలదీయగా నాటి మున్సిపల్ మంత్రి మళ్లీ ప్రారంభిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. తాను ప్రతిపక్షంలో ఉండి నియోజకవర్గంలో నాలుగు ప్రాంతాల్లో సొంత నిధులతో అన్న క్యాంటీన్ల నిర్వహించానన్నారు.

● బాపట్ల సూర్యలంకరోడ్డులోని మీసేవ కేంద్రం పక్కన ఆధునికీకరించిన అన్న క్యాంటీన్ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలతో కలిసి కలెక్టర్ జె.వెంకటమురళి ప్రారంభించారు. భిక్షాటన చేసే వారికి, కార్మికులు, కర్షకులు, పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు రూ.5కే నాణ్యమైన భోజనం గౌరవప్రదంగా అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

● అద్దంకిలోని ఎన్‌ఎస్‌పీ కార్యాలయం ఆవరణంలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రజలకు స్వయంగా ఆహార పదార్థాలను వడ్డించి రుచి చూశారు.

● చీరాల హైస్కూల్ రోడ్డులో అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ఎం.ఎంకొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు.



రేపల్లె: అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్

ఎన్టీఆర్ సంకల్పానికి ప్రతిరూపాలు : మనోహర్

పట్టెడన్నం పెట్టి పేదల ఆకలి తీర్చాలన్న అన్న ఎన్టీఆర్ సంకల్పానికి ప్రతిరూపమే అన్న క్యాంటీన్లని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలో శుక్రవారం మూడు చోట్ల అన్న క్యాంటీన్లను ప్రారంభించి ప్రసంగించారు. పేదల ఆకలి తీర్చాలని ఆ నాడే ఎన్టీఆర్ ఆలోచిస్తే, దానిని చంద్రబాబు ఆచరణలో పెట్టారని, ఎందరో పేదలకు అన్న క్యాంటీన్లు కడుపు నింపుతున్నాయన్నారు. రూ.5కే పేదల కడుపు నింపేలా అప్పటి టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ద్వారా ఆహారం అందిస్తుంటే వైసీపీ ప్రభుత్వం వాటిని మూయించిందన్నారు. పైగా స్వచ్ఛందంగా కొనసాగిస్తున్న క్యాంటీన్లను బలవంతంగా మూతవేయించి వారి పొట్ట కొట్టిందని, ఆ పాపం ఊరికే పోలేదన్నారు. గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు తట్టుకుని 500 రోజులకు పైగా అన్న క్యాంటీన్లను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్వహించారన్నారు. పేదల ఆకలి తీర్చేలా అన్న క్యాంటీన్లను రానున్న రోజుల్లో డొక్కా సీతమ్మ స్ఫూర్తితో మరింతగా ముందుకు తీసుకువెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందనడానికి అన్న క్యాంటీన్ల పునః ప్రారంభమే నిదర్శనమన్నారు. అన్న క్యాంటీన్లకు దాతలుగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు దాతలు రూ.10 లక్షల విరాళాలు అందించడం అభినందనీయమని మాజీ మంత్రి ఆలపాటి కృతజ్ఞతలు తెలిపారు.



తెనాలి: అన్న క్యాంటిన్‌లో అల్పాహారం తీసుకుంటున్న మంత్రి మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్

పేదల ఆకలి తీర్చేందుకు క్యాంటీన్లు : గొట్టిపాటి

పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించినట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అద్దంకిలోని ఎన్‌ఎస్‌పీ కార్యాలయం ఆవరణంలో అన్న క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అన్న క్యాంటీన్లను వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దుర్మార్గంగా నిలిపివేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందన్నారు. ఈ క్యాంటీన్లలో రూ.15కే మూడు పూటలా నాణ్యమైన టిఫిన్, భోజనం అందిస్తున్నామన్నారు.

● అన్నక్యాంటిన్‌లో ఆహార పదార్థాలను రుచి చూస్తున్న మంత్రి గొట్టిపాటి



హామీ నిలబెట్టుకున్న చంద్రబాబు : అనగాని

పేదలు ఎవరూ ఆకలితో అల్లాడ కూడదనే ఉద్దేశంతో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టగానే చంద్రబాబు అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేపల్లెలోని అంబేద్కర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా మూసివేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత చేసిన సంతకాల్లో అన్న క్యాంటీన్ అంశం ఒకటన్నారు. రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చెయ్యడానికి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, అడ్డదారిలో జగన్ అండ్‌కో వేల కోట్ల రూపాయలు దోచుకుతిన్నారన్నారు.

దాతల విరాళాలు

అన్న క్యాంటీన్లను నిర్విఘ్నంగా కొనసాగించడానికి సీఎం చంద్రబాబు దాతల సహకారాన్ని కోరగా పలువురు స్పందించి విరాళాలు ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్న క్యాంటీన్లు ప్రారంభించిన తొలిరోజునే పెద్దసంఖ్యలో దాతలు విరాళాలు అందజేశారు. చీరాలలో రూ.5.28 లక్షలు, అద్దంకిలో రూ.2 లక్షలు, బాపట్లలో లక్ష, రేపల్లెలో రూ.80,000 వరకు దాతలు విరాళంగా ఇచ్చారు.

● అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారం అందించేందుకు తన బాధ్యతగా జీతంలో నుంచి రూ.25 వేలు అందిస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రకటించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన రెండు అన్న క్యాంటీన్లలో ప్రతి శుక్రవారం అయ్యే భోజన ఖర్చు తానే భరిస్తానని ఎమ్మెల్యే నసీర్ ప్రకటించారు. ఒక నెల వేతనం నుంచి రూ.30 వేలను అన్న క్యాంటీన్ ట్రస్ట్‌కి అందిస్తానని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన కొల్లి జయరామిరెడ్డి రూ.10,116 చెక్ అందించారు.

● బాపట్లలోని సూర్యలంకరోడ్డులో ప్రారంభించిన అన్నక్యాంటీన్ నిర్వాహణకు ముప్పా కన్‌స్ట్రక్షన్స్ అధినేత, బ్లూప్లేట్ హోటల్ నిర్వాహకులు ముప్పా వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. రేపల్లె మండలం తుమ్మల గ్రామానికి చెందిన రేపల్లె సురేష్ రూ.25 వేలు, రేపల్లెకి చెందిన యలవర్తి లక్ష్మీ రూ.5వేలను అందించారు.

● సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో ఏర్పాటు చేసిన క్యాంటీన్ నిర్వాహణకు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు రూ.50,002 ఇచ్చారు. భవిష్యత్‌లో కూడా క్యాంటీన్‌కు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి రేగళ్ళ కోటిస్వామి రూ.లక్ష, ఎఫ్‌సీఏ విశ్రాంత ఉద్యోగి ఆచంట జనార్ధనరావు రూ.5వేలు ఇచ్చారు. పిడుగురాళ్లలో ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లో తొలిరోజు అల్పాహారం, భోజనాలను దాత బండ్ల హనుమంతరావు అందజేశారు. పట్టణానికి చెందిన యక్కల భాస్కరరావు రూ.51 వేలు, కట్టమూరి శంకరరావు రూ.50,116, యేలూరి చంద్రశేఖరరావు రూ.25,116 విరాళంగా అందజేశారు.

అందుబాటులోకి నాణ్యమైన విద్యుత్

● వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు 1912 టోల్ ఫ్రీ నెంబరు
● పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో మంత్రి రవికుమార్

బల్లికురవ, ఆగస్టు 16: వ్యవసాయానికి, గృహాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని కొప్పెరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గృహాలకు 24 గంటలు మెరుగైన విద్యుత్‌ను నిరంతరం అందించడంతో పాటు వ్యవసాయానికి పగలు 9 గంటలు విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరి చేస్తామన్నారు. జిల్లాలో మరో 12 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 46 వేల ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతుల దరఖాస్తులను వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపడతామన్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రభుత్వం 1912 టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులో ఉంచిందన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఆర్‌టీఎస్ ప్రత్యేక లైన్ల పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. కొప్పెరపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఒంగోలు ఎస్‌ఈ కేవీజీ సత్యనారాయణ, అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మార్టూరు ఏడీఈ ముప్పా సురేంద్రబాబు, తహసీల్దార్ రవికుమార్, బల్లికురవ సబ్ ఇంజనీర్ పి.వేదవ్యాస్, టీడీపీ నాయకులు మలినేని గోవిందరావు, షేక్ అబ్దుల్లా, నాగినేని సాంబయ్య, ఇప్పల అంజిరెడ్డి, ముంద్రు దానయ్య, ప్రవీణ్‌కుమార్, అంజనేయులు, దేవినేని నరేంద్ర, అమరనేని వినోద్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకు నీటి విడుదల

వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జోన్ 2లో ఉన్న ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో వరి సాగుకు సాగర్ నీటిని విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. పలువురు రైతులు సాగు నీటి సమస్య గురించి మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి మొదటిగా జోన్ 1కు, 15 రోజుల వ్యవధిలో రెండో జోన్‌కు నీటి విడుదల చేస్తామన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పంటలను పండించుకోవాలన్నారు. జంగమహేశ్వరపురం రెవెన్యూలోని ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని మార్టూరు, పంగులూరు మండలాల్లోని రైతులు మంత్రిని కోరగా ఆయన మార్టూరు తహసీల్దార్ ప్రశాంతితో మాట్లాడారు.



నాణ్యమైన విద్యుత్‌ను అందించే పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్



కొప్పెరపాడు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజలు చేస్తున్న మంత్రి రవికుమార్

లాజిస్టిక్ పార్కుకు భూ పరిశీలన

● తొలివిడతలోనే రాజధాని ప్రాంతానికి ప్రాధాన్యం
● కేంద్రం ఆమోదంతో భూసేకరణపై అధికారుల దృష్టి
● చంద్రబాబు చొరవతో అమరావతిలో పారిశ్రామిక వృద్ధి



భవిష్యత్‌లో ఏర్పాటు కానున్న లాజిస్టిక్ పార్క్‌ల నమూనా

తెనాలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వృద్ధి.. రవాణా వ్యవస్థ బలోపేతం.. ఉపాధి కల్పన దిశగా సీఆర్‌డీఏ ప్రాంతంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దేశం మొత్తం మీద 15 నగరాల్లో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో తొలివిడతలోనే ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతోపాటు ఏపీ రాజధాని అమరావతికి కూడా చోటుదక్కింది. అమరావతిని కీలకమైన ఆర్థిక శక్తి కేంద్రంగా మార్చాలనే చంద్రబాబు ఆలోచనలో భాగంగా లాజిస్టిక్ పార్కు ఏర్పాటు కానున్నది. ఇందుకు సంబంధించి కేంద్రం ఆమోదం లభించడంతో అధికారులు భూసేకరణపై దృష్టి సారించారు. ఈ పార్కు ఏర్పాటుకు గుంటూరు జిల్లాలో కొన్ని ప్రాంతాలను సీఆర్‌డీఏ ఎంపిక చేసింది. రాజధాని ప్రతిపాదిత ఔటర్ రోడ్డుకు అనుసంధానంగా భూములు ఉండేలా చూస్తున్నారనేది సమాచారం. వీటిలో తెనాలి మండలం నందివెలుగు, గుడివాడ, కఠెవరం, చేబ్రోలు మండలంలో గొడవర్రు, నారాకోడూరు, శేకూరు, సుద్దపల్లి, వేజండ్ల, దుగ్గిరాల మండలంలో చింతలపూడి, ఈమని, కొల్లిపర మండలంలో అత్తోట, కుంచవరం, మున్నంగి, వల్లభాపురం గ్రామాల పరిధిలో భూములను పరిశీలించాలని ఇప్పటికే ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం రాజధాని ఔటర్ రోడ్డు ప్రతిపాదిత ప్రాంతంగా సీఆర్‌డీఏ పేర్కొన్న నందివెలుగు ప్రాంతంలో భూములను తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ పరిశీలించారు. హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ పార్కును ఏర్పాటు చేయనున్నాయి. ఇదే కనుక జరిగితే రాజధాని అమరావతి పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల అభివృద్ధితో పాటు ఆయా ప్రాంతాల వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.

లాజిస్టిక్ పార్కు ఏర్పడితే..

పారిశ్రామిక ఏకీకరణ, గిడ్డంగుల ఏర్పాటు, అడ్డంకులు లేని రవాణా వ్యవస్థను సృష్టించటమే లక్ష్యంగా ఏర్పాటయ్యే లాజిస్టిక్ పార్కుతో ఆయా ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. 203 ఎకరాల్లో ఏర్పాటయ్యే పార్కు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1372 కోట్లు కేటాయించింది. దీనిలో రూ.147 కోట్లు భూ సేకరణకు, గోదాముల వంటి స్టోరేజ్ ప్రాంత అభివృద్ధికి రూ.494 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.731 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ నెలాఖరు లోపు ఈ ప్రక్రియ పూర్తిచెయ్యాలనేది సారాంశం. ఈ నెలాఖరుకు భూముల పరిశీలన పూర్తిచేసి, గుర్తించిన భూముల వివరాలను సీఆర్‌డీఏకు అందించాలి. ఆ తర్వాత విడతల వారీగా లాజిస్టిక్ పార్కు ఏర్పాటు సాకారం కానుంది.



నందివెలుగు దగ్గర మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ

జిల్లాలో 906 మంది టీచర్లు మిగులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 16 : జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి 906 మంది టీచర్లు మిగులుగా తేలారు. పాఠశాలల్లో ఆగస్టు 8 నాటికి ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా లెక్క తేల్చారు. మిగులు టీచర్ల సంఖ్యలో ఒంగోలు డివిజన్ ప్రథమస్థానంలో ఉండగా మార్కాపురం డివిజన్ చివరి స్థానంలో నిలిచింది. ఒంగోలు మండలంలో అత్యధికంగా 56 మంది టీచర్లు మిగులుగా తేలగా బేస్తవారపేట మండలంలో అతి తక్కువగా కేవలం ఆరుగురు మాత్రమే తేలారు. అర్ధవీడు మండలంలో తొమ్మిది మంది, సీఎస్‌పురం మండలంలో 20 మంది, చీమకుర్తి మండలంలో 33మంది, కంభంలో 31, దర్శిలో 50మంది, దొనకొండ 15, గిద్దలూరులో 13 మంది, హెచ్‌ఎంపాడులో 16 మంది, కనిగిరిలో 49 మంది, కొమరోలులో 8 మంది, కేకేమిట్లలో 33 మంది, కొండపిలో 12 మంది, కొత్తపట్నం 24 మంది, కురిచేడులో 20మంది మిగులుగా తేలారు. మద్దిపాడులో 26 మంది, మార్కాపురంలో 79, మర్రిపూడిలో 22, ఒంగోలులో 56 మంది, ముండ్లమూరులో 25 మంది, ఎన్‌జిపాడులో 14 మంది, పీసీపల్లిలో 23 మంది, పెదదోర్నాలలో 8 మంది, పామూరులో 14 మంది, పెద్దారవీడులో 27 మంది, పొదిలిలో 27 మంది, పొన్నలూరులో 24 మంది, పుల్లలచెరువులో 12 మంది, రాచర్లలో 27మంది, ఎస్‌ఎన్‌పాడులో 33 మంది, సింగరాయకొండలో 20మంది, తాళ్లూరులో 18 మంది, టంగుటూరులో 14 మంది, తర్లుపాడులో 19 మంది, త్రిపురాంతకంలో 26 మంది, వెలిగండ్లలో 7, యర్రగొండపాలెంలో 23, జరుగుమల్లిలో ఏడుగురు టీచర్లు మిగులుగా తేలారు. తాజాగా ఈనెల 16 వరకు పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని సర్దుబాటు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. దీంతో ఇప్పటివరకు ఏ పాఠశాలలో నమోదు లేని విద్యార్థుల కోసం టీచర్లు జల్లెడపడుతున్నారు. ఒకరిద్దరు విద్యార్థులు తక్కువైన చోట పోస్టులు మిగులుగా తేలుతుంటే వాటిని పోకుండా కాపాడుకోవేందుకు టీచర్లు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే యుడైస్‌లో పేరు ఉన్న విద్యార్థులందరూ భౌతికంగా ప్రతిరోజు పాఠశాలకు రావాల్సిందేనని విద్యాశాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో టీచర్ల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో, పోస్టులు పోకుండా ఏ మేరకు కాపాడుకుంటారో వేచిచూడాల్సిందే.

నేడు 93 పాఠశాలలకు ఎన్నికలు

ఒంగోలు(విద్య), ఆగస్టు 16: జిల్లాలోని 93 పాఠశాలల్లో శనివారం యాజమాన్య కమిటీల (ఎస్‌ఎంసీ) ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈనెల 8న జిల్లాలో 2,405 పాఠశాలలకు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించగా కోరం లేకపోవడం, కోర్టు ఉత్తర్వులు, ఇతర కారణాలతో 93 పాఠశాలల్లో నిలిచిపోయాయి 2,312 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. నిలిచిపోయిన పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు మళ్లీ షెడ్యూల్ ప్రకటించారు. తాజా షెడ్యూల్ ప్రకారం శనివారం పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాలి. ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదట ప్రతి తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ముగ్గురిని సభ్యులుగా ఎన్నుకుంటారు ఎన్నికైన సభ్యులు తమలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఎన్నికైన ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు, ఎక్స్‌అఫిషియో సభ్యులతో సమావేశం నిర్వహిస్తారు. ఎన్నికలను చేతులెత్తే విధానంలో లేదా నోటిమాటగా నిర్వహిస్తారు. తప్పని పరిస్థితుల్లో రహస్య ఓటింగ్ విధానంలో ఎన్నికను నిర్వహిస్తారు.

ఇద్దరు సీఐలకు పోస్టింగ్

ఐదుగురు ఎస్సైలు వీఆర్‌కు, ఒకరికి అటాచ్‌మెంట్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 16: పోలీసు శాఖలో బదిలీలలో భాగంగా ఇద్దరు సీఐలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరు రేంజి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం రేంజి వీఆర్‌లో ఉన్న టి.వెంకటేశ్వర్లను పొదిలి సర్కిల్‌కు, ఇంటెలిజెన్స్‌లో పని చేస్తున్న మేడా శ్రీనివాసరావును ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా జిల్లాలో వీఆర్‌లో ఉన్న బి.మహేంద్రను పుల్లలచెరువు పోలీసు స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేస్తు ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులిచ్చారు. అదేవిధంగా ఐదుగురు ఎస్‌ఐలను వీఆర్‌కు పిలిచారు. పుల్లలచెరువు ఎస్‌ఐ ఎండి.ఫిరోజ్ ఫాతిమా, పొదిలి ఎస్సై గొట్టం కోటయ్య, మార్కాపురం రూరల్ ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వర్లు, దర్శి ఎస్‌ఐ ఆర్ .సుమన్, జరుగుమల్లి ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు, పొన్నలూరు ఎస్‌ఐ ఎంవి.రాజేష్‌లను వీఆర్‌కు పిలిచారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానళ్లు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఆగస్టు 16: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేపట్టామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ కార్యాలయం ఆవరణంలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్ శాఖను సొంత లాభాలకే వాడుకుందని, కొత్తగా ఎలాంటి ఉత్పత్తీ చేపట్టలేదన్నారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సొంత ఇళ్లపైకూడా విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీ ఇస్తుందన్నారు. రాష్ట్రంలో 46 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు మంజూరు చేశామని చెప్పారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేకంగా విద్యుత్ లైన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్ శాఖ ద్వారా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. అద్దంకి పట్టణంలో 2 కోట్ల రూపాయల వ్యయంలో 470 విద్యుత్ స్తంభాలకు తీగలు ఏర్పాటు చేయడంతో పాటు కోటి రూపాయలు వ్యయంతో 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశామన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలో ముప్పవరం, వి. కొప్పెరపాడు, కొమ్మాలపాడు సబ్ స్టేషన్‌లలో అదనంగా 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణం కూడా చేపడుతున్నామన్నారు. అద్దంకి పట్టణంలోని గీతామందిర్ రోడ్డులో షిపా స్పెషాలిటీ హస్పిటల్‌ను మంత్రి రవికుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీచరణ్, టీడీపీ నేతలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్

మార్టూరు, ఆగస్టు16: హెచ్‌ఐవీని సమూలంగా నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నదని, వారికి వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మార్టూరు హెల్ప్‌టీఐ సిబ్బంది చిలకలూరిపేటలో మంత్రి నివాసంలో గొట్టిపాటి రవికుమార్ ను కలిశారు. హెచ్‌ఐవీ నివారణకు ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్న తీరును ప్రతినిధులు ఆయనకు వివరించారు. అనంతరం హెచ్‌ఐవీపైఅవగాహన కోసం ఏర్పాటుచేసిన వాల్‌పోస్టర్‌ను మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్, దుర్గ, రూతు, సల్మా, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నిండగా...

అన్న క్యాంటీన్లను ప్రారంభించిన మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్

ఒంగోలు, చీమకుర్తిలలో సంబరంగా కార్యక్రమం

రెండు చోట్ల పాల్గొన్న కలెక్టర్

కడుపు నింపుకొని హర్షం వ్యక్తం చేస్తున్న పేదవర్గాలు

ఒంగోలు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పేదోడి ఆకలి తీర్చే కేంద్రాలైన అన్నక్యాంటీన్లు తిరిగి ప్రారంభమయ్యాయి. తొలివిడతగా జిల్లాలో ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి శుక్రవారం నుంచి ప్రారంభంకాగా మరో మూడు పట్టణాలలో వచ్చేనెల 1 నుంచి ప్రారంభంకానున్నాయి. పండుగ వాతావరణంలో సంబరంగా క్యాంటీన్లను మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్‌లు ప్రారంభించగా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. గత టీడీపీ ప్రభుత్వకాలంలో తొలిగా అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేసి పేదలకు కేవలం రూ.5కే టిఫిన్, భోజనం అందజేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం కలిపి కేవలం రూ.15కే దొరికేది. దీంతో నిత్యం వందలాది మంది పేదలు వాటిలో భోంచేసేవారు. రుచిశుచి బాగా ఉండటంతోపాటు అతి తక్కువ ధరకు ఆహారం లభించడంతో పేదలకు ఆకలి తీరేది. దీంతో అనతికాలంలోనే విశేషంగా ప్రజాదరణ లభించింది. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేసి అప్పటివరకు ఆకలి తీర్చుకున్న పేదల కడుపు కొట్టింది. కాగా తిరిగి అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లు పునరుద్ధరించి పేదల ఆకలి తీర్చుతామని కూటమి తరపున టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇతర నేతలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఆచరణలో పెట్టారు.

జిల్లాలో ఐదు కేంద్రాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలు తిరిగేసరికి మళ్లీ అన్న క్యాంటీన్లు ప్రారంభించింది. తొలివిడతగా రాష్ట్రంలో వంద అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించగా అందులో జిల్లాలో ఐదు క్యాంటీన్లు శుక్రవారం ప్రారంభించారు. గతంలో ఒంగోలులో నాలుగు, చీమకుర్తి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిలలో ఒక్కొక్కటి ఏర్పాటు చేశారు. వాటిని తిరిగి ప్రారంభిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసివేసిన వాటిలో రకరకాల కార్యకలాపాలు నిర్వహించడంతో వాటిని తిరిగి అన్నా క్యాంటీన్లుగా మార్పు చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వ రూ.54లక్షలు వెచ్చించి మరమ్మతులు చేసింది. ఆహ్లాదకరమైన వాతావరణం అన్న క్యాంటీన్లు వద్ద ఉండేలా తీర్చిదిద్దారు. తొలివిడతగా ఒంగోలులో నాలుగు, చీమకుర్తిలో ఒకటి శుక్రవారం నుంచి ప్రారంభం కాగా మిగిలిన మూడు వచ్చేనెల 1 నుంచి ప్రారంభించేలా ఏర్పాటుచేశారు. కాగా శుక్రవారం ఉదయం తొలుత చీమకుర్తిలో అన్న క్యాంటీన్‌ను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియాలు పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఒంగోలులోని నాలుగు క్యాంటీన్లను మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్‌లు ప్రారంభించగా ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయకుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు.

క్యాంటీన్‌లోనే టిఫిన్ చేసిన మంత్రి, ఎమ్మెల్యేలు

క్యాంటీన్ల ప్రారంభ కార్యక్రమం పండుగ వాతావరణంలో సంబరంగా సాగాయి. మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు పేదలకు వడ్డించడంతోపాటు వారూ టిఫిన్ తిన్నారు. నామమాత్రపు ధరతో పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడంతోపాటు రుచికి శుచికిప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. కాగా అన్న క్యాంటీన్లలో ఆహారం కోసం పేదలు భారీగా తరలివచ్చారు. ఆటో, భవన నిర్మాణ కార్మికులు, మెకానిక్, ఇతర వృత్తులు చేసుకునేవారు బయటి ప్రాంతాల నుంచి ఆస్పత్రులు, కార్యాలయాలకు పనులపై వచ్చిన వారు బారులు తీరి నిలబడి టోకెన్లు తీసుకొని భోజనం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఒంగోలులోని నాలుగు క్యాంటీన్లలో ఉదయం టిఫిన్ 2,200 మంది, మధ్యాహ్న భోజనం 2వేల మంది చేసినట్లు సమాచారం. చీమకుర్తిలోనూ 500మందికిపైగా తిన్నారు. రెండు పట్టణాలలో భారీగా పేదలు రావడంతో ఆయా క్యాంటీన్ల వద్ద మధ్యాహ్న సమయంలో తీవ్ర రద్దీ వాతావరణం కనిపించింది. ఒంగోలులో సరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి అన్న క్యాంటీన్ల ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందజేశారు.



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్

జిల్లాలో భూప్రకంపనలు



రెవెన్యూ రికార్డుల పరిశీలన ప్రారంభం

జిల్లావ్యాప్తంగా లక్షా 30వేల ఎకరాలు హాంఫట్

కనిగిరి డివిజన్‌లోనే 70వేల ఎకరాలను మింగిన వైసీపీ నేతలు

అత్యధికంగా కనిగిరి మండలంలో 25వేలకుపైగా ఎకరాలు

విచారణకు ప్రత్యేక అధికారులు నియామకం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 16: వైసీపీ ప్రభుత్వంలో చట్టాలను చట్టుబండలు చేసి భూములను కాజేసిన వ్యవహారంపై విచారణ ప్రారంభం కానుంది. గత వైసీపీ ప్రభుత్వంలో అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూముల విషయంలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. మదనపల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయం తగలబెట్టిన ఉదంతం నేపథ్యంలో జగన్ పాలనలో అక్రమాలు పెద్దఎత్తున జరిగాయని కూటమి ప్రభుత్వం గుర్తించింది. అందులోభాగంగా రాయలసీమ జిల్లాలతోపాటు ప్రకాశం జిల్లాలో కూడా భూములను వైసీపీ సానుభూతిపరులు, ప్రజాప్రతినిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించారు. అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూములను దోచుకున్న వారి పని పట్టేందుకు శ్రీకారం చుట్టడంతో వైసీపీ నేతల్లో వణుకు ప్రారంభమైంది. ప్రకాశం జిల్లాలో సుమారు లక్షా 30వేల ఎకరాల భూములను ఆ విధంగా వైసీపీ ప్రభుత్వంలో కాజేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. అందులో ఒక్క కనిగిరి డివిజన్‌లోనే సుమారు 70వేల ఎకరాలను అక్రమంగా రికార్డులను తారుమారు చేయగా, అందులో కనిగిరి మండలంలోనే అత్యధికంగా 25వేల ఎకరాల అసైన్డ్, చుక్కలు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు తేల్చారు. అలా కొనకనమిట్ల మండలంలో 11,974 ఎకరాలు, సీఎస్‌పురం మండలంలో 8,900 ఎకరాలు, పుల్లలచెరువు మండలంలో 10వేల ఎకరాలు, మార్కాపురం మండలంలో 3,300 ఎకరాలు, వైపాలెంలో 2,350 ఎకరాల రికార్డులను తారుమారు చేసినట్లు సమాచారం. మిగిలిన మండలాల్లో కూడా ప్రభుత్వ, అసైన్డ్ భూములను రికార్డులను మార్చేసి ఆ భూములను వైసీపీ నేతలు కైంకర్యం చేశారు.

పరిశీలనకు ప్రత్యేక బృందాలు

జిల్లాలోని కనిగిరి మండలపరిధిలో భూపత్రాల పరిశీలన కోసం కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌తోపాటు తహసీల్దార్, సర్వేయర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఈ రికార్డులు తనిఖీ చేయనున్నారు. రికార్డుల పునఃపరిశీలన పూర్తిచేసేందుకు మరింత సమయం పడుతుందని అధికారులు గుర్తించినట్లు సమాచారం. కనిగిరి మండలంలో భూ అక్రమాలపై విచారణ పూర్తయిన తర్వాత వచ్చే ఫలితాల ఆధారంగా మిగిలిన మండలాల్లో ఈ తనిఖీలు చేపట్టనున్నారు అందుకోసం ప్రత్యేకంగా ప్రొఫార్మాను రూపొందించి డేటా సేకరణకు సిద్ధం చేయాలని సీసీఎల్ఏ ఆదేశించినట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో కొందరు వైసీపీ నేతలు భూముల దందా చిట్టా స్పష్టంగా బయటకు వస్తున్నట్లు తెలిసింది. కాగా వైసీపీ నేతలు తమ భూ అక్రమాల రికార్డులను బయటి సమాజం తెలుసుకోకుండా ఉండేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కనిగిరి ప్రాంతంలో అసైన్డ్, ప్రభుత్వ భూములతోపాటు పట్టాదారు భూముల విషయంలో కూడా పెద్దఎత్తున అక్రమాలు చేశారని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం ముందుగా కనిగిరి మండలంలో ఈ భూముల రికార్డులను తనిఖీకి శ్రీకారం చుట్టడంతో వైసీపీ నేతల్లో ఆందోళన ప్రారంభమైంది.

హీరో నిఖిల్‌కు ఎమ్మెల్యే కొండయ్య కుటుంబ సభ్యుల అభినందనలు

చీరాల, ఆగస్టు 16 : హీరో నిఖిల్ సిద్ధార్థ్‌కు ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య, ఆయన కుమారులు గౌరీ అమర్‌నాథ్, మహేంద్రనాథ్‌లు అభినందనలు తెలిపారు. శుక్రవారం 70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో జాతీయ ఉత్తమ తెలుగు చలనచిత్రంగా కార్తికేయ-2కు అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో హీరో నిఖిల్ మామ చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య, నిఖిల్ బావ గౌరీఅమర్‌నాథ్, బావమరిది టీడీపీ చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌లు నిఖిల్‌ను అభినందించారు. గత ఎన్నికలలో కూటమి అభ్యర్థులుగా చీరాల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా ఎం.ఎం కొండయ్య ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ల గెలుపు ఓటు ద్వారా ఆశీర్వదించాలని నిఖిల్ చీరాల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా సందర్భాల్లో చీరాల నియోజకవర్గంలోని యువత పెద్ద ఎత్తుల నిఖిల్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. ఈ క్రమంలో కార్తికేయ- 2కు అవార్డు రావటం పట్ల ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



హీరో నిఖిల్‌కు స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, కుమారులు

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత

మేదరమెట్ల, ఆగస్టు 16: దైవాలరావూరు ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు ఉపకార వేతనాలు కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందెపు రాజశేఖర్ గ్రామస్థుల ద్వారా అందజేశారు. పదో తరగతిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి 5 వేలు, ద్వితీయస్థానం 3వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ. 2 వేలు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నగదును విద్యార్థులకు అందజేశారు.

జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు!

కొండపిలో 260 మందికి ఇళ్ల పట్టాలు

ఊరికి దూరంగా ఉండటంతో ఆసక్తి చూపని లబ్ధిదారులు

గృహం నిర్మించింది ఒక్కరే ప్రారంభించి మధ్యలోనే నిలిపేసిన 20 మంది

నిర్మాణ సామగ్రి దొంగలపాలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో తీగ చోరీ

కొండపి, ఆగస్టు 16 : కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పేరుతో హడావుడి చేసింది. అయితే ఊరూరా వెలిసిన జగనన్న కాలనీలు పేరుగొప్ప. ఊరుదిబ్బ అన్న చందంగా తయారయ్యాయి. గ్రామాలకు దూరంగా నివాస యోగ్యంకాని ప్రాంతాల్లో లేఅవుట్లు వేసి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో అక్కడ ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో భూమి కొనుగోలు, మెరక, మౌలిక సదుపాయాల కల్పన పేరుతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. పనిలో పనిగా వైసీపీ నేతలు జేబులు నింపుకున్నారు. ఇప్పుడు ఈ కాలనీల్లో దొంగలు పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని తీగను చోరీ చేస్తున్నారు. నిర్మాణదారులకు నీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులను సైతం ఎత్తుకెళ్తున్నారు. కొండపిలోని జగనన్న కాలనీని పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. నియోజకవర్గ కేంద్రమైన కొండపిలోని లబ్ధిదారులకు స్థానిక పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెం-ఇలవర (నేతివారిపాలెం) గ్రామాల మధ్య భూమి కొనుగోలు చేసి జగనన్న కాలనీకి ప్రభుత్వం కేటాయించింది. అది కొండపికి దాదాపు 5 కి.మీ దూరంలో ఉంది. దాదాపు 260 మంది పేదలకు ఈ కాలనీలో పట్టాలు ఇచ్చారు. అయితే ఏదో ఒకటి పట్టా ఇస్తున్నారని పేదలు తీసుకున్నారు. కానీ కాలనీలో ఒక్క ఇల్లు మాత్రమే నిర్మాణం పూర్తయింది. దాదాపు 20 గృహాలు వివిధ స్థాయిల్లో నిలిచిపోయాయి. మిగిలిన వారు అసలు నిర్మాణాలే ప్రారంభించలేదు. ఇళ్ల మెటీరియల్‌ను దొంగలు చోరీ చేయడంతో గృహాలు నిర్మించుకోవాలనుకున్న ఒకరిద్దరు లబ్ధిదారులు కూడా వెనక్కి తగ్గారు. భూమి కొనుగోలుకు లక్షల రూపాయలు ప్రభుత్వం వెచ్చించింది. ఇవికాక మెరకలు తోలడానికి, పదేపదే ఈ కాలనీలో జంగిల్ క్లియరెన్స్ పేరుతో వైసీపీ నాయకులు లక్షల రూపాయలు దోచుకున్నారు. నాయకుల స్వార్థం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు.



ట్రాన్స్‌ఫార్మర్‌లోని తీగను దొంగిలించి వదిలేసిన ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్‌లలో తీగ చోరీ

కాలనీలో ఇళ్లు లేకుండానే విద్యుత్ సౌకర్యానికి ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసింది. స్తంభాలు, తీగలు, 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఐదింటిని విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసింది. అయితే కాలనీ ఎప్పుడూ నిర్మానుష్యంగా ఉంటుండటంతో దొంగలు ఐదు ట్రాన్స్‌ఫార్మర్‌లలోని విలువైన తీగను చోరీ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లను కింద చెట్లలో పడేశారు. కొన్ని ఇళ్లకు కలిపి అక్కడే సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేసి వీటిపై 10 వేల లీటర్ల నీటి ట్యాంకులు ఉంచారు. నిర్మాణదారులకు నీటి వసతి లేకపోవడంతో వీటిని ఏర్పాటు చేశారు. వాటిలో కొన్నింటిని దొంగలు మాయం చేశారు. మరికొన్ని వృథాగా పడి ఉన్నాయి. మొత్తంగా జగనన్న కాలనీ పేరుతో లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని పలువురు విమర్శిస్తున్నారు. అనువైన భూమిలో పట్టాలు ఇవ్వకపోవడవ వల్లనే ఇదంతా జరిగిందని లబ్ధిదారులు వాపోతున్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఫ్రీహోల్డ్, అక్రమ వెంచర్ల పరిశీలన

కనిగిరి, ఆగస్టు 16: ఫ్రీహోల్డ్ మార్పుల్లో అక్రమమని తేలితే ఆయా అధికారులపై చర్యలు తప్పవని జేసీ గోపాలకృష్ణ హెచ్చరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూముల రీసర్వేపై శుక్రవారం రెవెన్యూ అధికారుల, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఏమాత్రం ఆమోదయోగ్యంకాని భూ ములను ఫ్రీహోల్డ్ భూములుగా మార్చి అవినీతికి పాల్పడినట్లు రుజువైతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోనే కనిగిరి నియోజకవర్గంలో అత్యధికంగా అక్రమంగా వెంచర్ల వేసినట్లు చెప్పారు. ఇటీవల ఫ్రీహోల్డ్ భూములుగా ఆయా భూములను మార్చిన విషయంపై ప్రత్యేకంగా దృష్టిసారించి నిజాలు నిగ్గు తేల్చాలని అధికారులను జేసీ ఆదేశించారు. కనిగిరి మండలంలోని 40 రెవెన్యూ గ్రామాల్లో 13 బృందాలుగా ఏర్పాటుచేసి ఫ్రీహోల్డ్‌కు సంబంధించిన భూముల దస్త్రాలను పరిశీలించనున్నట్లు జేసీ తెలిపారు. ఒక్కో బృందంలో డీటీ, ఆర్ఐ, వీఆర్ఓ, సర్వేయర్ ఉంటారన్నారు. వీరు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి 22ఏ, బీ, సీ, డీ, అసైన్డ్‌ల్యాండ్, ఫ్రీహోల్డ్, చుక్కల భూములను పరిశీలించి పూర్తిస్థాయిలో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఫ్రీహోల్డ్ మార్పుచేసే క్రమంలో నిబంధనలను ఏమేరకు పరిగణనలోకి తీసుకున్నారో భూమి సర్వే నెంబరు వివరాల్లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం రెవెన్యూ రికార్డు గదిని పరిశీలించారు. ఆతర్వాత యడవల్లి పరిధిలోని 309/1 భూమిని, మాచవరం, శంఖవరం ప్రాంతాల్లో ఫ్రీహోల్డ్ కింద మార్పులు చేసిన భూముల రికార్డులను పరిశీలించి సర్వే చేపట్టారు. ఫ్రీహోల్డ్ భూములుగా మారిన భూములకు రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.



మాచవరం వద్ద ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న జేసీ, రిజిస్ట్రార్



మంత్రి రవికుమార్‌కు గోశాల సమస్యలను వివరిస్తున్న నిర్వాహకుడు సుబ్బారావు

గోశాలకు ప్రభుత్వ స్థలం కేటాయించేందుకు కృషి

● మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఆగస్టు 16: గోశాలలో పశుగ్రాసం కొరత, స్థలం సమస్యలపై ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితం అయిన కథనం చదివాను. గోశాలకు అవసరం అయిన స్థలాన్ని కేటాయింపు చేయిస్తానని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకిలోని హరిహర గోకులం సమస్యలను నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోగా అన్ని విషయాలు ఆంధ్రజ్యోతిలో చదివాను అని తెలిపారు. వెంటనే తహసీల్దార్ శ్రీచరణ్‌కు మంత్రి రవికుమార్ ఫోన్ చేసి గోకులానికి అవసరం అయిన స్థలాన్ని వెంటనే కేటాయించాలన్నారు.

మంత్రికి పుస్తకాలు అందజేత

పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన అద్దంకి కథలు, ప్రతిభామూర్తి ప్రకాశం పంతులు పుస్తకాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు. పలువురు సాహితీ సంస్థల ప్రతినిధులు మంత్రిని సన్మానించారు.

పింఛన్ మంజూరు చేయిస్తా



పింఛన్ మంజూరు చేయించమని వేడుకుంటున్న దివ్యాంగుడు

మండలంలోని తిమ్మాయపాలెంకు చెందిన దివ్యాంగుడు వీరాంజనేయులు తనకు పింఛన్ నిలిచిపోయిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన రవికుమార్ పింఛన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులను పిలిచి పింఛన్‌కు దరఖాస్తు చేయించాలని సూచించారు. తన సొంత నగదును ఇద్దరు దివ్యాంగులకు అందజేశారు.

అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం అక్కడకు వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. అత్యధిక శాతం అర్జీలను అక్కడకు వచ్చిన అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. మిగిలిన అర్జీలను ఆయాశాఖలకు పంపించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



శిక్షణలో పాల్గొన్న ప్రతినిధులు

సురక్షిత నీటితో సంపూర్ణ ఆరోగ్యం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 16 : సురక్షిత మంచినీరు సేవించడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జల జీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్లు తేజ్ సంగీత్, రంగారావు పేర్కొన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెంలో ఏపీ ప్రభుత్వంచే జలజీవన్ మిషన్‌పై జేజేఎం, డీపీఎంయూ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతున్న ఈ శిబిరంలో జిల్లా ప్రతినిధులు పాల్గొని అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి 55 లీటర్లు సురక్షిత మంచినీటిని కుళాయిల ద్వారా అందించడమే జలజీవన్ లక్ష్యమన్నారు. వీటిపై నైపుణ్యాలను పెంచుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. రోగ నియంత్రణకు శిక్షణలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి నూకతోటి రవిచంద్ర, ట్రైనర్ రాజు, నల్‌జల్ మిత్రలు, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.



శీతల గిడ్డంగుల్లో నిల్ల ఉంచిన శనగల బస్తాలు

పెరిగిన శనగల ధర

● రూ.7,400 పలికిన జేజే 11 రకం
● కాక్-2 రకం రూ.10వేల పైనే..
● నిల్వ ఉంచిన రైతుల్లో ఆనందం

ఇంకొల్లు, ఆగస్టు 16 : శనగల ధరల్లో కదలిక వచ్చింది. రోజు రోజుకూ ధర పెరుగుతోంది. ఈ ఏడాది రైతులకు పంట చేతి కందిన సమయంలో జెజె 11 రకం క్వింటా నాణ్యతను బట్టి రూ.5,800 నుంచి రూ.6,000 ధర ఉండగా జూలై మొదటి వారంలో రూ.7,000 మార్కెట్ పెరిగింది. గత మూడు నాలుగు రోజులుగా కదలిక ప్రారంభమై ప్రస్తుతం శుక్రవారం క్వింటా రూ.7,400 పలికింది. ఈ ఏడాది జేజే 11 రకం దిగుబడి తక్కువగా ఉండటంతో నిల్వలు కూడా తగ్గాయి .దీంతో గిరాకీ వచ్చిందని, కాక్2 రకం శనగలు కూడా మూడు నెలల క్రితానికి ప్రస్తుతానికి రూ.3,000 పెరిగి క్వింటా రూ.10వేల నుంచి 10,300 వరకు పలుకుతున్నాయని వ్యాపార వర్గాలు తెలిపాయి. ఒక వైపు పండుగ సీజను, ప్రభుత్వ రాయితీ విత్తనాలు కొనుగోలు చేసే సమయం కావడం వల్ల శనగల ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు

సృజనాత్మకతను వెలికి తీసేందుకే క్విజ్ పోటీలు

● రొటేరియన్ ఉదయభాస్కర్

పర్చూరు, ఆగస్టు 16: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని రొటేరియన్ పాబోలు ఉదయ భాస్కర్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక రోటరీ భవనంలో పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాల పరిధిలో పాఠశాల స్థాయిలోని విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం ప్రోత్సాహక నగదుతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. మొదటి బహుమతి సాధించిన శారదా హైస్కూల్ విద్యార్థులకు రూ.2,516 నగదు, ద్వితీయ బహుమతి పొందిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు రూ.2116, మూడవ బహుమతి పొందిన శ్రీ శాతవాహన విద్యార్థులకు రూ.1,516 చొప్పున అందజేశారు. ఈకార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, పంబి సదానందరెడ్డి, మున్నంగి వెంకటసుబ్బయ్య, తేళ్ళ రమేష్ చంద్ర, నాగబైరు శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, భవనం రాజగోపాలరెడ్డి, కొల్లా సుబ్బారావు, కాసా అశోక్ కుమార్ వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల కడుపునింపుతున్న అన్నక్యాంటీన్

వెల్లివిరుస్తున్న ఆనందం
ప్రజల్లో హర్షాతిరేకం

అద్దంకి, ఆగస్టు 16: అన్న క్యాంటీన్ ప్రారంభంతో పేదలలో ఆనందం వెల్లువిరుస్తోంది. 5 రూపాయలకే టిఫిన్, భోజనం అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకిలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లో శుక్రవారం భోజనం చేసిన ప్రజల మనోగతాలు ఇలా ఉన్నాయి.



రిక్షా తొక్కిన డబ్బులలో వంద అన్నంకే ఖర్చు

-మేదర రామకోటయ్య, రిక్షా కార్మికుడు, సూరేపల్లి, బల్లికురవ మండలం



రోజూ సూరేపల్లి నుంచి అద్దంకి వచ్చి రిక్షా తొక్కి నాలుగు వందల రూపాయలు సంపాదిస్తుంటాం. అందులో 100 రూపాయలు మధ్యాహ్నం భోజనానికి ఖర్చు అయ్యేది. అన్న క్యాంటిన్ ప్రారంభించడంతో 5 రూపాయలకే పుష్టిగా తిన్నాను. కూరలు చాలా రుచిగా ఉన్నాయి.

భోజనం చాలా బాగుంది

-ఎం. చిన్న నాగిరెడ్డి, రైతు, శంఖవరప్పాడు, అద్దంకి మండలం.

అన్న క్యాంటీన్‌లో పెట్టిన భోజనం చాలా బాగుంది. మోటార్ సైకిల్ రిపేర్ కోసం వచ్చి అన్న క్యాంటిన్‌లో భోజనం చేశాను.

ఎద్దులు కొనుగోలు కోసం అద్దంకి వచ్చాను

-ఆర్. కోటేశ్వరరావు, కొణిజేడు, టంగుటూరు మండలం



ఎద్దుల కొనుగోలు కోసం అద్దంకి వచ్చాను. మధ్యాహ్నం అన్నం తినే సమయంలో అన్న క్యాంటీన్‌కు వచ్చి భోజనం చేశాను. బయట హోటల్‌కు వెళితే 100 రూపాయలు ఖర్చు అయ్యేది. అన్న క్యాంటీన్‌లో 5 రూపాయలకే కడుపునిండా తిన్నాను.



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలు

ఆకలితోనే ఇంటికి వెళ్లా..

-గాదం వెంకమ్మ, యాచకురాలు, వినుకొండ.



అద్దంకిలో భిక్షాటన కోసం వచ్చిన సమయంలో 100 రూపాయలతో హోటల్‌లో తినలేక ఆకలితోనే పలుమార్లు ఇంటికి వెళ్ళాను. అన్న క్యాంటీన్ ఏర్పాటుతో 5 రూపాయలకే భోజనం పెట్టడంతో తృప్తిగా తిన్నాను.



అన్న క్యాంటీన్‌కు లక్ష రూపాయల చెక్కును విరాళంగా మంత్రి రవికుమార్ ద్వారా అందజేస్తున్న టీడీపీ నేత కోనేటి అనిల్

అన్న క్యాంటీన్‌కు విరాళాలు

అద్దంకి, ఆగస్టు 16: అద్దంకిలో అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మంత్రి రవికుమార్ ప్రారంభించగా అక్కడకు వచ్చిన వారు తమవంతుగా విరాళాలను అందజేశారు. అద్దంకి పట్టణంలోని దామావారిపాలెంకు చెందిన టీడీపీ నేత కోనేటి అనిల్ లక్ష రూపాయల విరాళం చెక్కును మంత్రి రవికుమార్ ద్వారా అందజేశారు. అద్దంకి మండలంలోని వెంకటాపురంకు చెందిన కాంట్రాక్టర్‌లు దాట్ల రాజా, రత్నాకర్ సోదరులు లక్ష రూపాయల చెక్కును రవికుమార్ ద్వారా అందజేశారు. అద్దంకి మండలం చిన్నకొత్తపల్లికి చెందిన జొన్నలగడ్డ నాగేశ్వరరావు 100 మందికి అన్న క్యాంటీన్‌లో టోకెన్‌లు కొనుగోలు చేసి పంపిణీ చేశారు.

ప్రతిష్టాత్మకంగా క్యాంటీన్ల నిర్వహణ

తొలిరోజు రూ.5.28 లక్షలు విరాళం అందించిన దాతలు

చీరాల, ఆగస్టు 16 : 'అన్నా క్యాంటీన్ నిర్వహణకు విరాళాలు సేకరిద్దాం. అందుకు తొలి అడుగువేశాం. మంచి స్పందన వచ్చింది. రూ. కోటి లక్ష్యంగా విరాళాలు సేకరించి ట్రస్టుకు అందజేస్తామని' ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య చెప్పారు. స్థానిక హైస్కూల్ రోడ్డులో శుక్రవారం అన్న క్యాంటీన్ ప్రారంభించిన తరువాత క్యాంటీన్ ప్రాంగణంలో ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజవకర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌లు మొక్కను నాటారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ఎంతటి సుదీర్ఘ ప్రయాణమైనా తొలి అడుగుతో ప్రారంభం అవుతుందన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అందుకు భావసారూప్యం కలిగిన ప్రతి ఒక్కరు ఇతోధికంగా విరాళాలు ఇచ్చి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అందుకు ముందస్తుగా తన వంతుగా రూ.54,000 ప్రకటించారు. ఈ క్రమంలో గజవల్లి శ్రీనివాసరావు రూ. లక్ష, బోయినవారిపాలెంకు చెందిన చప్పిడి పోలయ్య రూ. లక్ష, భారత్ ఇండస్ట్రీస్ నిర్వహకులు రూ.1,01,116లు, అభిరుచి రెస్టారెంట్ నిర్వహకులు రూ.51,116లు, కౌన్సిలర్లు పి. సుబ్బయ్య రూ.25వేలు, ఎస్. లక్ష్మి రూ.25వేలు, ఎంఆర్ఎఫ్ రమేష్ రూ.25వేలు, మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి రూ.10వేలు, గ్రంధి ఆదిత్య రూ.10,116లు, బీజేపీ చంద్ర రూ.5వేలు, కౌన్సిలర్లు అప్పల అరుణరెడ్డి రూ.5,116లు, సత్యానందం రూ.5వేలు, యానాదిరావు రూ.5వేలు, రమణమ్మ రూ. వెయ్యి, జి. మనోహర్ రూ.500లు విరాళంగా అందజేశారు. మొత్తంగా తొలిరోజే దాతలు రూ. 5.28 లక్షలు అందించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ అన్న క్యాంటీన్ పునఃప్రారంభం సందర్భంగా నాటిన మొక్కను కూడా సంరక్షించాలన్నారు. ఆ మొక్క పెరిగి పెద్దయి ఫలాలు, నీడను అందించేప్పుడు భవిష్యత్ తరం వారికి స్ఫూర్తిదాయకం అవుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ ప్రాంగణంలో మొక్కను నాటుతున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య, డాక్టర్ మహేంద్రనాథ్

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతపూజలు



రామలింగేశ్వరుని ఆలయ సన్నిధిలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు (పంగులూరు)

బల్లికురవ. ఆగస్టు 16 : శ్రావణ మాసంలో శుక్రవారం వచ్చే వరలక్ష్మీ వ్రత పూజలను మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే మహిళలు ఎంతో ఇష్టంగా లక్ష్మీ దేవి అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పొంగళ్లు పెట్టుకొని ముత్తాయిదువులను పిలిచి వారికి తాంబులాలను అందజేశారు. గ్రామాలలో వరలక్ష్మీ పూజల ప్రభావంతో పూలకు ,కాయలకు మరింత డిమాండ్ పెరిగింది.

పంగులూరులో

పంగులూరు : మండలంలో గ్రామ గ్రామానా శుక్రవారం వరలక్ష్మీవ్రత పూజలు మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాలకు చేరుకున్న మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామకూరు కొండపైన వేంచేసిఉన్న బాల త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి సన్నిధిలో మహిళలు వరలక్ష్మీవ్రతం సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు

అద్దంకిటౌన్ : శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ, శ్రీ ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కన్యక పరమేశ్వరి అమ్మవారిని కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించారు. ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

యద్దనపూడిలో..

యద్దనపూడి, (మార్టూరు) : శ్రావణ శుక్రవారం సందర్భంగా యద్దనపూడి, మార్టూరు మండలాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఇళ్లలో లక్ష్మీదేవి చిత్రపటాన్ని మహిళలు పూలతో అందంగా అలంకరించారు. వివిధ రకాలైన ప్రసాదాలను తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అలాగే యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రధానపూజారి దీవి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మహిళలు వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.



గన్నవరం దేవాలయంలో విశేష అలంకరణలో లక్ష్మీదేవి (మార్టూరు)



ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంలో వరలక్ష్మి అమ్మవారు (అద్దంకిటౌన్)

భక్తులతో కిక్కిరిసిన అమ్మవారి ఆలయాలు

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 16: వరలక్ష్మీ వ్రత వేడుకలను మహిళా భక్తులు మండలంలో ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచే అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఇంటి వద్దనే వరలక్ష్మీ అమ్మవారి వ్రత కార్యక్రమం ఆచరించి భక్తిని చాటుకున్నారు. భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకోవటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

దేశభక్తిని చాటిన చిరువ్యాపారి

పంగులూరు, ఆగస్టు 16 :స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర పటాలను పాఠశాలకు బహూకరించి దేశభక్తిని చాటాడు ఓ చిరువ్యాపారి. మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామానికి చెందిన పచ్చిపులుసు వెంకట నాగేశ్వరరావు నూజెళ్ళపల్లి గ్రామంలో దశాబ్దకాలంగా చిరువ్యాపారం సాగించారు. గ్రామంపై అభిమానంతో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలకు మూడున్నర వేలు విలువ చేసే పదిమంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర పటాలను బహూకరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బాలబాలికలకు ప్రత్యేక భోజన సదుపాయం కల్పించారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామిగా ఉంటూ సహకారం అందిస్తున్న నాగేశ్వరరావుకు హెచ్ఎం వీరాంజనేయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

కమిషనర్‌పై ఆరోపణలు

చీరాల, ఆగస్టు 16 : స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి తమను అవమానపరిచారని మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. స్థానిక మున్సిపల్ ఛైర్మన్ చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కమిషనర్ పంపిన సర్క్యులర్‌లోని టైమ్‌కు ముందుగా ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే కొండయ్యతో జెండా ఎగురవేయించారని, అలానే విద్యుత్ దీపాల మరమ్మతులకు వినియోగించే వాహనాన్ని కూడా నిర్ణీత సమయానికన్నా ముందుగా ప్రారంభింపజేశారని వాపోయారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌వోకు ఫిర్యాదు అందజేశామన్నారు.

రేణంగివరం ఎస్ఐగా వినోద్‌బాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ

పంగులూరు, ఆగస్టు 16 : రేణంగివరం ఎస్ఐగా బి.వినోద్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లాలో పనిచేస్తూ పంగులూరు మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినోద్‌బాబు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు కృషిచేస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రేపు ముప్పవరంలో ఉచిత కంటివైద్య శిబిరం

మండలంలోని ముప్పవరం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ ప్రతినిధులు చిలుకూరి వీరరాఘవయ్య, గరిమిడి జగన్మోహన్‌లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు, శంకర్ కంటివైద్యశాల పెదకాకాని వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

తెలంగాణ ఆర్టీసీ బస్సు బోల్తా

● తిరుపతి నుంచి బీహెచ్ఈఎల్‌కు వెళ్తుండగా ఘటన
● బస్సులో మొత్తం 26 మంది ప్రయాణికులు
● గాయపడిన వారిని ఒంగోలు రిమ్స్‌కు తరలింపు



బోల్తా పడిన తెలంగాణ ఆర్టీసీ బస్సు

అద్దంకిటౌన్, ఆగస్టు 16: టీఎస్ఆర్టీసీ ఏసీ బస్సు బోల్తా పడింది.శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్ బీహెచ్ఈఎల్ డిపోకు చెందిన టీఎస్09 జెడ్7880 నెంబరు గల ఏసీ బస్సు తిరుపతి నుంచి బీహెచ్ఈఎల్ వెళ్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి 2.30 గంటల సమయంలో అద్దంకి - మేదరమెట్ల రోడ్డులోని ధేనువకొండ ఘనరావాసకాలనీ వద్దకు వచ్చే సరికి రోడ్డు మరమ్మతులు చేస్తూ మధ్యలో పెట్టిన ప్లాస్టిక్ దిమ్మెలను ఢీ కొట్టి అదుపు తప్పి బోల్తా పడింది. బస్సులో మొత్తం 26 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, ఒక సహాయకుడు ఉన్నారు. బస్సు వేగం తక్కువగా ఉండడంతో బస్సు ఒక పక్కకు బోల్తా పడగా ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడ్డారు. ప్రమాదం జరిగిన కొంత సమయంలోనే ప్రయాణికులు అందరు తేరుకుని బయటకు వచ్చారు. వారిలో కొందరికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించారు. అనంతరం తెల్లవారుజామున బోల్తా పడిన బస్సును క్రేన్‌ల సహాయంతో లేపి పక్కకు పెట్టి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



సింథైట్ ఫ్యాక్టరీలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

మేదరమెట్ల, ఆగస్టు 16: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కొరిశపాడు తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సింథైట్ ఫ్యాక్టరీ ఆవరణంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన మొక్కలు నాటారు. కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఫ్యాక్టరీ ఆవరణంలో, గ్రామంలో మొక్కలు నాటుతున్నామని జీఎం మహేంద్ర తెలిపారు. మొక్కలు నాటడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని డిప్యూటీ తహసీల్దార్ మెహతాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పోతురాజు, వీఆర్వో రాజశేఖర్‌రెడ్డి, అధికారులు సలాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

వేటపాలెం(చీరాల), ఆగస్టు 16 : మండలంలోని పందిళ్లపల్లి పరిధిలో శుక్రవారం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. తదుపరి చర్యలకు రెవెన్యూకు అప్పగించనున్నారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు ఎవరు పాల్పడ్డా ఉపేక్షించేది లేదన్నారు.

నేటితరం నాయకులకు మార్గదర్శకులు వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చీరాల, ఆగస్టు 16 : దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి నేటి తరం నాయకులకు మార్గదర్శకులని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేడికొండ భరణీరావు, శంకరశెట్టి నాగేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, తడవర్తి చంద్రశేఖర్, మనోహర్‌రెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఛైర్‌పర్సన్



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, ఆగస్టు 16: అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను అద్దంకి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, వైస్ ఛైర్మన్‌లు దేసు పద్మేష్, అనంతలక్ష్మిలతో పాటు వైసీపీ కౌన్సిలర్లు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మంత్రి సమీక్ష రోజు అటువైపు రాని ఛైర్మన్, వైసీపీ కౌన్సిలర్లు శుక్రవారం అన్న క్యాంటీన్ వద్దకు వచ్చి కలవడం రాజకీయ వర్గాలల్లో చర్చనీయాంశంగా మారింది.

బాకీ చెల్లించమన్నందుకు దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

చీరాలటౌన్, ఆగస్టు 16 : ఇచ్చిన బాకీ తిరిగి చెల్లించమన్నందుకు వ్యక్తిని ఇరువురు దాడి చేశారు. ఈఘటన శుక్రవారం మధ్యాహ్నం పురపాలక పరిధిలోని విఠల్‌నగర్‌లో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బోడిపోగు నాని తప్పెడ పలకలు వాయిస్తూ జీవిస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన అండర ఆశీర్వాదం కుటుంబం అవసరాల నిమిత్తం నాని వద్ద రూ. 10 వేలు అప్పుతీసుకున్నాడు. దీంతో రోజులు గడుస్తుండటంతో నాని నిలదీశాడు. దీంతో ఆశీర్వాదం, రవికుమార్‌లు ఆయనపై తీవ్రంగా దాడి చేశారు. ఈక్రమంలో అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

టీడీపీ సీనియర్ నాయకులు ఆంజనేయులు మృతి



ఆంజనేయులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, ఆగస్టు 16 : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని చుండిబజారుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మాచవరపు ఆంజనేయులు(65) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆంజనేయులు మృతి పార్టీకి తీరని లోటని చినగంజాం గ్రామ టీడీపీ అధ్యక్షులు చెరుకూరి రాఘవయ్య అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆంజనేయులు స్వగృహం వద్ద ఆయన పార్థివదేహానికి టీడీపీ నాయకులు రాయని ఆత్మారావు, అబ్దుల్‌కలాంఅజాద్, రాఘవయ్య, మోటుమర్రి రామసుబ్బారావు, కోట శివరామకృష్ణ, షేక్ జిలాని, మాచవరపు రామాంజనేయులు, పర్వతరెడ్డి పార్థసారథి, ఎం.లక్ష్మయ్య, షేక్ బాజీ, వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆంజనేయులుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

చీరాల, ఆగస్టు 16 : సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ తదితరులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. న్యాయవాది మస్తాన్‌రావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుగురు సీఐల బదిలీ

నెల్లూరు(క్రైం): గుంటూరు రేంజ్ పరిధిలో ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా రేంజ్ వీఆర్‌లో ఉన్న జీ వేణును నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు, అక్కడ విధులు నిర్వహిస్తున్న మారుతీ కృష్ణను రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న షేక్ సుభానీని నెల్లూరు నార్త్ ట్రాఫిక్‌కు అక్కడ విధుల్లో ఉన్న శివాజీని రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న జీ రాజేశ్వరరావును కావలి రూరల్ పోలీసు స్టేషన్‌కు, అక్కడ విధుల్లో ఉన్న కే శ్రీనివాసరావును రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.





నెల్లూరు : రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతం

హరివల్లభే భక్తవరదే !

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- ఇంటింటా లక్ష్మీపూజ
- భక్తులతో ఆలయాలు కళకళ

నెల్లూరు (సాంస్కృతికం) : శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని జిల్లా వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇంటింటా కలిశాలు ఏర్పాటు చేసి లక్ష్మీదేవిని ఆవాహన చేశారు. తోరము ధరించి వాయనాలిచ్చి ముత్తైదువుల ఆశీస్సులు అందు కున్నారు. ఆలయాల్లో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాన్ని, లక్ష కుంకుమార్చన జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. పలుచోట్ల అన్న ప్రసాద వితరణ జరిగింది. నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. మూల వర్లకు విశేష అభిషేకాలు, నవావరణ పూజలు, పూలంగి సేవ జరిగాయి. అనివెట్టి మండపంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తి వరలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ప్రధాన అర్చకుడు రఘునాథశర్మ, వేదపండితుడు రామకృష్ణ భక్తులతో వ్రతం చేయించారు. ఈ సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం విశేష పల్లకీసేవ, కుంభహారతులు జరిగాయి. ఆలయం చైర్మన్ రత్నం జయరామ్, ఈవో సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య పర్యవేక్షించారు.



రాపూరు : పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారు.



కావలి : బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



వడ్డిపాళెం సెంటర్‌లో బైఠాయించిన నారాయణ వైద్యులు, మెడికోలు

కోల్‌కతా ఘటన

గర్జించిన వైద్యలోకం

- జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది నిరసనలు
- నిందితులపై కఠినంగా వ్యవహరించాలి
- సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 16 : కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో శిక్షన వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరశిస్తూ శుక్రవారం జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది, మెడికోలు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతబట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ ప్రదర్శనలు చేపట్టారు. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేసి మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నెల్లూరులోని ప్రభుత్వం వైద్య కళాశాల వైద్యులు, మెడికోలు వైద్య విద్య కళాశాల నుంచి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా జీజీహెచ్‌లో ఓపీ సేవలు నిలిపి వేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జునాయిద్ ఆల్ అహ్మద్, జోయల్, హితేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. శనివారం కూడా ఆసుపత్రిలో ఓపీ సేవలు నిలిపి వేస్తామని వైద్యులు వెల్లడించారు. అలాగే నారాయణ వైద్య కళాశాలలోనూ వైద్యులు, మెడికోలు ఆందోళన చేపట్టారు. కళాశాల నుంచి వడ్డిపాళెం వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాత్రింబవళ్లు సేవలు అందించే వైద్యులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్య కళాశాల, డెంటల్ కళాశాల వైద్యులు, మెడికోలు, నారాయణ ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జీజీహెచ్ ప్రాంగణంలో ప్రభుత్వ వైద్య విద్య కళాశాల వైద్యులు, మెడికోలు

● నేడు ఓపీ సేవలు నిలిపివేత

కోల్‌కతాలో జరిగిన ఘటనపై జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రులలో శనివారం ఓపీ సేవలు నిలిపి వేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంసీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు. అత్యవసర వైద్యసేవల్లో మాత్రమే పాల్గొంటామని తెలియచేశారు. వైద్యురాలిపై జరిగిన ఘటనపై సీబీఐ ఆధ్వర్యంలో నేరపరిశోధన త్వరితగతిన చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందికి తగిన రక్షణ కల్పించేందుకు కేంద్రస్థాయిలో ప్రత్యేక చట్టాలు తీసుకు రావాలని కోరారు.

నేడు ఉపరాష్ట్రపతి రాక

● పర్యటనలో స్వల్ప మార్పు : కలెక్టర్



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 16 : భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శనివారం జిల్లా పర్యటనకు వస్తున్నారని, ఆయన పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.35గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలు దేరి 9.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలు దేరి 10.30 గంటలకు నెల్లూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా 10.50 గంటలకు వెంకటాచలంలోని అక్షర విద్యాలయానికి చేరుకుని అక్షర విద్యాలయం, స్వర్ణభారత్ ట్రస్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 1.20 గంటలకు పోలీస్ పరేడ్ మైదానం నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా రేణిగుంట విమానాశ్రయానికి వెళతారని తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

నెల్లూరు (క్రైం) : ఉపరాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ పర్యటన సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. శుక్రవారం పోలీసు పెరేడ్ మైదానంలో పోలీసులతో ఆయన మాట్లాడుతూ అందరూ సమన్వయం పాటిస్తూ కేటాయించిన విధుల్లో పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● నెల్లూరుకు చేరుకున్న గవర్నర్

వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టు వార్షికోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు శుక్రవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు. విజయవాడ నుంచి రైలులో వచ్చిన వారికి రైల్వేస్టేషన్‌లో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, ఆర్డీఓ మలోల ఘన స్వాగతం పలికారు. శనివారం ఉదయం వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకల్లో గవర్నర్ దంపతులు పాల్గొంటారు.

385 మందికి కృత్రిమ అవయవాలు

● మూడు రోజులపాటు శిబిరం నిర్వహణ




శిబిరానికి తరలివచ్చిన వారిని పలకరిస్తున్న వెంకయ్యనాయుడు, పక్కన మంత్రి ఆనం

వెంకటాచలం, ఆగస్టు 16 : వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో శుక్రవారం స్వర్ణభారత్ ట్రస్ట్, భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయ సమితి (హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాల ఉచిత అమరిక శిబిరాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రారంభించారు. శిబిరంలో ఆపన్నులను వారు ఆప్యాయంగా పలకరించారు. తొలిరోజు 385 మంది లబ్ధిదారులు శిబిరానికి విచ్చేసి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోగా, అక్కడున్న సిబ్బంది వారందరి కొలతలు తీసుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారందరికీ భోజనం, వసతి ఏర్పాట్లు చేశారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ పర్యవేక్షణలో లబ్ధిదారులకు వీల్‌ఛైర్లు, వాకర్లు, క్రచెస్‌ను పంపిణీ చేశారు. ఈ శిబిరం మూడు రోజులపాటు సాగుతుందని స్వర్ణభారత్ ట్రస్ట్ సమన్వయకర్త జనార్ధన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ అట్లూరి అశోక్, భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయసమితి కార్యదర్శి ఇంద్రకుమార్‌జైన్, ప్రదీప్‌జైన్ పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది. ఆ సత్యాన్ని గుర్తించిన తెలుగుదేశం ప్రభుత్వం పట్టణ పేదల ఆకలి తీర్చడం కోసం 2014-19 మధ్య అన్నా క్యాంటీన్లు తెరిచింది. ప్రజాస్వామ్య విలువలను, ప్రతిపక్షాల ఉనికిని ఏమాత్రం లెక్కచేయని, సహించని మనస్తత్వం కలిగిన వైసీపీ అధినాయకత్వం నిర్దయగా ఆ క్యాంటీన్లను మూసివేసింది. పేదల ఆకలి పట్టని పాలకులను గడిచిన ఎన్నికల్లో ప్రజలు సాగనంపారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అని నినదించే తెలుగుదేశం పార్టీకి తిరిగి పట్టం కట్టారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పుతో తిరిగి పేదల ఆకలి తీరే మార్గం దొరికింది. బతుకుదెరువు కోసం పొట్ట చేతపట్టుకొని పట్టణాలకు వచ్చే పేదల కోసం మళ్లీ అట్టహాసంగా అన్నా క్యాంటీన్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



ఆకలి తీరింది!

- జిల్లావ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ప్రారంభం
- నెల్లూరులో 7, కావలి, కందుకూరులో ఒక్కొక్కటి
- రూ.5లకే కడుపు నింపుకున్న పేదలు

నెల్లూరు నగరాన్ని ఆసరా చేసుకొని కొన్ని వేల పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎంత శ్రమించినా దొరికే కూలి అంతంత మాత్రమే. బస్సు, ఆటోల చార్జీలు, టిఫిన్, భోజనాలకు సగం కూలి ఖర్చయిపోతుంది. కొందరు తింటున్నా.. మరికొందరు ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆకలితో ఉండిపోతున్నారు. ఇది గుర్తించిన తెలుగుదేశం ప్రభుత్వం 2014-19 మధ్య కాలంలో పట్టణాల్లో అన్న క్యాంటీన్లను తెరిచింది. అతి తక్కువ ధరకు భోజనం అందించారు. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్లను మూసివేసింది. దీంతో ఐదేళ్లపాటు పేదజనం అర్థాకలితోనే బతికారు. ఎట్టకేలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ పేదల ఆకలి తీర్చేందుకు కంకణం కట్టుకుంది. శుక్రవారం రోజు జిల్లావ్యాప్తంగా తొమ్మిది అన్న క్యాంటీన్లను ప్రారంభించింది.

● అట్టహాసంగా ప్రారంభం

నెల్లూరు నగరంలో ఏడు, కావలి, కందుకూరులలో ఒక్కొక్కటి చొప్పున అన్న క్యాంటీన్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నెల్లూరులో రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలతోపాటు కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ తదితరులు వివిధ ప్రాంతాల్లో క్యాంటీన్లను ప్రారంభించారు. ఇక కావలిలో ఎమ్మెల్యే కావ్యకృష్ణారెడ్డి, కందుకూరులో ఇంటూరి నాగేశ్వరరావు క్యాంటీన్లను ప్రారంభించి, స్వయంగా పేదలకు వడ్డించారు.

విరాళాల వెల్లువ

కందుకూరు : అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం పలువురు దాతలు తొలిరోజే భారీగా విరాళాలు అందజేశారు. కందుకూరులో టీడీపీ నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లు రూ.55555, తానికొండ ప్రవీణ్ రూ.50వేలు, కాకుమాని ప్రవీణ్ రూ.25వేలు, ఎర్రారెడ్డిపాలెం గ్రామ నాయకుడు రాజవరపు మాలకొండయ్య రూ.25,116, కొత్త వెంకటేశ్వర్లు, కొత్తూరు వెంకట సుధాకర్, గుర్రం వెంకటేశ్వర్లు, సుదర్శి శ్యాంప్రసాద్, షేక్ నజీర్ బాషా తలా పదివేల రూపాయలు వంతున ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుకు అందజేశారు. అలాగే మోదడుగు లక్ష్మణ్‌కుమార్ రూ.5116, చాకిచర్ల గ్రామనాయకుడు మిరియం మల్లిఖార్జున రూ.5500, ముచ్చు రామకోటయ్య రూ.5116, చల్లా మీనాక్షి రూ.5వేలు, మరికొందరు దాతలు తలా రూ.వెయ్యి చొప్పున అందించారు.

● **కావలి :** పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నడిచే అన్న క్యాంటీన్ కోసం కావలి అభయం స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష రూపాయల విరాళం చెక్కును ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి అందించారు.

● **నెల్లూరు రూరల్ :** రామలింగాపురం వద్దనున్న అన్న క్యాంటీన్‌కు గోశాల సురేంద్రరెడ్డి రూ.5 వేలు అందచేశారు.



కావలిలో రూ.లక్ష విరాళం చెక్కును ఎమ్మెల్యేకు ఇస్తున్న అభయం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

● రోజుకు రూ.15లే!

ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఖర్చు కేవలం రూ.15లే. పూటకు ఐదు రూపాయల వంతున క్యాంటీన్లలో వసూలు చేస్తున్నారు. ఉదయం మూడు ఇడ్లీలు, లేదా మూడు పూరీలు, మధ్యాహ్నం అన్నం, పప్పు, సాంబార్, పెరుగు, పచ్చడి వడ్డిస్తారు. ఐదేళ్ల తరువాత తమ ఆకలి తీర్చడం కోసం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం పట్ల పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.



నెల్లూరు : ఫిష్ మార్కెట్ వద్ద మంత్రి నారాయణ, టీడీపీ నేతలు అజీజ్, కోటంరెడ్డి తదితరులు



అన్న క్యాంటీన్‌లో కలెక్టర్‌తో కలిసి టిఫిన్ చేస్తున్న మంత్రి ఆనం



నెల్లూరు : స్టోన్‌హౌస్‌పేటలోని క్యాంటీన్ వద్ద క్యూలో జనం

ఈ నిర్ణయం అద్భుతం!



పెద్దోళ్ల సంగతే మోకానీ మాలాంటి చిరు వ్యాపారులకు ఈ అన్న క్యాంటీన్లు చాలా ఉపయోగ పడతాయి. ఈ రోజుల్లో రూ.5లకు ఏం వస్తుంది చెప్పండి. టీనీళ్లు కూడా రావడం లేదు. అలాంటిది కడుపునిండా అన్నం దొరుకు తుందంటే ఆశ్చర్యమే. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అద్భుతం. పేదవాళ్లకి కడుపు నిండిందంటే చాలా కష్టాలు తీరినట్టే.

- వెంకటరమణయ్య, పూలవ్యాపారి, నెల్లూరు

ఇక ఆకలి బాధుండదు!



నిద్రలేచినప్పటినుంచి బతుకు దెరువు కోసం పరుగులు తీసే మాలాంటి కార్మికులం వేళకు భోజనం లేక, వందలు ఖర్చు చేసి హోటల్లో భోజనం చేసే స్థోమత లేక అర్థాకలితో అలమటిస్తున్నాం. అన్నా క్యాంటీన్ ప్రారంభంతో మా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేకున్నాం. ఉదయం కేవలం ఐదు రూపాయలకే పొంగళి, రెండు ఇడ్లీ, ఒక పూరీ పెట్టారు. ఇడ్లీలు కూడా పెద్దవిగా ఉండటంతో కడుపు నిండిపోయింది. మధ్యాహ్నం అన్నం కూడా ఇక్కడే చేశాను. వేళకు తిండి గురించి ఆలోచించాల్సిన అవసరం లేనందున మరో ఐదారు వందలు అదనంగా సంపాదించుకోగలుగుతాం.

- కొచ్చర్ల మాల్యాద్రి, ఆటో డ్రైవరు, కందుకూరు

వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి



కావలి : హత్యకు గురైన వైద్యురాలి ఫొటో ప్రదర్శిస్తున్న డాక్టర్లు



ఉదయగిరి రూరల్: నిరసనలో పాల్గొన్న వైద్యఆరోగ్య సిబ్బంది

సీతారామపురం ఆగస్టు 16: మహిళావైద్యులకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేసి వారికి రక్షణ కల్పించాలని మండల వైద్యాధికారి స్వప్న డిమాండ్ చేశారు. కోల్‌కత్తా ఆర్‌జీకే ఆర్ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ఆమె బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు భవ్యశ్రీ, ఎంపీహెచ్ ఈవో మజీద్, రియాజ్, పీహెచ్ ఎన్ క్రిష్టమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ తిరుపాల్ రెడ్డి, శేఖర్‌రాజు, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ల్యాబ్ టెక్నీషియన్ షబానా వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ ను అత్యాచారం చేసి హత్య చేసిన వారిని శిక్షించాలని గండిపాళెం ప్రాథమి క ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి శివకల్పన డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక పాత సామాజిక కేంద్రం ఆవరణలో వైద్యఆరోగ్య సిబ్బందితో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలని మహిమలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి అనూష ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే వైద్యులకు రక్షణ లేక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏఎస్ పేట: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లబ్యాడ్జీలు ధరించి దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చే శారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.



సీతారామపురం: నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది



బిట్రగుంట : కోవూరుపల్లి పీహెసీ వద్ద నిరసన

కావలి: కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఈ నెల 9వ తేదీన డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనలో న్యాయం కోరుతూ శనివారం కావలిలో అన్ని ప్రైవేట్ వైద్యశాలల్లో అత్యవసరం మినహా మిగిలిన అన్ని వైద్యసేవలను 24గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ బాధ్యులు తెలి పారు. కావలి ఐఎంఏ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో హత్యకు గురైన డాక్టర్ చిత్రంతో ఉన్న కరపత్రాలను వైద్యులు ఆ విష్కరించారు. ఈ సందర్భంగా ఐఎంఏ కావలిశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కే. సుబ్బారావు, గోపీ, కోశాధికారి శివప్రసాద్ మాట్లాడుతూ ఐఎంఏ పిలుపు మే రకు దేశవ్యాప్తంగా చేస్తున్న నిరసనలో భాగంగా కావలిలో కూడా చేపడుతు న్నట్లు తెలిపారు. డాక్టర్లు అందరూ వారి వైద్య సేవలను శనివారం మూ సి వేసుకుని ఏరియా వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో పాల్గొం టారన్నారు. అత్యవసర మైతేనే అక్కడ నుంచి సొంత క్లినిక్‌లకు వెళ్లి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. వైద్యురాలు అత్యాచారం, హత్యపై విచారణకు ప్రత్యేక కోర్టును ఏ ర్పాటు చేసి సీబీఐ ఆధ్వర్యంలో త్వరితగతిన నేర పరిశోధన పూర్తి చేసి నేరానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రులలో వైద్యులు, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించే వ్యవస్థను కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. డిమాండ్లు సాధించే వరకు ఉద్యమాలు కొన సాగిస్తామని చెప్పారు.

కొండాపురం: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యం అమానుషమని మండల వైద్యాధికారులు నసీరుద్దీన్, డాక్టరు భవ్య పేర్కొన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ వైద్యశాల దగ్గర భోజనవిరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిరసనలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి: జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది నిరసన తెలిపారు. విధుల్లో ఉన్న వైద్యురాలిపై మానవీయ విలువలు మరచి దుశ్చర్యలకు పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బంది రక్షణకు ప్ర భుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బిట్రగుంట: జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి అమానుషంగా చంపిన వారిని కఠినంగా శిక్షించాలని కోవూరుపల్లి పీహెసీ వైద్యులు జహారిక, ప్రవీణ్‌కుమార్ అన్నారు. జూనియర్ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దివ్య, సూపర్‌వైజర్లు, పీహెసీ ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వరికుంటపాడు, ఆగస్టు 16: తెలుగుదేశం కార్యకర్తలకు సమస్య వస్తే అండగా ఉంటామని శాసనసభ్యులు కాకర్ల సురేష్ సోదరుడు కాకర్ల వెంకట్ తెలిపారు. ధర్మవరంలో నెలకొన్న భూ వివాదంలో గాయపడిన తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారాయణతో పాటు అనుచరులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఘర్షణకు గల కారణాలు తెలుసుకున్నారు. ఎలాంటి వివాదాలకు పాల్పడకుండా సమన్వయం పాటించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్ర, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, సీనియర్ నాయకులు చంద్ర ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గండిపాళెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు గురుకుల పాఠశాలలో నిర్వహించిన వివిధరకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలోని విజేతలకు శుక్రవారం బ్యాంకు మేనేజర్ కె.శోభన్ బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పరాజ్, ఫీల్డ్ ఆఫీసర్ ఇంతియాజ్, బ్యాంకు సిబ్బంది షేక్ చినఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటినుంచి పాఠశాల సముదాయ సమావేశాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: మండలంలో శనివారం నుంచి సోమవారం వరకు పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పాఠశాల నుంచి 50శాతం మంది ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మాతమ్మ తిరునాళ్లకు విరాళం

ఆత్మకూరు, ఆగస్టు 16: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు అరుదతీయవాడలో వెలసిన శ్రీమాతమ్మ తిరునాళ్ల ఉత్సవాల నిర్వహణకు వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎస్‌వీపీ ప్రజావైద్యశాల ఎండీ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ శుక్రవారం నిర్వాహకులకు రూ.10వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన సీడీపీవో

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పచ్చవ లావణ్య శుక్రవారం విధుల్లో చేరారు. వ్యక్తిగత కారణాలతో ఆమె మే 16నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు సెలవులో ఉన్నారు. సెలవులు పూర్తి కావడంతో తిరిగి విధుల్లో చేరారు.

ఉత్సవాలు ప్రారంభం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: కృష్ణంపల్లి సీతారామచంద్ర ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, విగ్రహాల జలాధివాసం తదితర పూజలు చేపట్టారు. ఈ పూజల్లో స్థానికులే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: వరి పంట సాగు చేసే రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులునాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన గుడినరవ, గండిపాళెంలోని వరి పంటలను పరిశీలించారు. పంట సాగు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. రైతుసేవా కేంద్రాల్లో పాడైన టీవీలు, కియోస్కుల వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుళ్లామన్నారు.

మందుబాబుల ఆందోళన

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16: స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద శుక్రవారం మందుబాబులు ఆందోళన చేపట్టారు. దుకాణాల్లో పనిచేసే సిబ్బంది బ్రాండెడ్ మద్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ చీప్‌లిక్కర్‌ను మాత్రమే తమకు విక్రయిస్తున్నారంటూ ఆరోపించారు. బీర్లు కూలింగ్ పెట్టకుండా అమ్మకాలు చేస్తున్నారని, చిల్లర విషయంలో సైతం సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. సిబ్బందితో వాదనకు దిగారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

సంగం, ఆగస్టు 16: విద్యారంగంలో విశేష సేవలందజేసి స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు ఎంఈవో జానికీరాం. ఈయన్ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిసి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆపస్ నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్, బాబు, జయప్రకాశ్ ఉన్నారు.



సంగం: ఎంఈవో జానికీరాంను సత్కరిస్తున్న ఆపస్ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వైద్యఆరోగ్య అధికారి పెంచలయ్య చేతుల మీదుగా నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య పర్యవేక్షకుడు షేక్ రియాజ్ ప్రతిభా అవార్డు అందుకున్నారు. స్థానిక మండల సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి, ఉద్యోగులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సంధ్యాలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రామ్మో హన్, కార్యదర్శులు పాల్గొన్నారు.



అనంతసాగరం: పైలెట్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

అనంతసాగరం: స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది 108 పైలెట్ చింతగుంట నరసిం హారెడ్డిని సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నరసింహారెడ్డికి బెస్ట్ పైలెట్‌గా అవార్డు రావడం అభినందనీయమన్నారు. డాక్టర్ శ్రావణి, ఈఎంటీ సురేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 16: గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్యం లోపించ కుండా పంచాయతీ, వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుం డా చూడాలన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి ఎంపీడీవో సంధ్యారాణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి

మంత్రి ఆనంను కలిసిన అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు



మంత్రి ఆనంను పూలమాలతో సత్కరించిన రాజరాజేశ్వరానందస్వామి

సంగం, ఆగస్టు 16: దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, తిరుమనకొండ రాజరాజేశ్వరిదేవీ, కాశీ విశ్వేశ్వరస్వామి ఆశ్రమ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి నెల్లూరులోని మంత్రి ఇంట్లో కలసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువైన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దేవాలయాలకు ధూపదీప నైవేద్యాలకు పెద్దపీట వేశారన్నారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి పూలమాలతో సత్కరించి దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, పగడాల రఘురామయ్య ఉన్నారు.

దాతల ఔదార్యం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 16: నర్రవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలువురు దాతలు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. తుమ్మల చినవెంగయ్య పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన వారికి నగదు అందజేశారు. అలాగే పచ్చవ ప్రసాద్ రూ.3లక్షలతో అధునాతన భోజనశాలను ఏర్పాటు చేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పదిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యా ర్థులకు రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేల చొప్పున అందజేశారు. పాఠశాలలో వలంటీర్లకు పచ్చవ వెంకట రాకేష్ రూ.60 వేలు అందజేశారు. దాతలను ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.



విద్యార్థికి నగదును అందజేస్తున్న తుమ్మల చినవెంగయ్య

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సౌభాగ్యమివ్వు.. వరలక్ష్మీ!

- భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో వరలక్ష్మీవ్రత పూజలు



బిట్రగుంట : కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు



కావలి ముసునూరులో ప్రత్యేక అలంకారంలో మహాలక్ష్మమ్మ



ఆత్మకూరు: ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మీదేవి

సంగం, ఆగస్టు 16: పెన్నానది ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కామాక్షిదేవి ఉత్సవ విగ్రహానికి క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. పూజల్లో మహిళలు అధి క సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, కన్యకాపరమేశ్వర ఆలయం, అలఘునాథస్వామి ఆలయం, బీఎస్ఆర్ సెంటర్‌లోని మహాలక్ష్మీదేవి ఆలయాల్లో వేకువజామునుంచే ప్రత్యేక పూజలు చేశారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలోని సంతానలక్ష్మి ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కలువాయి: కుల్లూరులోని మహాలక్ష్మి ఆలయంలోని అమ్మవారికి మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. అంతకుముందు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన చేశారు. భక్తులకు నందిరెడ్డి పోలయ్య, ధనమ్మలు అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దర్శిచెంచు వినయ్‌కుమార్, సుజన దంతులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : శ్రావణం మాసం 2వ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కావలి గ్రామ దేవత కలుగోళ శాంభవి, కన్యకాపరమేశ్వరి, విష్ణాలయంలోని రాజ్యలక్ష్మి, బృందావనం కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, సత్యసాయి మందిరం, ముసునూరు మహాలక్ష్మమ్మ ఆలయం, వెంగళరావు నగర్‌లోని ఆలయాల సముదాయంలో పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని సామూహిక వ్రత పూజలు నిర్వహించారు.



కావలిటౌన్ : సత్యసాయి మందిరంలో సామూహిక వరలక్ష్మీవ్రతంలో భక్తులు



కందుకూరు : మాచవరం అయ్యాలరెడ్డి కొండపై సామూహిక వరలక్ష్మీవ్రతంలో మహిళలు



కలువాయి : కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



కావలి బృందావనం కాలనీలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కావలి రూరల్ : ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో ఉండాలని ఎమ్మెల్యే కావ్య క్రిష్టారెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం రాజువారిచింతలపాలెంలోని విజయదుర్గ ఆస్థానపీఠంలో పత్రి వీర బ్రహ్మయ్య స్వామి ఆధ్వర్యంలో జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య క్రిష్టారెడ్డికి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో స్వాగతం పలికారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొండాపురం : మండలంలో ప్రజలు శ్రావణ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి తమ సౌభాగ్యాన్ని కాపాడాలంటూ లక్ష్మీదేవికి పూజలు చేశారు.

బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ వ్రత పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు సత్యనారాయణ చార్యులు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీదేవీ భూదేవి సమేత శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో రాధాకృష్ణ, అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, కళ్యాణాచార్యులు పర్యవేక్షించారు.

కందుకూరు : శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీవ్రతం కార్యక్రమాన్ని కందుకూరు పట్టణం, పరిసర గ్రామాలలో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్దబజారులో ఉన్న కోదండరామాలయంలో, మాచవరంలోని అయ్యాలరెడ్డి కొండపైన నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల లో వందలాది మంది మహిళలు పాల్గొని వ్రతమాచరించారు. ఈ సందర్భంగా పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో వరలక్ష్మీవ్రతం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.



సంగం : వ్రతంలో పాల్గొన్న మహిళలు

పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యాంటీన్

- కావలిలో ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 16: పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యాంటిన్‌లను రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రాంభించిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చెప్పారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌ను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే ప్రాంభించారు. ఎమ్మెల్యే స్వయంగా పేదలకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి భుజించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి భుజించే భాగ్యం కలగడంతో నాజన్మ ధన్యమైందన్నారు. మొదటి రోజు మూడు పూటలకు అయ్యే ఖర్చునంతా తానే భరిస్తానని చెప్పారు. పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌లను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి పేదల కడుపు కొట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2 నెలలకే తిరిగి ప్రారంభించి ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబురావు, చవల రామకృష్ణ, బీజేపీ నేత కే.బ్రహ్మానందం, జనసేన నేత వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అల్పాహారం అందిస్తున్న ఎమ్మెల్యే

అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన కందుకూరు ఎమ్మెల్యే

కందుకూరు : కందుకూరు పట్టణంలో అన్న క్యాంటిన్‌ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం పునఃప్రారంభించారు. ముందుగా అధికారులు, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి క్యాంటిన్ సమీపంలో ఉన్న రావిచెట్టుకు పూజలు నిర్వహించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు ఆయన స్వయంగా అల్పాహారం వడ్డించటంతో పాటు ఆయన కూడా క్యాంటిన్‌లో అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతిరోజు 500 మందికి తక్కువ కాకుండా పేదలు అన్న క్యాంటిన్‌లో ఆకలి తీర్చుకున్నారని, గడచిన ఐదేళ్ల జగన్ పాలనలో ఆయన పైశాచికత్వం వల్ల పేదలు ఆకలితో ఇబ్బందిపడ్డారని తెలిపారు. ఇకముందు ఇబ్బందులు ఉండబోవని, కేవలం ఐదు రూపాయలకే అల్పాహారం, భోజనం అందించాలన్న చంద్రబాబునాయుడు సంకల్పం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, ఉన్నం వీరాస్వామి, బీజేపీ, జనసేన నాయకులు గట్టమనేని హరిబాబు, మదన్ తదితరులు పాల్గొన్నారు.



అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఫ్లోరోసిస్‌పై అవగాహన

బిట్రగుంట, ఆగస్టు 16: ఫ్లోరోసిస్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఫ్లోరోసిస్ నివారణ జిల్లా అధికారి దివ్య అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీలో ఫ్లోరోసిస్‌పై వైద్య సిబ్బందికి అవగాహన శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం పాతబిట్రగుంట సబ్‌సెంటర్‌ను సందర్శించారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి దివ్య

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

- జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి

బిట్రగుంట, ఆగస్టు 16: కేంద్రప్రభుత్వం ప్రజల ఆర్థికాభివృద్ధికి అందజేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం సామాన్యుడి ఎదుగుదలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఏనుగులబావి పంచాయతీ కొళ్లదిన్నెకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ యాదవ్, కావలి అసెంబ్లీ ఇంచార్జి సీవీసీ సత్యం పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత : ఎమ్మెల్యే

కావలిటౌన్, ఆగస్టు 16: రక్తదానం సామాజిక బాధ్యత ని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జనసేన నాయకులు సిద్ధు జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం బ్రిడ్జి కూడలిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 207మంది యువత రక్తదానం చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో రంగా యువసేన అధ్యక్షుడు దేవరకొండ శ్రీను, శ్రీధర్‌రెడ్డి, నారపరెడ్డి, రాజ్‌కుమార్ చౌదరి, తిరువీధి ప్రసాద్, గంగినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

అల్లూరు, ఆగస్టు 16 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి సమావేశానికి హాజరవుతారని తెలిపారు. సమగ్ర నివేదికలతో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహానికి స్థల పరిశీలన

జలదంకి, ఆగస్టు 16: మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీ తొమ్మిదో మైలు వద్ద ఎన్‌హెచ్167 బిజి జాతీయ రహదారి పక్కన ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు టీడీపీ నేతలు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు స్థల ఎంపిక చేసి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధుమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ స్థల పరిశీలనలో టీడీపీ నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, తల్లపనేని మధుసూదనరావు, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, స్వర్ణ కొండపనాయుడు, లింగంగుంట దశరథరామయ్య, గంగపట్ల మాలకొండయ్య, వల్లెపు ఏడుకొండలు, ముచ్చాల మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు సత్కారం

కావలి, ఆగస్టు 16: కావలి ఆర్డీవో శీనానాయక్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సక్షం ప్రతినిధులు ఆర్డీవో శీనానాయక్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమోహన్, డాక్టర్ కే.మాధవరెడ్డి, తిరుపతిస్వామి, మంగళగిరి వేణుగోపాల్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ.రవిప్రకాష్, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.